# సృజన

1025

65

ఫిబ్రవరి 1975

జన్మదిన సంచిక

Mx
30

నిర్వహణ
'సాహితీ మిత్రులు'

150 పైసలు

# సృజన

ఆధునిక సాహిత్య వేదిక

మాస పత్రిక

65

ఫిబ్రవరి 1975

జన్మదిన సంచిక

నిర్వహణ

' సాహితీ మిత్రులు '

150 పైసలు

SRJANA is commended for use in Public Libraries in the State by the Director of Public Libraries, Andhra Pradesh Hyderabad. Vide Ref. No. 182/A4/67, dated 22-9-1967.

Edited, Printed & Published by P. Hemalatha for 'Sahithee Mithrulu'
Printed at Venkataramana Mudranalayam,
J.P.N. Road, Warangal-506002 (A.P.)

## విప్లవ వాగదు....

"అయిపోయింది- అనంతపురం మహాసభల్లో విరసం విచ్ఛిన్నమైపోయింది"అని చంకలు గుద్దుకొంటున్నది, విరసానికి అగ్రశత్రువైన దోపిడీ ప్రభుత్వమూ, దాని పాదాలు నాకే వందిమాగధ రచయితల, కళాకారుల, పలాయనవాదుల సమూహమూ. చంకలు గుద్దుకొనేవారిని గుద్దుకోనివ్వండి. విరసం మాత్రం అవిచ్ఛిన్నంగా ముందుకే సాగిపోతుంది. విరసం సజీవమైంది- సాయుధ రైతాంగ పోరాటం ఉత్తేజంగా, మార్క్సిజం - లెనినిజం, మావో ఆలోచనా విధానం పునాదిగా, జనచైతన్యం బాసటగా వేయిపూవులుగా వికసిస్తుంది- వెల్లువగా ప్రవహిస్తుంది- నిస్సందేహంగా విరసం ముందుకే సాగిపోతుంది. "విరసంలో ఈ చీలికలు విప్లవానికి విఘాతం" అని విచార పడే సానుభూతిపరులూ వున్నారు. కానీ ఇది సరైన చారిత్రక అవగాహన, విశ్లేషణ లేకపోవడమే అవుతుంది. తమ స్వీయ మానసిక బలహీనతలను, సుఖానికి, భయాన్ని, పిరికితనాన్ని, రివిజనిస్టు దిగజారుడుతనాన్ని సిద్ధాంతం ముసుగులో దాచు కొని విరసంమీద, చారుమార్గంమీద బురదచల్లిన రైతాంగం, కార్మికవర్గం చైతన్యం మీద విశ్వాసం కోల్పోయిన విప్లవముఖ రివిజనిస్టు ముఠాను, రోగగ్రస్తమై కుళ్ళి పోయిన ఒక భాగాన్ని ఇప్పటికైనా విరసం బయటికి తొలగించివేయడం ఎంతో ఆరోగ్యకరమైన విషయం.

అయితే విరసం ఆత్మవిమర్శ చేసుకోవాలి. మార్క్సిజం-లెనినిజం, మావో ఆలోచనావిధానం గీటురాయిగా ప్రతి సభ్యుడూ తన లోపాలు దిద్దుకోవాలి. పోరాటం వేడిలో తన చైతన్యాన్ని, తన కలాన్ని, తన గళాన్ని, కుంచెని ఆయుధాలుగా మలచు కోవాలి. పీడిత ప్రజానీకంతో ఐక్యమై వారి విప్లవ చైతన్యాన్ని పెంచాలి. ప్రజలే మన అధ్యాపకులు గనుక కార్మిక, కర్షక, కష్టజీవుల జీవితాలు అధ్యయనం చేయాలి. వారితో కలిసిపోవాలి. వారి మనస్తత్వాలను, సమస్యలను సానుభూతితో అర్థంచేసు కోవాలి. వారిభాషలోనే రచనలు చేయాలి. సమాజంలో వర్గ సంఘర్షణను, వర్గ వైరుధ్యాలను మెలకువగా అధ్యయనం చేయాలి. పీడిత ప్రజల వర్గకసిని, ఆత్మవిశ్వా సాన్ని పెంచి వారి సమస్యల పరిష్కారమార్గాన్ని నిర్దేశించే వారి అజేయశక్తిని, దోపిడీ వర్గాల అనివార్య ఓటమిని, తెలిపే రచనలు కళలు వారి మనసుకుహత్తుకొనేలా అందిం చాలి. నక్సల్‌బరీ, శ్రీకాకుళం పోరాటవెలుగులో ఆవిర్భవించిన విరసం చారిత్రక బాధ్యత ఎంతో గురుతరమైనదనే విషయాన్ని ప్రతి సభ్యుడూ గుర్తించాలి.

* * *

తమ దోపిడీప్రపంచాన్ని కాపాడుకోడానికి అపారమైన ప్రజాధనాన్ని దుర్వ్యయం చేసి త్వరలో "ప్రపంచ తెలుగు మహాసభలు" అనే సర్కారీ సంబరాన్ని జరుపబోతు న్నారు ఏలికలు. తెలుగుభాష, తెలుగు సంస్కృతి పేరుచెప్పి ఆకలి, నిరుద్యోగం అవినీతివంటి తక్షణ సమస్యలనుండి ప్రజాదృష్టిని మరల్చడానికి చేసే కుటిలమైన ఎత్తు గడ యేతప్ప అది వేరుకాదు. నింతరదోపిడీకి వ్యతిరేకంగా జనుల హృదయాల్లో చెల రేగే సాయుధ విప్లవాలోచనను చల్లార్చి పలాయనవాద, విస్మరణవాద సంస్కృతీ సాహిత్య రొచ్చు గుంటలో పడేయాలనే కుట్రలో, నీచమైన ఎత్తుగడలో భాగమే ఈ 'ప్రపంచ తెలుగు మహాసభల' తిరునాళ్ళ తతంగం.

కార్మిక కర్షక, కష్టజీవులపక్షాన నిలబడి వారి చైతన్యంకోసం సాహిత్య సృష్టి చేస్తున్న విప్లవ రచయితలమీద కుట్రలపన్ని, వారిని తీవ్ర నిర్బంధాలకు గురిచేస్తూ, సుబ్బారావు పాణిగ్రహి, వెంపటాపుసత్యంవంటి ప్రజాకవులను పోరాటయోధులను కాల్చిచంపిన నెత్తురుచేతులు ఏర్పాటుచేస్తున్న ఈ 'ప్రపంచ తెలుగు మహాసభలు' యేదో పీడీవర్గాలకు ప్రాతినిత్యంవహిస్తాయో, యెవరి ప్రయోజనాలు కాపాడతాయో తెలుసుకో లేనంత వెర్రివెంగళప్పలుకారు ప్రజలు, ప్రజలనెత్తురుతాగి తేన్చే రాక్షసి తగిలించు కున్న "తెలుగు మహాసభల తెర"ను చీల్చి ప్రజలు పాలకవర్గాల స్వరూపాన్ని నగ్నంగా నిలబెడతారనడంలో మాకెట్టి సందేహంలేదు. ఇవాళ ప్రజలు, శ్రామికవర్గ సంస్కృతిని, విప్లవాన్నికోరుతున్నారు కానీ విస్మరణవాద, దోపిడీవర్గ కుటిల సాహి త్యాన్నీ, నిరుపయుక్తానుకాదు.

* * *

సృజన 5వ జన్మదిన సంచిక (మాసపత్రికగా) మీ చేతిలోవుంది. వేలాది కార్మిక, కర్షక, విద్యార్థి యువజనుల, రచయితల, కళాకారుల పాఠకుల, సానుభూతి పరుల ఆదరాభిమానాలే బాసటగా 'సృజన' విప్లవపథంలో అవిచ్ఛిన్నంగా ప్రయాణం సాగిస్తున్నది. మరింత విప్లవదీక్షతో, పోరాటచేవతో ముందుకుసాగేందుకు రచయితలు, పాఠకులు, నిర్మాణాత్మక సూచనలూ, రచనలూ అందజేయవలసిందిగా కోరుతున్నాం.

'సృజన' ఆర్థికంగా గడ్డుపరిస్థితిని ఎదుర్కొంటున్నది. కాగితపుధరా, ముద్రణా వ్యయం విపరీతంగా పెరిగిపోయిన విషయం లోగడ పాఠకులదృష్టికి తెచ్చినాము. పెట్టుబడిదారీ వ్యవస్థలో ఒకసారి పెరిగినధర తగ్గడమంటూ వుండదు. వున్నా అది స్వల్పమూ, తాత్కాలికమూ, పాఠకులూ, అభిమానులూ యథాశక్తి 'సృజన సహాయనిధి'కి విరాళాలు అందజేయవలసిందిగా, విరివిగా చందాదార్లను చేర్పించవలసిందిగా విజ్ఞప్తి చేస్తున్నాం. 'సృజన' ఈ 5వ జన్మదిన సందర్భంగా విప్లవానికి పునరంకితమవుతున్నది.

సాయుధ రైతాంగవిప్లవం వర్ధిల్లాలి!

### అపస్వరాలు

— నారా

ఆకలేస్తోందా నీకు?
ఆంధ్ర సంస్కృతి మహోజ్వలమైనది
తినడానికి తిండిలేదా నీకు?
తెలుగుభాష 'ఇటాలియన్ ఆఫ్ ది ఈస్ట్'
పోలీసులు నిన్ను చితగ్గొడుతున్నారా?
మనకి అంతర్జాతీయ ఖ్యాతి అవసరం-
నన్నయ్య గొప్పవాడు
నాకు ఆకలేస్తోంది
కృష్ణదేవరాయల రోజుల్లో......
ఒరేయ్, నాకు ఆకలేస్తోంది
ఏదేశమేగినా ఎందు కాలిడినా......
నీయమ్మ! నాకాకలేస్తోందిరా!

## ఎర్రజెండా అందిస్తా....

— కిరణ్

చిరుగు చింపులతోటి
తిరుగాడుతమ్ముడా
సుఖము లేదని నీవు
చింతనొందకురా
సుఖము లేదని నీవు
చింతనొందకురా ॥చిరుగు॥

అలసి సొలసి అమ్మ
తల్లడిల్లిందంట
ఆరోగ్యమేలేక
బాధపడుతుందంట
రేయీ పగలూయేల
వగచేవు తమ్ముడా
పోరాటమేలేక
బాధలెటుబోవురా ॥చిరుగు॥

పోలీసు పాలకులు
నను పట్టివేసిరని
భూస్వామ్య రాక్షసులు
ఎకసక్కెమాడిరని
చింతనొందెదవేల
నాచిన్ని తమ్ముడా
దోపిడీమూకలూ
అల్లె పల్కునురా ॥చిరుగు॥

చదువులెన్నోనీకు
చెప్పించలేకున్న
సుఖములన్నీనీకు
దక్కించలేకున్న
ఎర్రజెండానీకు
అందివ్వగలనురా
బరిశె బల్లెములిచ్చి
ధైర్యమిచ్చేనురా ॥చిరుగు॥

శ్రీకాకుళం నవ్వు
చినబాబు ఎవ్వరో
శత్రుగుండెలపైన
శరము యేలయ్యాడో
క్షణమైన మరువకను
చాటరా తమ్ముడా
చీకటుల చీల్చేటి
వెలుగువై నడువరా ॥చిరుగు॥

నిర్మలక్కా యెంత
ధైర్యముతో పోరిందో
శత్రుసేనల నెట్లు
వణికించి తరిమిందో
ధీర చరితలనువ్వు
మరువకో తమ్ముడా
వీరయోధునివోలె
విక్రమించుమురా ॥చిరుగు॥

పాణిగ్రాహీ పాట
పోరాట కాంతియై
గిరిజనులనందరిని
యెట్లు నడిపించిందో
ప్రజల గుండెలుపొంగ
ఎలుగెత్తి పాడరా
పోరాటదీక్షతో
ముందునకె సాగరా ॥చిరుగు॥

పేదసాదనిలేక
పెద్దచిన్ననిలేక
ముక్తి కోసమె జనులు
పోరాడుతున్నారు
సిటిలో చేపవలె
మసలకోతమ్ముడా
గాలిలో వాలువలె
సాగిపో తమ్ముడా ॥చిరుగు॥

చిరుగు చింపులతోటి
తిరుగాడుతమ్ముడా
సుఖము లేదనినీవు
చింతనొందకురా
ఎర్రజెండానీకు
అందివ్వగలనురా
ముక్తి కోసముపోరు
దారి విడువకురా ॥చిరుగు॥

## పోదాం కలిసి

ఎస్. కె.

పోదాం కలిసి పోరాటానికి
వస్తావా నువు నా వెంట
ప్రజలకోసమై ప్రాణం యిద్దాం
వుంటావా నువు నాజంట... ॥పో॥

కన్ను కన్ను కలుసుకుని
చేసే బాసలు ఏముంటయి
మనసూ మనసూ పరచుకుని
చెప్పే వూసులు ఏముంటయి
వుంటే ప్రాణం పోతే ప్రాణం
కమ్యూనిస్టులకు ప్రజలే ప్రాణం...
॥పోదాం॥

నువ్వూ నేనూ కలిసి తిరిగిన
పచ్చిక బయళ్ళు ఏమంటయి

నువ్వూ నేనూ కలిసి నడిచిన
బాటలు పేటలు ఏమంటయి
అడుగూ అడుగూ రక్తం మడుగు
కమ్యూనిస్టులది ముందడుగు...
॥పోదాం॥

అలసిన కన్నుల అలజడి గుండెల
అలగా పుట్టిన దేమంట
కలసిన చేతులు కసిగా ముడిచిన
పిడికిలి బిగింపు లేమంట
మార్గం ఒకటే సాయుధమార్గం
గెలిచే తీరును శ్రమవర్గం... ॥పో॥

(శివసాగర్ 'ఆకాశంలో సగం నీవు' యిచ్చిన యిన్స్పిరేషన్‌తో)

## ఒరేయ్! అప్రూవర్!

కె. ఆర్. కిరణ్

డియర్ కామ్రేడ్!
నో నో
ఒరేయ్! అప్రూవర్!
నిన్నగాక మొన్న—
ఎన్ని కష్టాలనైనా
చిరునవ్వుతో స్వీకరిస్తానన్నావ్
విప్లవం కోసం ప్రాణాలనైనా బలి
పెడతాగాని
విప్లవ ద్రోహిని కానని ప్రతిజ్ఞ
చేశావ్

కాని
ఈనాడు—
పోలీసుల చేతికి చిక్కగానే
సి.ఐ.డీల చేతిలో కీలుబొమ్మవై
ప్రభుత్వ యంత్రాంగంలో
మరమేకువై

స్వాతంత్ర్యంలేని బానిసవై
సిగ్గూ యెగ్గూ లేకుండా
చిరునవ్వు లొలకబోస్తూ
మా పై సాక్షమివ్వడానికే తయా
రయ్యావ్

మాత్రం కన్నా హీనమైన
దోపిడీగాళ్ళు పోసే
బ్రాందీ, విస్కీలు తాగి
వాళ్ళు కూయమన్న
దొంగ కూతలినల్లా
చిలుకలా పల్లిస్తున్నావ్

కుట్రల కేంద్రాలైన
ఈ దోపిడీవర్గం కోర్టుల్లో
మేం కుట్ర చేశామని
నీ విచ్చే దొంగ సాక్ష్యాన్ని
విక్రమిస్తున్న
విప్లవిస్తున్న
విశాల భారత పీడితప్రజ అసహ్యిం
చుకుంటుంది.

నీ విప్లవ విద్రోహాన్ని
బట్టబయలు చేస్తుంది
ప్రజాకోర్టు నీకు శిక్ష విధిస్తుంది.

## నేనం!

గళమెత్తి పాడతాను
చెయ్యెత్తి చాటుతాను
బాకుతీసి నరుకుతాను
బందూకెత్తి కాలుస్తాను

దౌర్జన్యం దోపిడీలు
ధరిత్రిపై ఉండనీయ
అన్యాయం అరాచకం
దరికసలే రానీయ

అడవుల్లో పుట్టినాను
ఆకాశం నా ఇంటి కప్పు
దిక్కులే నా ఇంటి గోడలు
పుడమంతా నా ఇల్లే

పేదవాళ్ళు నా బంధువులు
పీడితులే నా కవితా వస్తువులు
పోరాడేవాళ్ళంతా నా ఊపిరి తిత్తులు
శ్రామికవర్గ శ్రేయస్సే నా ప్రాణం.

## ఎర్ర వీరుడు

యం. వెంకటేశ్వరరావు

ఎర్రజెండా నీడ ప్రాణాలు వీడిన
ప్రియతమ రాఘవులు అమరుడే అమరుడని
చెయ్యెత్తి జై కొట్టి జోహార్లు చెప్పవోయ్ ॥ఎ॥

కష్టాలలో పుట్టి కష్టాలలో పెరిగి
కూలి నాలీలతో కలసికట్టుక తిరిగి
సమసమాజంబును స్థాపించడానికై
వడివడిగ అడుగిడిన ఎర్ర వీరుడు అతడు ॥ఎ॥

ప్రజల రక్తము పీల్చె భూస్వామ్య వర్గము
వర్గపోరాటాని కాటంకమని చెప్పి
శాశ్వపాలెములోన రాకాసి భూస్వామి
గుండెలను చీల్చిన రాఘవుండాతడు... ॥ఎ॥

ప్రజల మనిషిగ ఆడి ప్రజల మనిషిగపాడి
ప్రజలకై పోరాడి ఫాసిస్టు పాలనలో
ప్రాణాలు వీడిన కమ్యూనిస్టాతడు
నేతగాని రాఘవుండాతడోయ్ ॥ఎ॥

కుట్రలకు కుహకాలకెదురీది పోరాడి
సహచరుల స్వేచ్ఛకై మృత్యువుతో పోరాడి
పోరాటమే లేక ప్రజకేమి లేదని
అరుణ కాంతులతోన అమరవీరుండయ్యె. ॥ఎ॥

(అమరవీరుడు కా॥ రాఘవులు అరుణారుణ స్మృతికి)

కథ:

# పట్టివేత!

రెడ్‌సన్

చుట్టూ ఎత్తయిన కొండలు. కొండలకింద వాటి పొడవునా వ్యాపించిన అడవి. అడవికి ఫర్లాంగుదూరంలో అరవై దెబ్బయి గుడిసెలు. గుడిసెల మధ్య పోలీసు కేంపు. కేంపుచుట్టూ ఎత్తుగా తాడుపాటి కర్రలు పేర్చి దడికట్టేరు. మధ్యలో ఒక ఆఫీసుగది. దానికి కుడి ఎడమలకు పోలీసుల నివాసాలకోసం అగ్గిపెట్టెల్లాటి అరలు. ఆఫీసు గది వెనకవేపు పోలీసు ఇనస్పెక్టరుకి ప్రత్యేకమైనగది. దానికి రెండు కిటికీలున్నాయి. దాని గుమ్మానికి తలుపుకూడావుంది. గాలికూడా లోపలికి రాకుండా కట్టుదిట్టంగా నిర్మించేరు ఆ గదిని. ఇనస్పెక్టరు చిన్నప్ప అప్పుడే నిద్రలేచేడు. నాలగవుతోంది. నిద్దర్లేచిన చిన్నప్ప ఒళ్ళు విరుచుకున్నాడు. ఆవులిస్తూ కిటికీలోంచి తల బయటికిపెట్టి వంటశాల వేపు చూసేడు. పోలీసుల నివాసాల వెనకపక్కగావున్న వంటశాలముందు వంటవాళ్ళ హడావిడిగా వున్నారు. సార్జంట్ ఉస్మాన్ ఎవరో గ్రామీణున్ని రేకలేస్తున్నాడు. ఇనస్పెక్టర్ చిన్నప్ప షర్టువేసికొని వంటశాలవేపు నడిచి వెళ్లేడు.

"ఏవిటోయ్ గోల?" అడిగేడు సార్జంట్‌ని.

"వీడు పాలుతెచ్చియ్యనంటుండు సార్" సార్జంట్ ఉస్మాన్ జవాబు.

గ్రామీణుడు గాభరాపడ్డాడు. "అదిగాద్దొరా ఊల్లె అన్నిండ్లల్ల తిర్గిన. ఎక్కడ బొట్టు పాలుగూడ దొర్కలే. అదే ఈనెకుజెప్తె గరమైతాండు"

"ఆఁ. పాలులేకపోవడమేమిటి? గాడిదకొడుకుల్లారా! మీకు బలిసిపోయిందిరా! వారంరోజుల్నించి పాలచుక్క దొరకడం లేదంటే ఏమిటి అర్థం?" చిన్నప్ప గర్జించేడు.

గ్రామీణుడు వణికిపోయేడు "నేనేంజెయ్యాలెదొరా. ఇదువరకు మీరుజెప్పినప్పు డెల్ల కోళ్లు యాటలు తెచ్చియ్యలేదా? ఇప్పుడేందోమరి ఊరంత కట్టుమీదున్నరు. ఎవ్వన్నడుగబొయినా ఇప్పించుకుంటలేరు."

చిన్నప్ప మండిపడ్డాడు. "మాదర్చోద్, ఫో! ఎలాగైనా పాలులేకపోయేవో తోళ్లూడదీస్తాను" అంటూ గ్రామీణున్ని మెడపట్టి తోసేడు.

సార్జంట్ ఉస్మాన్ చేతిలోని లాఠీతో ఒకటవేసి "ఖాళీగ వస్తవు బే? ఎవని కోసం ఇక్కడ ఇన్ని తక్లీపులుపడ్తున్నం? ఖబర్ ఉండొద్దుర?" అన్నాడు. గ్రామీణుడు దెబ్బ తాకినచోట నిమురుకుంటూ గుడ్లనీరుకుక్కుకుని వెళ్ళిపోయేడు. ఇనస్పెక్టరు



చిన్నప్ప ఆఫీసువేపు నడిచేడు. అప్పటికే సిపాయి ఒకడు నీళ్లు బకెట్లో నింపివుంచేడు. సబ్బుతో మొహంకడుక్కుని తనగదిలోకొచ్చి డ్రెస్ చేసుకున్నాడు చిన్నప్ప. అప్పటికి సమయం 5 గంటలు కావొస్తోంది. సూర్యుడు ఎర్రగా జేగురుముద్దలాగా చెట్లమీద అమర్చినట్టు కన్పిస్తున్నాడు దూరంగా. డ్రెస్ చేసుకుని చిన్నప్ప ఆఫీసురూంకి దారి తీసేడు. రూంముందు కాపలావున్న ఇద్దరు సెంట్రీలు అటెన్షన్‌లోకొచ్చి శాల్యూట్ చేసేరు. ఆఫీసుముందు వరండాలో నుంచుని చిన్నప్ప చుట్టూ చూసేడు. కేంపుచుట్టూ వున్న నాలుగు సెల్స్‌లో సెంట్రీలు తుపాకుల్తో కాపలాగావున్నారు. రోడ్డువేపున్న సెంట్రీ ఆ రోడ్డుమీదపోయే జనాన్ని ఆపి వాళ్ళని సోదాచేసి. ప్రశ్నలువేసిగానీ వదలడంలేదు. డ్యూటీలేని జవాన్లు బట్టలు ఉతుక్కుంటున్నారు. చిన్నప్పచుట్టూచూసేక ఆఫీసుగదిలో కొచ్చేడు. అతనింకా సరిగా కూర్చోకముందే జవాను బాలయ్య కప్పులో డికాక్షన్ తెచ్చి టేబిల్‌పైనపెట్టేడు. ఇనస్పెక్టర్ చిన్నప్ప మహచిరాగ్గా చూసేడు ఆ డికాక్షన్ని. అయినా చిరాకుదిగమింగి కప్పు అందుకున్నాడు. ఇక్కడ కేంపు వెలిసిన కొత్తలో ఎంత దర్జాగావుండేది? పాలు, పెరుగు, కోళ్లు, మేకలు, కూరగాయలు. ఓహ్! రోజూ పండగలావుండేది. రాను రాను జనం ఇవ్వడం నిరాకరించినా బలవంతాన లాక్కొచ్చే వాళ్ళ జవాన్లు. తర్వాత అదీపోయింది. నెలరోజుల్నిండి ఎవడూ ఇవ్వడంమానేశాడు. బలవంతాన లాక్కొబోతే చాలాచోట్ల జవాన్లకి దేహశుద్ధిఅయ్యేది. ఎన్నడూ వూళ్ళో కన్పించని కొత్తముఖాలు కన్పించసాగేయి. పట్టుకోబోతే చిక్కరు. ఊరుకుంటే సుఖంలేదు. జనాన్ని పశువుల్లా హింసించేడు. చిత్రహింసలు పెట్టేడు. అయినా ఎంత హింసించినా వాళ్ళు మరింత మొండిగా తయారవడంతప్ప లాభంలేకపోయింది. ఊళ్లోవున్న ఒక్క భూస్వామీ పట్నంలో మకాంపెట్టేసేడు. వాడున్నా బాగుండేదేమో. అసలువాడున్నన్నిరోజులు దర్జాగానే వుండింది. వాడో పిరికివెధవ! ఎక్కడో రెండు మైళ్ళదూరానవున్న వూళ్ళో ఏదో అయిందని వీడెందుకు పట్నం పారిపోయేదో చచ్చినా అర్థంగాదు. ఇనస్పెక్టర్లూ పోలీసులు అంటే నమ్మకంలేదా ఏమిటి వాడికి? ఇంత మంది సిపాయిలు. తానూ యీ వూళ్లోవుండగానే భయపడిపోయేడే వెధవ! అయినా వాళ్లెంత ధైర్యంగలవాళ్లు! తన కేంపుకి రెండేరెండుమైళ్ళ దూరం... పోతుపల్లె... అక్కడికొచ్చి భూస్వామిని ఖతంచేసేరే?. అబ్బ! తలుచుకుంటే తనకే గుండె జలద రిస్తుంది. వాళ్లెగాక అక్కడి జనమంతాకల్సి వాణ్ని తరిమి తరిమి మెల్లిగా ఒక్కో కీలు ఊడదీసి చంపేరట! అదీ పట్టపగలు. తర్వాత వెళ్ళి శవాన్నిచూస్తే గుర్తుపట్టడానికి వీల్లేకుండా అయింది. ఊళ్ళోవాళ్ళని తుక్కురేగగొట్టాడు. ముళ్ళమీంచినడిపించాడు. అనుమానంవున్న వాడికల్లా వేళ్లు నలగ్గొట్టించేడు. ఉత్త మొండివెధవలు. ఎంత హిం సించినా ఒక్కటేమాట. "మాకేం తెలువది" అని. అంతకుమించి మరే సమాధానం

తాను వాళ్ళదగ్గర్నుంచి రాబట్టలేకపోయేడు. పై ఈ నక్సలైటునాయకుడు నరసయ్య ఒకడు. వాణ్ణి పట్టుకుంటే బాగుణ్ను. పదివేల రూపాయిలు బహుమానమన్నారికేది.

కేంపుముందు బుర్రున చప్పుడైంది. ఇనస్పెక్టరు చిన్నప్ప ఆలోచనల్లోంచి తేరుకొని ముందుకుచూసేడు వేన్ ఆగివుంది- ఇరవై మైళ్ళదూరానవున్న పెద్ద పల్లె టూరులాటి ఊరికి ఆ వేన్ రోజూపోయి కూరగాయలు వగైరా తెస్తుంటుంది- ఎప్పటి రిపోర్టు అప్పుడే తాలూకా కేంపుకి తెలియజేయడం, మళ్ళీ వాళ్ళ ఆర్డర్ని తీసుకురావడంకోసం ఓ జవాను ఆ వేన్‌లోనే వెళ్ళివస్తుంటాడు. వేన్‌నించి కూరగాయలు వంట సామాన్లు వగైరాలు దించి తర్వాత వాటిలెక్కరాసివున్న కాగితాన్ని దాంతోపాటు మరో చిన్న కవర్ని తెచ్చి చిన్నప్పముందుంచి శాల్యూట్ చేసేడు ఓ జవాను- చిన్నప్ప కాగితాన్ని పైకీ కిందికీ చూసి పక్కకుపెట్టి కవర్ని చింపేడు. చింపుతోనే "తెచ్చావా?" అన్నాడు జవాన్‌తో

"జీ సాబ్!" అంటూ చిర్నవ్వు నవ్వేడు జవాను.

చిన్నప్ప తలపంకించి కాగితం చదవడంలో మునిగేడు-

ఆ కాగితం చదివేక అతడికి ఏమీ అర్థంగాలేదు- సిగరెట్టువెల్గించి "సార్జంట్‌ని పిలు" అన్నాడు జవాన్‌తో.

జవాన్ వెళ్ళి క్షణంలో సార్జంట్‌ని తీసుకొచ్చేడు.

సార్జంట్ ఉస్మాన్ బూట్లకున్న దుమ్ము రాలిపోయేలా శాల్యూట్‌చేసి నుంచున్నాడు..

"నరసయ్యను పట్టుకోకపోతే మొగుడూరుకొనేట్టులేడు. పైగా వాడి తలమీద పదివేల బహుమానంకూడావుంది." చిన్నప్ప అన్నాడు.

"ఏంసార్! మల్లేమన్న వచ్చిందా?" సార్జంట్ అడిగేడు-

"అవునోయ్! ఈసారిమాత్రం తీవ్రంగా దోసిచ్చేడు- అరాఖండీగా రెండు మూడురోజుల్లో నరిసయ్యని పట్టి డిఎస్పీకి చూపించకపోతే కొంపముంచేస్తాడు" చిన్నప్ప అన్నాడు- ఆలోచిస్తూ ఎటోచూస్తూ. సార్జంట్ ఉస్మాన్ కళ్లు కుంచించేడు- కాసేపటికి అతని కళ్లు శవాన్నిచూసిన నక్కకళ్ళలా మెరిసేయి.

* * *

రాత్రి ఏడున్నర కావొస్తూంది. రాత్రివేళ పోలీసు కాంప్ప నీకటిముద్దలావుంది. వంటశాలలో భోజనాల ఏర్పాట్లు జరుగుతున్న సూచనగా పాత్రల చప్పుడవుతోంది-



చిన్నప్ప తనగదిలో ఒంటరిగా కూర్చున్నాడు- మనిషి బిగదీసుకుపోయేడు- చికాగ్గా వున్నాడు- చటుక్కున ఏదో జ్ఞాపకంవచ్చినవాడిలా జవాన్‌ని కేకేశాడు.

జవాన్ లోపలికొచ్చి శాల్యూట్‌చేసి "ఎస్సార్" అన్నాడు-

"ఏదీ? ఎక్కడపెట్టేవ్?" అన్నాడు చిన్నప్ప.

జవాన్ గదిలో ఓ మూలగావున్న కప్‌బోర్డ్‌కేసి నడిచి దాన్లోంచి విస్కీబాటిల్ తెచ్చి ఇనస్పెక్టర్‌కిచ్చేడు- గబగబా వంటగదిలోకి వెళ్ళి వేయించిన బంగాళాదుంప ముక్కలు సాసర్లోతెచ్చి స్టూల్‌మీద పెట్టేడు- కూజామీదవున్న గ్లాసుని అందించేడు-

చిన్నప్ప ముడుచుకున్న గుండెల్తో బాటిల్ ఓపెన్ చేసేడు- పైనించి వొచ్చిన ఆర్డర్ అతనికి పదేపదే గుర్తొచ్చి చికాకు కల్గిస్తోంది- మెల్లిగా సిప్‌చేస్తో బంగాళాదుంప ముక్కల్ని నంచుకుంటున్నాడు- కాసేపటికి అతడి మనసు నెమ్మదిపొందింది- ఇంతలో వంటగదినుండి జవాన్ భోజనంతెచ్చి బల్లమీదవుంచేడు- ఇనస్పెక్టర్ చిన్నప్ప భోజనంచేసి సార్జంట్‌ని కేకేసేడు- సార్జంట్‌రాగానే-

"రెడీయా? తొమ్మిదవుతోంది" అన్నాడు.

"ఎస్సార్, తయార్‌గున్నం" సార్జంట్ అన్నాడు.

"సరే వెళ్ళండి"అని చిన్నప్ప సిగరెట్ వెల్గించి పడకమీదవాలేడు.

కాసేపట్లో కేంప్‌నుండి భయం భయంగా వేన్ బయలుదేరింది గస్తీకి దాన్లో జవాన్లు పిరిగ్గా కూచునివున్నారు-

"వాడేమొ దున్నపోతువతుగ వంటడు. మనం నలిలసావాలె. నిద్ర పోగొట్టుకోవాలె. ఫైరింగయితే జాన్ పోగొట్టుకోవాలె. ఎక్కడి గోసరా ఇది?"

వయసుమళ్ళిన జవాన్ ఒకడన్నాడు.

"మరి మనమున్నదెందుకు? తన్‌ఖా తీస్కుంటలేమా? ఏది చెప్పుతె అది చెయ్యాలె" కొత్తగా అపాయింటయిన కుర్రజవాన్

"అదేమన్నమాట? జీతం మనం ఒక్కలమేకాదుగద తీస్కునేది? ఇన్‌స్పెక్టర్ తీస్కుంటలేడా మరి వాడెందుకురాడు" ఇంకో జవాన్ అన్నాడు.

"అది గంతేగనీ! ఏమన్న ఈ నౌకరికి సలాం గొట్టాలె. నీయమ్మ నా పోరగాండ్ల మొకంజూసిగని లేకపోతె ఈ నౌకరికి లాలితోటి కొడుదును"

వేన్ మామూలుగాఆగే చెట్టుదగ్గరికొచ్చింది- డ్రైవర్ ఇంజన్‌ఆఫ్‌చేసి లైట్లన్నీ ఆర్పేసి బీడీవెలిగించేడు- దూరంగా కేంపులో వెలిగే నూనెదీపాలు కనిపిస్తూనేవున్నాయి.

జవాన్లు రోజూ వేన్లో బయలుదేరి ఒకసారి గస్తీ తిరిగి మళ్ళీ కేంపుకిచేరాలి- మళ్ళీ తెల్లవారుఝామున 4 గంటలకి ఇంకోసారి గస్తీ తిరగాలి. అయితే వాన్లో బయలుదేరిన జవాన్లు కాంపుకి ఫర్లాంగుదూరంలోవున్న చెట్టుకింద వేన్ ఆపి కాసేపుగడిపి మళ్ళీవెనక్కి వచ్చేస్తారు- ఇంకా లోపలకి వెళ్ళాలంటే వాళ్ళ గుండెలు ఆగినంతపనవుతుంది- చెట్టు కింద ఆగివున్న వేన్లోని పోలీసుల గుండెల్లో చైతన్యమంతా భయంగా ముద్దకట్టుకు పోతోంది- వాళ్ళకి ఆ అరగంటసేపూ కూర్చోవడం ఒక పెద్ద గండం- చెట్టుకదిలినా, ఎండుటాకుల పైనించి ఏ కుందేలో పరిగెట్టినా ఒళ్ళు జల్లుమంటుంది. ఊపిరికూడా గట్టిగా పీల్చలేరు- కాలం దరిద్రుడి జీవితంలా కుంటిగా గడుస్తోంది- ఉన్నట్టుండి ఎండుటా కుల కరకరచప్పుడుచేశాయి- డ్రైవర్ పక్కసీట్లో కూర్చునివున్న సార్జంట్ ఉస్మాన్ ఉలికిపడి భయంగా చప్పుడు వచ్చినవేపు చూసేడు. అతనితోపాటు జవాన్లంతా అటు వేపేచూసేరు ఆ చీకట్లో వాళ్ళకేం కన్పించలేదు- అడుగుమాత్రం ఇంకా గరగరమం టూనేవున్నాయి- ఈసారి మరింత దగ్గరగా వస్తోంది ఆ చప్పుడు. సార్జంట్‌తో సహా జవాన్లంతా ఊపిరి బిగబట్టి భయంగా అటువేపే చూస్తున్నారు. వాళ్ళల్లో చాలా మంది గుండె వేగం హెచ్చింది- స్వప్నావస్థలోవున్నట్టు చూస్తున్నారంతా- అడుగుల చప్పుడు దగ్గరగా వినవస్తోంది- ఉస్మాన్‌కి ముచ్చెమటలు పోసేయి- భార్యాపిల్లలు గుర్తొచ్చేరు- ఆ చప్పుడు వినవస్తున్నవేపే చూస్తున్న అతనికి ఒక ఆకారం నడిచిరావడం లీలగా కన్పించింది- కళ్ళు చిట్లించుకొని చూసేడు- వెనకా ముందూ ఎవరూ లేరు- ధైర్యం వచ్చింది. ఆ ఆకారం మరింత దగ్గరగా వేన్‌కి ఎదురుగా వొచ్చింది- ఉస్మాన్ అక స్మాత్తుగా తుపాకీ చేతిలోకితీసుకొని వేన్ హెడ్‌లైట్లు అన్‌చేస్తూనే "ఖబర్దార్" అని అర్చేడు. ఆ కేకకీ, సడన్‌గా లైట్లకాంతి మీదపడటంతో ఎదురుగావస్తున్న ఆకారం భ్రమ్సపడిపోయింది- ఉస్మాన్ "పఃదో సాలేకో" అని అంటూ వేన్‌దిగేడు- అతనితో పాటు వేన్‌దిగిన పోలీసులకు ఒక బక్కచిక్కిన మనిషి లైటువెలుగుల్లో వణికిపోతూ కన్పించాడు- అతని ఒంటిమీద చిన్న తువ్వాలు, పైకి ఎగగట్టిన పంచెతప్ప మరేం లేవు- పోలీసులను, తుపాకులనుచూసి ఆ మనిషి బెదిరి రెండడుగులు వెనక్కివేశాడు- ఉస్మాన్ ఆ వ్యక్తిపైకి లంఘించి పట్టుకున్నాడు- పదివేలు దొరికినంత సంతోషంగా వుందతనికి—

* * *

రాత్రి పదిగంటలవేళప్పుడు నిద్రపోతున్న పోలీసుకేంపు కడుపులో కలకలం మొదలైంది- జవాన్లు అటు ఇటు పరుగులుపెడుతున్నారు- ఇనస్పెక్టరు చిన్నప్పగది లోంచి చిన్నప్పా, సార్జెంటు ఉస్మాన్ బయటికి వచ్చారు- వాళ్ళిద్దరూ ఆఫీసుగదికేసి



నడిచారు- అక్కడ రక్తంకారుతూ మాంసం ముద్దలాంటి శరీరంతో ఒకడు కళ్ళు తేలవేసి గోడకానికూర్చున్నాడు- అతడి కళ్ళు తేలిపోతున్నాయి. మాటిమాటికి పెదాలు తడుపుకుంటున్నాడు- చిన్నప్ప ఆ గదిలోకిరాగానే రెండుచేతులు అతికష్టంగా ఎత్తి దండంపెట్టాడు.

చిన్నప్ప విషపునవ్వునవ్వి "నీ పేరు నరసయ్యని ఇప్పుడైనా ఒప్పుకుంటావా?" అని అడిగేడు ఆ వ్యక్తి తల అడ్డం ఆడించేడు "నేనుగాదు బాబూ నా పేరు నర సయ్యకాదు" అన్నాడు చిన్న గొంతుకతో- చిన్నప్పకి కోపం వచ్చింది- "రాస్కెల్! నువ్వు నర్సయ్యవికాకపోతే ఈ రాత్రి ఎందుకొచ్చేవ్ అడవిలోకి? ఈ ఆయుధాలు నీ దగ్గిరెందుకున్నాయి? చెప్పవేం? నువ్వు నరసయ్యవికాదూ?" అంటూ బూటుకాలితో ఈడ్చి నడుంమీదతన్నేడు- ఆ తాపుకి ఆ వ్యక్తి కిందపడిపోయేడు- మళ్లీ అతికష్టంమీద లేచికూచున్నాడు అతని కళ్ళకి చుట్టూవున్న పోలీసులు అలుక్కుపోయి కన్పిస్తున్నారు. "నేను నర్సయ్యనుగాను- ఎల్లయ్యను- నా చెల్లెలింటికి జరూరుపనిమీదబోతున్న. అంతకంటె నాకేందెల్వది- నాదగ్గర ఆయుధాలు ఏంలేవు- నేను నక్సలైటునుగాదు" అంటూ ఆ వ్యక్తి స్పృహతప్పి పడిపోయేడు- చిన్నప్ప ఉస్మానువేపు చూసేడు- ఉస్మాన్ చిర్నవ్వు నవ్వేడు- తెల్లవారేక ఆ వ్యక్తిని ఎక్కించుకొని వేన్ జిల్లా కేంద్రా నికి పరుగుతీసింది- నక్సలైటు నాయకుడు నరసయ్య ఆయుధాలతోసహా పట్టుబడ్డాడని పేపర్లకి అధికారవర్గాలద్వారా వార్త అందింది- డి ఎస్పీ ఆఫీసులోవున్న అతణ్ణి 'గుర్తించి' ఇద్దరు వ్యక్తులు తాము నర్సయ్య భూస్వాముల్ని హత్యచేస్తుండగా కళ్లారా చూశామనీ ఆ నర్సయ్య ఇతడేననీ సాక్ష్యమిచ్చారు. అలా సాక్ష్యమిచ్చినందుగ్గాను వారికి చెరో పచ్చనోటూ దొరికింది- (అయితే కోర్టులు ఏమయినాయని అంటారాగురూ గారూ? అసలీకేసు కోర్టుకి వెళ్ళనేలేదు- ఎన్నేళ్ళయినా ఆ వ్యక్తి ఇంకా 'రిమాండు' లోనే వుంటాడు. అయితే ఇనస్పెక్టరు చిన్నప్ప సిఐ గా ప్రమోటయ్యేడనుకోండి అది వేరేసంగతి) ఆ తరవాత ఆ కేంపుకి ఇనస్పెక్టరుగావెళ్ళిన చౌదరికి నలుగురు పోలీసులు కన్పించడంలేదని తెల్సింది వాళ్ళతోపాటు తుపాకులూ కన్పించలేదు- ఆ రాత్రంతా అతనికి నిద్రపట్టలేదు- ఉదయంలేచి కాంపుముందు వరండాలో నుంచున్నాడు ఇనస్పె క్టర్ చౌదరి. తూర్పు ఎర్రబారుతోంటే అడవివేపు వెర్రిగా చూశాడు.

---

సృజన చందా వివరాలు

| | | |
|---|---|---|
| సంవత్సరచందా : | రూ. 15-00 | సృజన, |
| అర్ధ సం॥ చందా : | రూ. 8-00 | హనుమకొండ, |
| విడిప్రతి : | రూ. 1-50 పై. | వరంగల్ 506001 |

వ్యాసం :

# చైనాలో కన్ఫ్యూషియస్‌ను మేం ఎందుకు ఖండిస్తున్నాం?

చెహ్‌చున్

మా గొప్ప నాయకుడు చైర్మన్ మావో ప్రారంభించి నాయకత్వం వహిస్తున్న లిన్‌పియావో, కన్ఫ్యూషియస్‌లను ఖండించే అద్భుతమైన ప్రజా ఉద్యమం చైనా అంతటా శక్తివంతంగా పుంజుకుంటున్నది.

శిథిలమైపోయిన బానిస-యజమానుల వర్గానికిచెందిన అభివృద్ధినిరోధక తత్వవేత్త అయిన కన్ఫ్యూషియస్ రెండువేల సంవత్సరాలకు పూర్వమే ధూళిలో కలిసిపోయాడు. అయితే మేమింకా ఇవ్వాళకూడా ఆయననెందుకు ఖండిస్తున్నాం? లిన్‌పియావోను ఖండించడాన్ని కన్ఫ్యూషియస్‌ను ఖండించడంతో ఎందుకు ముడిపెడుతున్నాం?

లెనిన్ చెప్పినట్టుగా "పాతసమాజం నాశనమైనపుడు దాని శవాన్ని ఒక పెట్టెలో పెట్టి మేకులు బిగించి సమాధికి నెట్టలేం. అది మనలో కలిసిపోయి కుళ్ళిపోయి మనకు అంటుతుంది" రెండువేల సంవత్సరాలనుండి కుళ్ళిపోయిన కన్ఫ్యూషియస్‌శవం చైనాలోనూ, బయటా అభివృద్ధినిరోధకులచేత ఉపయోగించుకోబడుతున్నది. గడచిన కొన్ని దశాబ్దాల్లో చైనా కమ్యూనిస్టుపార్టీలోని అవకాశవాదపంథాకు చెందిన వివిధ నాయకులు ప్రజలను మోసంచేసి విప్లవాన్ని వ్యతిరేకించడానికి దీన్ని ఉపయోగించుకుంటున్నారు. చైర్మన్ మావో అన్నట్టు "అభివృద్ధినిరోధకమైన ప్రతిదీ ఒకటే: నువ్వు దాన్ని కొట్టందే పడిపోదు. ఇది నేల (గచ్చు) ఊడ్వడంలాంటిది. చీపురు పెట్టందే దుమ్ము దానంతటదే అదృశ్యం కాదన్నది నియమమే Rule" మన సమాజం ఉపరితల నిర్మాణంలో సామ్యవాద విప్లవాన్ని పదునుపెట్టే మన ప్రస్తుతకర్తవ్యంలో కన్ఫ్యూషియస్‌నూ, అతని అభివృద్ధినిరోధక భావాలను పరిపూర్ణంగా ఖండించడం, కన్ఫ్యూషియనిస్ట్ విషాన్ని పూర్తిగా తుడిచిపెట్టడంఅనేది అత్యవసరమైన అంశం. ప్రగతిని వ్యతిరేకించి తిరోగమనాన్ని సమర్థించేవాళ్ళకు, సంస్కరణను వ్యతిరేకించి ఛాందసాన్ని సమర్థించేవాళ్ళకు, విప్లవాన్ని వ్యతిరేకించి గతంలోకి తిరిగిపోవాలనుకునేవాళ్ళకు అన్నిరకాల అభివృద్ధినిరోధక తత్వసారం చక్కగా సరిపోతుంది. మొట్టమొదట కన్ఫ్యూషియస్ బోధనలు మృతప్రాయమైపోయిన బానిసవిధానాన్ని పునరుద్ధరించి చరిత్ర గమనాన్ని వెనక్కితిప్పాలనీ కుతూహలపడ్డవాళ్ళకు మౌలికంగా ఉపయోగపడ్డాయి. ఆయన మరణించిన వంద సంవత్సరాలతర్వాత అతని మనుమడి శిష్యుడైన మెన్షియస్ (క్రీ.పూ. 390-305) ఆ బాధ్యత స్వీకరించి కన్ఫ్యూషియస్ బోధనలను ఇంకా ముందుకు తీసుకుపోయాడు. తర్వాత తర్వాత కన్ఫ్యూషియస్, మెన్షియస్ సిద్ధాంతాల వేరువేరు కాలా



లకుచెందిన అభివృద్ధినిరోధక పాలకవర్గాలచేత సవరింపబడి విస్తరింపబడినాయి. హాన్ వంశపురాజయిన 'వు' (క్రీ.పూ 157-87) మంత్రి టుంగ్ చుంగ్‌షు (క్రీ.పూ. 79-01) ప్రభువు అధికారం స్వర్గంనుంచి లభిస్తుంది; ఉన్నతమైనవాళ్లు వివేకవంతులుగా, తక్కువ వర్గాలవాళ్లు మూర్ఖులుగా మానవులు వేరువేరు ప్రవృత్తులు కలిగివుంటారు; పాలకులకూ పాలితులకూ మధ్య ప్రభువులకు ప్రజల మధ్య, తండ్రికీ కొడుకుకూ మధ్య, భర్తకు, భార్యకూమధ్య మార్పుడానికి వీలులేని సంబంధమున్నది- అనే అభివృద్ధినిరోధక కన్ఫ్యూషియస్ అవగాహనను ప్రచారం చేసాడు. ఈ సిద్ధాంతాలు క్రమంగా ప్రజలను బానిసలుగా పడివుంచడానికి అభివృద్ధినిరోధక ఫ్యూడల్ భూస్వామ వర్గాలకు ఆధ్యాత్మిక సంకెళ్లుగా ఉపయోగపడ్డాయి. సంస్కరణను విప్లవాన్ని వ్యతిరేకించడానికి సైద్ధాంతిక ఆయుధాలుగా ఉపయోగపడ్డాయి.

గడిచిన వందసంవత్సరాలల్లో తిరోగమనవాద కన్ఫ్యూషియస్ నైతికవిధానం సామ్రాజ్యవాదుల వలసవిధాన భావాలతో 'పవిత్రబంధం' ఏర్పరుచుకొని ప్రజావిప్లవాన్ని వ్యతిరేకించడంలో సామ్రాజ్యవాదులచేత అన్నిరకాల చైనా అభివృద్ధినిరోధక వర్గాలచేత ఉపయోగించుకోబడ్డది. అన్నిటికన్నా ముఖ్యంగా చైనా కార్మికవర్గాన్ని, మార్క్సిజం-లెనినిజాన్ని వ్యతిరేకించడంలో బాగా ఉపయోగపడ్డది. ఈవిధంగా ఫాసిస్టునియంత, ద్రోహి అయిన చాంగ్‌కై షేక్ కమ్యూనిస్టులను నాశనం చేయాలన్న తన పిచ్చి ప్రయత్నాల్లో కన్ఫ్యూషియస్‌ను పూజించడం, ఆయనకు జోహార్లు అర్పించడమనే గొప్ప హంగామా చేసాడు.

1949లో ప్రజారిపబ్లిక్ స్థాపించినతర్వాత పార్టీలోవున్న లిషౌ-చీ, లిన్‌పియావో వంటి రివిజనిస్టు రింగ్‌లీడర్లుకూడా కన్ఫ్యూషియస్ భూతాన్నిచూపి శ్రామికవర్గ నియంతృత్వాన్ని పడగొట్టి పెట్టుబడిదారీ విధానాన్ని పునరుద్ధరించాలని ఆడియాసలు పెట్టుకున్నారు. (వృధా ప్రయత్నాలు చేశారు) ఒక్కమాటలో చెప్పాలంటే ప్రజలను విప్లవాన్ని వ్యతిరేకించి కాలాన్ని వెనక్కి తిప్పాలని కోరుకుతున్న చైనాలోని అభివృద్ధినిరోధకులందరూ కన్ఫ్యూషియస్, మెన్షియస్ సిద్ధాంతాలను తమ ఆయుధంగా వాడుకున్నారు.

కన్ఫ్యూషియస్ పిరికివాడు, రాజకీయ వంచకుడు. రెండుముఖాలున్న ఆలోచనాపరుడు ఎప్పుడూ నిజాయితీ గురించి మాట్లాడినవాడు; కానీ వాస్తవంలో అన్నికాలాల్లోనూ అందరినీ మించిన అపత్యవాది. "కరుణామయమైన ప్రభుత్వాన్ని" (ఉదారమైన ప్రభుత్వాన్ని) ఆకాశానికెత్తుతూ వాస్తవంలో ఆయన ప్రజలను చంపేశాడు పంటలపట్ల, పశువులపట్ల, ఆసక్తిలేనివానివలె నటిస్తూ చాల విలాసవంతమైన జీవితాన్ని గడిపాడు కన్ఫ్యూషియస్, మెన్షియస్ సిద్ధాంతాలు ప్రజలను మోసంచేసే బోధనలు. అవి మానవత్వం, న్యాయం, నీతిగురించి ఎంతనొక్కి చెప్తాయో వాస్తవంలో అణచి

వేతకు. దోపిడీకి. అంత ఉపయోగపడ్తాయి మానవజాతిపట్ల ప్రేమను ప్రబోధిస్తాయి.
కానీ నిజానికి మనుషులు మనుషుల్ని తినేటట్టుగా మారుస్తాయి ప్రజాసంక్షేమంపట్ల అవి
ఎనలేని ఆసక్తిని వ్యక్తంచేస్తాయి కానీ నిజానికి ప్రజలను శత్రువులుగా భావించి అభి
వృద్ధినిరోధక పాలకవర్గాలు ప్రజలను బానిసలుగా చేసుకోవడానికి మార్గాలు సమకూరు
స్తాయి మహనీయుడైన లూ-సన్ చెప్పినట్లు "కన్ఫ్యూషియస్ దేశాన్ని పాలించే
విశిష్టమైన పద్ధతులను కనిపెట్టాడు. కానీ అవి ప్రజలను పాలించడానికి అధికారంల్లో
వున్నవాళ్ళ కోసం వుద్దేశించబడినవి వాటిలో ప్రజలకు వినియోగపడేది ఏమీలేదు"
బూర్జువా పదవీవ్యామోహపరుడూ, కుట్రదారుడూ అవకాశవాది (రెండునాల్కలవాడు)
రెనిగేడ్, విద్రోహిఅయిన లిన్‌పియావో కన్ఫ్యూజియనిజాన్ని పిచ్చిగా సమర్థించాడు
దాని సారమంతా ఈ సూక్తిలోవున్నది "తనను తాను నిగ్రహించుకొని ఆచారవ్యవ
హారాలను కాపాడాలి" (Restrain one self and Return to the rites) అతనికి
పునర్ధ మేమంటే శ్రామికవర్గ నియంతృత్వాన్ని పడగొట్టి పెట్టుబడిదారీ విధానాన్ని పున
రుద్ధరించడమే కన్ఫ్యూషియస్ అభివృద్ధినిరోధక రాజకీయ కార్యక్రమాన్ని నిర్వహిం
చడానికి ఆయన తహతహలాడిపోయాడు. "అదృశ్యమైపోయిన రాజ్యాలను పునరుద్ధ
రించు. తమస్థానాలను కోల్పోయిన అనువంశిక కుటుంబాలను తిరిగి నెలకొల్ప
విస్మృతిలో పడిపోయిన వాళ్లను అధికారంలోకి పిలువు" అన్నదే కన్ఫ్యూషియస్ రాజ
కీయ కార్యక్రమం శ్రామికవర్గ నియంతృత్వంచేత అణచివేయబడ్డ వాళ్ళందరినీ "రాజ
కీయంగా విముక్తంచేయా"లని ఆయన ఆదేశించాడు. భూస్వాములను ధనికరైతులను
విప్లవ ప్రతీఘాతకులను, దుర్మార్గులను, మితవాదులను తిరిగి అధికారంలోకి తేవాలని
ప్రయత్నించాడు. చైనాలో భూస్వాముల, దళారీ పెట్టుబడిదార్ల అభివృద్ధినిరోధక
పరిపాలనను పునఃస్థాపించి మన దేశాన్ని సోవియట్ సోషల్‌సామ్రాజ్యవాదులకు వలసగా
మార్చాలని కలలుగన్నాడు. లిన్‌పియావో సమర్థించిన "ఆచారవ్యవహారాలకు తిరిగి
వెళ్లుట" (Return to the rites)లో వున్న వర్గస్వభావమిది. అతని విప్లవ ప్రతీఘా
తుక రివిజనిస్టుపంథా నిజమైన సారమిది అతడుగూడ చరిత్రగమనాన్ని వెనక్కి తిప్ప
డానికి వృథాప్రయత్నంచేసాడు. లిన్‌పియావో సైద్ధాంతిక, సంస్థాగతపంథాలో
"స్వర్గయిచ్ఛ" (The will of heaven)అనే కన్ఫ్యూషియస్ సిద్ధాంతాన్ని అనుసరిం
చాడు కొంత మంది మనుషులు వివేకవంతులుగా జన్మిస్తారని, ఉన్నతవర్గాలవారు
తెలివైనవారనీ, సామాన్య ప్రజానీకం మూర్ఖులనీ. ముందుకుపోవాలంటే వెనక్కినడవా
లనీ "స్వర్గయిచ్ఛ" ప్రతిపాదిస్తుంది. ఈ అభివృద్ధినిరోధక ప్రవర్తనా నియమావళి
మొత్తంగా పాతవ్యవస్థను పునరుద్ధరించాలనే క్రూరమైన ప్రయోజనాన్ని ఆశించేదే.
ఈ విధంగా లిన్‌పియావో రివిజనిస్టుపంథాకు కన్ఫ్యూజియనిజం చాలా ముఖ్యమైన
ప్రాతిపదిక.



లిన్‌పియావో రెండునాల్కలవాడు. చాల పాశవికమైన చర్యలుసాగిస్తూ ఎంతో పవిత్రమైన భావాలను వెల్లడించేవాడు. ఇదికూడ ఆయన నేరుగా కన్ఫ్యూషియస్ నుంచే నేర్చుకున్నాడు. అందుకని లిన్‌పియావోను ఖండించే ఉద్యమాన్ని నిశితం చేయాలంటే మనం కన్ఫ్యూషియస్‌నుకూడా ఖండించాల్సివుంటుంది. కన్ఫ్యూషియస్ ఖండనఅనేది లిన్‌పియావో ఖండనలో ప్రధానమైన అంతర్లీనమైన అఖండమైన అంశం. కన్ఫ్యూషియస్‌ను ఎత్తిచూపిగాని మనం లిన్‌పియావో విప్లవ ప్రతీఘాతుక రివిజనిస్ట్ పంథాయొక్క అభినవ- మితవాదసారాన్ని బట్టబయలు చేయలేం. లిన్‌పియావో అభివృద్ధినిరోధక ఆలోచనలకు మూలాలను త్రవ్వలేం. ఆ విధంగాతప్ప లిన్‌పియావో, కన్ఫ్యూషియస్ ఇద్దరి అభివృద్ధినిరోధక సైద్ధాంతిక ప్రభావాన్ని తుడిచిపెట్టలేం. కన్ఫ్యూషియస్ సమస్యపైన మన పార్టీకి లిన్‌పియావోకు మధ్య పోరాటం. మన సామ్యవాదదశలో రెండు పరస్పర విభిన్న పంథాల మధ్య ప్రగతి తిరోగమనంమధ్య విప్లవ ప్రతీఘాతుక విప్లవంమధ్య పోరాటం. ఈ పోరాటం ఇంకా ముగియలేదు.

కన్ఫ్యూషియస్ లిన్‌పియావోను కాపాడలేకపోయాడు. పార్టీకి ద్రోహంచేసిన తర్వాత ఈ ద్రోహి నాశనమయ్యాడు. అయినా లిన్‌పియావో కొనసాగించదలిచిన రివిజనిస్టుపంథా, ఆయన ప్రబోధించిన కన్ఫ్యూజియనిజం మాత్రం ఇంకా పరిపూర్ణంగా ఖండించబడాల్సివున్నది. ఆయన ప్రాతినిధ్యం వహించిన చైనాలోనూ, చైనాబయట వున్న అభివృద్ధినిరోధకశక్తులు. మన కార్మికవర్గంమీద తాముకూడ తమ దాడులుఆపవు. ఇంటా బయటావున్న అభివృద్ధి నిరోధకులు, సోవియట్ రివిజనిస్టులు, చైనాలోవున్న చాంగ్‌కైషేక్ ముఠా, మలచబడ్డ కొంత మంది భూస్వాములు, ధనిక రైతులు, విప్లవ ప్రతీఘాతుకులు, చెడు స్వభావం గలవారు, మితవాదులు, విప్లవ ప్రతీఘాతుక రివిజనిస్టులుకూడ లిన్‌పియావో, ఆయన ముఠావంటివారే. వీళ్లంతా ఇంకా సాంస్కృతిక విప్లవంమీద దాడి చేయడానికి కన్ఫ్యూషియస్‌ను వాడుకుంటున్నారు. మహత్తర శ్రామికవర్గ సాంస్కృతిక మహా విప్లవం శ్రామికవర్గ నియంతృత్వాన్ని సుస్థిరంచేసి పెట్టుబడిదారీ పునరుద్ధరణను అరికట్టి సామ్యవాద నిర్మాణం చేయడంలో పూర్తిగా అవసరమైందని, చాల సకాలంలో చేపట్టబడిందని యీ ప్రస్తుత ఉద్యమం పూర్తిగా ధృవపరుస్తున్నది. కాబట్టి చైర్మన్ మావో కార్మికవర్గ విప్లవపంథాను కొనసాగిస్తూ కార్మికవర్గ విప్లవాన్ని సుస్థిరంచేస్తూ విప్లవాన్ని కొనసాగించడానికి రివిజనిజాన్ని అరికట్టే మహత్తర పోరాటంలో స్థిరంగా నిలపడానికి లిన్‌పియావోను కన్ఫ్యూషియస్‌ను ఖండించే యీ ఉద్యమాన్ని కొనసాగించడం చాల కీలకమైన అంశం.

పాత చైనాలో ఎన్నోవేల సంవత్సరాలు ప్రభావోపేతమైన సిద్ధాంతంగావుండిన కన్ఫ్యూజియనిజం చైనా సామాజిక జీవితంలోని ఎన్నో అంశాలపైన విస్తారమైన

ప్రభావాన్ని నెరపింది. కార్మికవర్గం అధికారం చేపట్టినతర్వాతగూడా పార్టీలోవున్న రివిజనిస్టులు శారీరకశ్రమపట్ల తక్కువచూపు(అసహ్యం-Contapt), స్త్రీలపట్ల, కార్మికులపట్ల, రైతాంగంపట్ల తక్కువచూపు, నూతన సామ్యవాద పరిణామంపట్ల నూతన శక్తులపట్ల విముఖత, విదేశీయమైన, ప్రాచీనమైన విషయాలపట్ల ఆరాధనాభావం- వంటి దోపిడివర్గాల అనూచానంగా(సంప్రదాయికంగా)వస్తున్న భావాలను మార్క్సిజం-లెనినిజాన్ని వ్యతిరేకించి ప్రజల మనసులను కలుషితం చేయడానికి వాడుకున్నారు. "కమ్యూనిస్టు విప్లవం సంప్రదాయబద్ధమైన ఆస్తి సంబంధాలతో చాలా తీవ్రమైన సమూలమైన తెగతెంపులు చేసుకోవడం. అందువల్ల దాని అభివృద్ధి సంప్రదాయబద్ధమైన ఆలోచనా విధానాలతోకూడ తీవ్రమైన తెగతెంపులతో ముడిపడివుండటంలో ఆశ్చర్యమేమీ లేదు అని స్పష్టంచేశారు మార్క్స్-ఎంగెల్స్‌లు. అయినప్పుడు విప్లవాన్ని కొనసాగించి సామ్యవాదాన్ని, కమ్యూనిజాన్ని నిర్మించడానికి సైద్ధాంతికరంగంలో మనం కన్‌ఫ్యూషియస్ మెన్షియస్ సిద్ధాంతాలవంటి సంప్రదాయబద్ధమైన భావజాలంనుండి సమూలంగా తీవ్రంగా తెగతెంపులు చేసుకోవాలి. ప్రస్తుత ఉద్యమంలో వీటి విధ్వంసక (వినాశకర, ప్రమాదకర) ప్రభావాన్ని పూర్తిగా తుడిచిపెట్టివేయాలి. వర్గపోరాటాన్ని మనం ప్రపంచం గీటురాయిగా పరిశీలించినపుడు- కొంత మంది చైనా అభివృద్ధి నిరోధకులు కన్‌ఫ్యూషియస్‌ను పూజించడం తరుచుగా వాళ్లు తమ దేశాన్ని సామ్రాజ్యవాదులకు తాకట్టుపెట్టే ద్రోహంతో ముడిపడికన్పిస్తుంది. ఆధునిక చైనా చరిత్రలోయువాన్-షికాయ్, చాంగ్‌కై-షేక్, వాంగ్ చింగ్-వెమ్ వంటి బద్మాషి ద్రోహులందరి విషయంలో యిది సత్యమే. రెనగేడ్ ద్రోహి అయిన లిన్‌పియావో విషయంలో యిది సత్యమే. అట్లే విదేశీ అభివృద్ధినిరోధకుల దురాక్రమణ కుట్రలుకూడ తరుచుగా కన్‌ఫ్యూషియస్ సంప్రదాయాలతో ముడిపడివున్నవి. గతంలో జపాను సామ్రాజ్యవాదుల విషయంలో యిది ఎంత సత్యమో ఈనాడు సోవియట్ రివిజనిస్టుల విషయంలోకూడ అంతే సత్యం. ఎందుకంటే చైనా ప్రజలను వంచించి అణిచివేసి చైనాను తమ వలసగా మార్చుకోవాలని కోరుకుంటున్న విదేశీ అభివృద్ధినిరోధకుల అవసరాలకు కన్‌ఫ్యూషియనిజం ప్రతిపాదించిన తిరోగమనవాదం పాత వ్యవస్థకు తిరిగి వెళ్ళడం సామాన్యప్రజలు మూర్ఖులనేదాని అపోహ "సిచత్వం గురించిన సిద్ధాంతం" (Doctrine of the Mean) ఇంకా ఇలాటివన్నీ సరిగ్గా సరిపోతాయి. నవచైనామీద బురదచల్లి ఊగిసలాడుతున్న తమ పరిపాలనను కాపాడుకోడానికి అప్రతిహతమైన చరిత్ర విప్లవ వెల్లువ ప్రగతిని నిరోధించడానికి ఈ సిద్ధాంతాలు వాళ్ల అవసరాలకు సరిపోతాయి. "విదేశస్తులు చైనాను గెలవడానికి వస్తే.........వాళ్లు కన్‌ఫ్యూషియస్‌ను ఇంకా ఎక్కువగా పూజిస్తారనుకుంటాను" అని లూసన్ ఒకసారి రాశాడు.



కాబట్టి లిన్‌పియావో కన్‌ఫ్యూషియస్‌ల ఖండన అనేది సోవియట్ రివిజనిస్టులకు దాసోహమైపోయి వాళ్ల తమ యజమానులుగా చేసుకోవాలని ప్రయత్నించిన లిన్‌పియావో అతని ముఠాను బట్టబయలుచేయడమే; విమర్శించడమే; అంతేకాదు యిది చైనాను తమ వలసగా మార్చుకోవాలన్న సోవియట్ రివిజనిస్టుల ఆటవిక స్వప్నాన్ని బట్టబయలుచేసి విమర్శించడంకూడ. అన్నిరకాల సామ్రాజ్యవాదులకు, రివిజనిస్టులకు ఇతర విప్లవ ప్రతీఘాతకులకు వ్యతిరేకంగా ఇది శక్తివంతమైన దాడి- చైనాలోను బయటా సాగుతున్న వర్గపోరాటంలోను రెండు పంథాలమధ్య పోరాటంలోనూ మేం స్థిరంగా ప్రపంచంలోని విప్లవ ప్రజానీకం పక్షం ఉన్నామని లిన్‌పియావో కన్‌ఫ్యూషియస్‌లను ఖండించే ఈ ఉద్యమతీవ్రత పూర్తిగా వ్యక్తంచేస్తున్నది- మేం అణచబడిన ప్రజల, అణచబడిన జాతుల అందరి విప్లవపోరాటాలను స్థిరంగా బలపరుస్తాం. సామ్రాజ్యవాదానికి, రివిజనిజానికి, ఇతర అభివృద్ధి నిరోధకులకు వ్యతిరేకంగా సాగే పోరాటాన్ని చివరిదాకా నిర్వహిస్తాం.

(Why are we denallcing Confucius in China?
Chinese Literature No. 6, 1974)

Cheh--Chun.

సమీక్షలు :

## కొండగాలి

తెలుగు దేశంలో ఏ ఇద్దరు సాహిత్యాభిమానులు కలుసుకున్నా, మనకు మంచి నవలలు పట్టుమని పదయినా లేవని వాపోతారు, నవలలాపాటి అయినా వున్నాయికాని నవలాకారులు అసలులేరు- అనడం సాహసం కాదేమో. కొన్ని మంచి నవలలు రాసి నప్పటికీ చిలకమర్తి పౌరాణిక నాటకకర్త; విశ్వనాథ కవి; బాపిరాజు చిత్రకారుడు; చలం, కొడవటిగంటి, గోపీచంద్, బుచ్చిబాబు, మల్లాది, శ్రీపాద, రావిశాస్త్రి కథకులు. ఉన్నవ లక్ష్మీనారాయణ (మాలపల్లి), ఉప్పల లక్ష్మణరావు (అతడు-ఆమె), వట్టికోట ఆళ్వారుస్వామి (ప్రజల మనిషి, గంగు) మంచి నవలాకారులే. కాని వీరెవరూ ఒకటి మహీధర రామమోహనరావు (రథచక్రాలు, ఓనమాలు, కొల్లాయిగట్టితేనేమి), రెండు నవలలుమించి రాయలా. ఇంతకీ చెప్పొచ్చేదేమంటే మనకు బాల్జాక్, హ్యూగో, టాల్‌స్టాయ్, గోర్కీ, డికెన్సు, గాల్స్‌వర్దీ, శరత్, ప్రేమ్‌చంద్ లేరు. ఎందుకని? మన సమాధానం దొరకని ఒక సాహిత్యప్రశ్న. ఈ చిక్కుముడి ఎవరు విప్పుతారు? మన కవులు, కవిత్వం కథకులు, కవులు విశ్వసాహిత్యంలో చోటుచేసుకోదగ్గవారే. మన కవులు, కవిత్వం ప్రపంచంలో ఏ భాషాసాహిత్యానికి తీసిపోనివి. పీటితో పోలిస్తే మన నవల చాలా వెనకబడివుంది

ఒక్కమాట మాత్రం నిజం. తెలుగు నవలకు రాజకీయాలకు చాలా దగ్గర సంబంధముంది. పేర్లుచెప్పిన పై నవలలన్నీ రాజకీయ ప్రేరణతో రాసినవే. ఉన్నవ, ఉప్పల, మహీధర, వట్టికోట, రాజకీయ వాసనలున్నవారు ఇవాళ పుంఖాను పుంఖంగా వెలువడుతున్న తెలుగు నవలల్లో రాజకీయవాసనలు కావుగదా కనీసం సాంఘిక చైతన్య మయినా మచ్చుకికూడా కనిపించదు. ఈ 'కొండగాలి' కూడా రాజకీయ పోరాటాల ప్రేరణతో రాసినదే. రాజకీయ ఉద్యమాల స్వరూపస్వభావాలను భూషణంగారు బాగా ఆకళింపుచేసుకున్నారు.

'ప్రజల మనిషి' 'గంగు' తెలంగాణా పోరాటానికి ప్రతిబింబాలు. అలాగే శ్రీకాకుళ పోరాటపు ప్రాణవాయువులే కొండగాలికి ఊపిరి, ఉత్తేజం.

కాళీపట్నం రామారావుగారి 'యజ్ఞం'లో శ్రీకాకుళపోరాట పూర్వరంగంచూశాం. అలాగే 'కొండగాలి'లో శ్రీకాకుళ పోరాటం నాటకంలా కళ్ళకుకట్టారు. కవిత్వంలా చెప్పి, నాటకంలా చూపించేది నవలే.

అన్యాయం, దోపిడీ ఎలా మొదలయ్యాయో వాటిమీద జనం ఎలా తిరగబడ్డారో మనం 'కొండగాలి'లో చూస్తాం. ఈ నవలలో మంచోళ్లున్నారు. సెబ్బరోళ్లున్నారు. లేనోళ్లున్నారు. ఉన్నోళ్లున్నారు. మంచిచెడ్డలకు గిట్టురాయి పోరాటమే. కలిమిలేముల మధ్య జరిగే యుద్ధంలో ఎవరెటుకొమ్ముకాసేరనేది ముఖ్యం. వాటన్నింటికి అద్దంపట్టింది 'కొండగాలి'.

'కొండగాలి'లో కథవుందేగాని కథానాయకుడు లేడు. ప్రజలున్నారేగాని సాహస వీరులులేరు. నిజమైన వీరులు ప్రజలే, వారే ఒక పోరాట శక్తి అని చూపెట్టిన నవల 'కొండగాలి'. గడ్డిసెట్టి, ఆదెమ్మ, సోమయ్య, చలమయ్య ముత్యాలమ్మ, బోడియ్య, కళాసి కురమయ్య వీరంతా పీడితులు, తాడితులు. వీరే కెరటాలుగా లేచి తిరగబడ్డారు. ఈ ప్రజాశక్తికి ఎదురుగా కలవారంతా దోపిడి పునాదులమీద ఓ కంచుకోట కట్టారు. ఆ కోటలో పాగావేసి కూర్చున్నవారు కంట్రాక్టరు గురయ్య, సొండి సాంబన్న వగైరాలు. వీరికి కాపలాదార్లు రేంజరు, ఫారెస్టరు రాజు ఉరఫ్ ఎర్రజిందవ, గార్డు అప్పారావు ఉరఫ్ తల్లికి మొగుడు, సుక్కడు ఊరిపెద్దలు వగయిరాలు. ఒక్కొక్కపాత్ర వ్యక్తిగత జీవితాలను ఎక్స్‌రే ఫోటో తీయడంలో భూషణం అందెవేసినచెయ్యి అనిపించుకున్నారు. పాత్రల వ్యక్తిగత జీవితాలు రాయనిదే నవల అనిపించుకోదు. వ్యక్తిగతజీవితాల తాలూకు సాంఘిక చైతన్యం చిత్రించకపోతే ప్రయోజనం నెరవేరదు.

గడ్డిసెట్టి, సోమయ్య నవల మొదట్లోనే చెవులపల్లిని గొడ్డలితో చంపి నవల ముగింపు వర్గశతృసంహారం అని సూచించారు,



కథనంలో ఒక పెద్దలోపముంది. ఆదెమ్మ మాంసం పొయ్యిమీద వేసి కారం గుండ కోసం సొండి సాంబన్న ఇంటికి బయలుదేరుతుంది. అప్పుడు సొండి సాంబన్న జీవితం ఫ్లాష్‌బాక్‌లా చెప్పడం నవలకు తప్పలేదు.

రచయిత 'కొండగాలి'లో మాటికి మూడుపాళ్లు ప్రజల భాష వాడారు. ఇందులో మనకు బోలెడు మాండలికాలు ఎదురవుతాయి. భూషణంగారి తేటతెలుగు, జానుతెలుగు భాష.

అయితే కాళీపట్నం రామారావుగారు నవలకు చాలినంత వస్తువును కుదించి 'యజ్ఞం' కథచేస్తే, భూషణంగారు లోగడరాసిన తన 'అడివంటుకుంది' కథను సాగదీసి 'కొండగాలి'నవల రాసినట్టుంది. అయితే అగ్నికి వాయువుతోడైనట్టు అంటుకున్న అడివిని కొండగాలి మరింత బాగా మండించింది.

శ్రీకాకుళ పోరాటం గురించి వెలువడ్డ తొలినవల కొండగాలి. అయితే కొండగాలిలో సమగ్రత లేకపోవడం ఒక పెద్దలోటు. ఈ లోపం సవరించుకుంటూ భూషణం మరిన్ని నవలలు రాస్తారని ఆశ. ఒక్క భూషణంగారేకాకుండా మరిందరుకూడా పోరాట నవలలురాసి విప్లవానికి తోడ్పడి తెలుగు నవలా సాహిత్యానికి కలికితురాయిలు పెడతారని కొండంత ఆశగావుంది.

— సి. ప్రసాద్

---

కొండగాలి

శ్రీకాకుళ ప్రచురణలు భూషణం వెల: 3 రూ.

మేరంగి పోస్ట్, పార్వతీపురం తాలూకా, శ్రీకాకుళం జిల్లా.

---

## రేపటి చైనా (క్రీ.శ. 2001)

కొన్ని దశాబ్దాలకాలంలో అనేక శతాబ్దాలు ముందుకువచ్చి, భావిమానవ సమాజాలకు మార్గదర్శకంగా ఉండగల సామాజికవ్యవస్థకు బలమైన పునాదులు వేసిన ఒకే ఒక దేశం చీనా. పాశ్చాత్యదేశాల వాళ్లు ఇతరదేశాలను తమ వలసలు చేసుకొనటమే గాక, తాము రాకపూర్వం ఆ దేశాలకు చరిత్ర, నాగరికతా లేనట్టు చరిత్రలు సృష్టించారు. తమ ఏలుబడిలేకపోతే ఆ దేశాలకు భవిష్యత్తులేనట్టు అక్కడి ప్రజలను నమ్మించారు.

అయితే ఆఫ్రికా, ఆసియా దేశాలవాళ్ళు వలసపాలనకింద దుర్భరమైన జీవితం అనుభవించటంచేత దాన్ని దైవదత్తంగా భావించక, పదే పదే తిరుగుబాట్లుచేశారు. ఇవి గతశతాబ్దిలో ముమ్మరంగాసాగి, ఈ శతాబ్దిలో అవి మరింతతీవ్రమై విప్లవాలకు, జాతీయవిమోచనాలకూ దారితీశాయి.

1949లో విప్లవాన్ని, జాతీయవిమోచననూ విజయవంతంగా సాధించుకున్న చీనా, సంపదతోబాటు చరిత్రనుకూడా ప్రజలపరం చేసింది. "చరిత్రకు తామే సృష్టి కర్తలమనీ, తామే దానిని నడిపించగలమనీ వారిచే (ప్రజలచే) గుర్తింపజేయడంద్వారా చైనా కమ్యూనిస్టుపార్టీ చారిత్రక అవగాహనలో ఏర్పడిన అంతరాన్ని, లోపాన్ని తొలగించడానికి ప్రయత్నిస్తోంది." ఎందుకు? "ప్రపంచంలో నేడు రంగంలో వున్న చారిత్రక శక్తులను గురించి ఒక అవగాహన కల్గించడమే చారిత్రక పరిణామగతిని త్వరితంచేయడం అవుతుంది." ప్రజలు స్వతస్సిద్ధంగా మార్పును కోరరు. చరిత్రను అధ్యయనం చెయ్యటం వారి జడత్వాన్ని పోగొట్టుతుంది. అప్పుడుగాని ప్రజలు తమ చారిత్రక భవితవ్యాన్ని తామే నిర్ణయించుకునే పనికిపూనుకోరు.

ప్రస్తుతం దోపిడి నుంచి ప్రపంచం విముక్తిపొందటానికి అత్యంత తీవ్రమైన పోరాటాలు సాగుతున్నాయి. దోపిడీ వ్యవస్థ ఉక్కిరి బిక్కిరి అవుతున్నది. ఈ సందర్భంలో ఇతర ఆసియాదేశాలూ, ఆఫ్రికా, లాటిన్ అమెరికా దేశాలూ చీనా నుంచి నేర్చుకోదగినది ఎంతైనా ఉన్నది- ఎందుచేత?

"నేషనలిస్టు (జాతీయవాద), సోషలిస్టు - కమ్యూనిస్టు శక్తులు వర్తమాన ప్రపంచంలో ప్రధానమైన చారిత్రక శక్తులుగా అవతరించాయి, ఇవి జంటగానో, (మధ్య) కొంత వ్యవధితోనో ప్రతి దేశంలోనూ చారిత్రక పరిణామాన్ని ప్రభావితం చేస్తున్నాయి. "జాతీయవాదం బూర్జువా ప్రజాస్వామిక విప్లవం సాధిస్తుంది కాని బడుగు దేశాలలో పెట్టుబడిదారీ విప్లవించే దశకు రావటానికి పాశ్చాత్య సామ్రాజ్యవాద గుత్త పెట్టుబడి రాహువులాగా అడ్డుపడుతుంది!" స్వంతకాళ్ళపై నిలబడ్డాక... ఎట్టి పెట్టుబడిదారీ ప్రభుత్వాన్నయినా సరే తనకు దాసోహం చేసుకుంటుంది, లేదా కూలదోస్తుంది, లేదా కొని వేస్తుంది. అందువల్ల, రాజకీయ, ఆర్థిక స్వాతంత్ర్యం కోసం జరిపే పోరాటం అనేది సోషలిస్టు వ్యవస్థ ద్వారా మాత్రమే జయప్రదమవుతుంది."

జాతీయ విమోచన పోరాటాలలోనూ, విప్లవ దశలలోనూ చీనా సాధించిన అపారమైన అనుభవం "ఈ కాలపు మార్క్సిజం లెనినిజంగానూ, లేదా, మావో ఆలోచనా విధానంగానూ," చెప్పబడుతున్నది. "తృతీయ ప్రపంచంలో సాగుతున్న తిరుగుబాట్లకు ఈ మార్గం తప్ప మరో మార్గంలేదు.

అయితే "శాంతియుతమైన మార్గం" ద్వారా ఆసియా ప్రజలకు అరిచేతిలో వైకుంఠం చూపే అమెరికా మోసాన్ని అర్థం చేసుకునో, చేసుకోకనో, ఆమోదిస్తున్నవాళ్ళు ఇంకా కొద్దిమంది ఉన్నారు. "ప్రపంచంలో ఇతరులెవరికంటేకూడా ఎక్కువ



'విదేశీ సహాయం'పై ఆధారపడుతున్న ఇండియా ఉదాహరణ ఈ సందర్భంలో పేర్కొనదగినది". ఇలాటి దేశాలలోని పాలక వర్గాలు "దాస్యభావం మూట గట్టుకున్న వాళ్ళు", అందువల్లనే అక్కడి ప్రజలు తిరుగుబాటు ధోరణిని ప్రదర్శిస్తున్నారు.

ప్రజానీకం తమ జీవిత విధానాన్ని మారకుండా చూసుకోవటానికి ఎన్ని ఇడుములైనా పడతారు. కాని అది దుర్భరమయేటట్టు చేసే ప్రభుత్వమే విప్లవాన్ని అనివార్యం చేస్తుంది. అమెరికా అంతర్జాతీయ విధానాలను తమ జాతీయ విధానాలు చేసుకున్న వియత్నాం కాంబోడియాలలాటి దేశాలలోని ప్రభుత్వాలు ఎలా విప్లవాలు తెచ్చిపెట్టాయో మనం చూశాం. ఇతర దేశాల గతి ఇంతకు భిన్నంగా ఉండబోదు. ప్రజల తిరుగుబాటును మారణాయుధాలు అణచలేవు. "తుదిఫలితాన్ని ఆయా దేశాలలోని ప్రజా బాహుళ్యం, వారి చారిత్రక చైతన్యం మాత్రమే నిర్ణయిస్తుందని చైనీయులు అంటారు."

ఇందుకు ఒక్క 'షరా' పెడుతుంటారు: "ఇటువంటి పోరాటంలో లక్ష్యానికి అంకితమైన విప్లవ కార్యాచరణగల పార్టీనాయకత్వం అవసరం."

చీనాగురించి మనం తెలుసుకోవలసిన ముఖ్యవిషయాలలో ఒకటి ఏమంటే, నేటి చైనా ఫ్యూడలిజం నుంచీ, కలోనియలిజం నుంచీ విముక్తిపొంది 24 ఏళ్లేఅయింది. ఫ్యూడల్ రాచరిక వ్యవస్థపోయి పదిహేడు శతాబ్దాలయింది. అయితే, ఆ వర్గపు సంస్కృతిని "పండితవర్గం" అందిపుచ్చుకున్నది. ఈ పండితులు భూస్వామ్యవర్గంనుంచి వచ్చారు. రికార్డులను బట్టి, గడచిన రెండువేల సంవత్సరాల కాలంలో రైతాంగపు తిరుగుబాట్లు 18, చిన్న చిన్న తిరుగుబాట్లు కొన్ని వందలూ జరిగాయి.

(ఇంత దీర్ఘకాలం అమలులో ఉండి ఫ్యూడల్ వ్యవస్థ సాధించినదేమంటే చీనాలో సాంస్కృతిక సమైక్యత.)

"ఈ రైతాంగ తిరుగుబాట్లు చారిత్రక పరిణామానికి ప్రోత్సాహం కలిగించిన శక్తులనే మావో నిశ్చితాభిప్రాయం. ఈ రోజుకీ ఇది వాస్తవమే. ఎందు చేతనంటే, రానున్న ప్రపంచ విప్లవానికి ఆసియా, ఆఫ్రికా, లాటిన్ అమెరికా ఖండాలలో 'బడుగు' స్థితిలో ఉన్న రైతాంగమే చోదక శక్తులుగా ఉంటారు."

మంగోలుల హయాంలో పీడుపెట్టిన పొలాలు ప్రజలను రెచ్చగొట్టి, ప్రతిఘటనలకు దారితీశాయి. మంగోలు రాజవంశం అంతరించింది. రైతుకుటుంబానికి చెందిన ఒక "సన్యాసి" మింగ్ రాజవంశం స్థాపించి, వ్యవసాయాన్ని ప్రోత్సహించాడు. అయితే తిరిగి భూస్వాములు బలపడ్డారు, రైతుపీడన అపారంగా పెరిగింది, రైతాంగం ప్రచండంగా తిరుగుబాట్లు సాగించి, ప్రభుత్వాన్ని నిర్వీర్యంచేశారు. దాంతో మంచూలు వచ్చిపడ్డారు. వాళ్ళు ఈ తిరుగుబాట్లను మహా తీవ్రంగా అణచారు. అయినా 40 ఏళ్ళపాటు

తిరుగుబాట్లుసాగి, కొన్ని ప్రాంతాలు నిర్జనంకూడా అయిపోయాయి. మంచూలు సము ద్రయానాలపై ఆంక్షపెట్టారు. (మన దేశంలోకూడా వచ్చిన ఈ ఆంక్ష చీనా నుంచి మంచూల కాలంలో దిగుమతి అయిందా ?)

ఈలోపుగా యూరపు పారిశ్రామికంకావటంచేత రైతు సమస్య అక్కడ వెనక బడి పోయింది. మార్కెట్ల కోసం ప్రపంచాన్ని గాలించటం ప్రధాన సమస్య అయింది. 1840 నుంచి 1949 దాకా సామ్రాజ్యవాదులు చీనాను జలగాల్లాగా పీల్చుకుతిన్నారు.

ఒక వంక సామ్రాజ్యవాదుల దురాక్రమణా, ఇంకో వంక మంచూ పాలకుల అసామర్థ్యమూ కలిసి చీనాలో వ్యావసాయిక ఆర్థికవ్యవస్థ ధ్వంసమై, పెట్టుబడిదారీ విధానం అభివృద్ధికి అవకాశం ఏర్పడింది. అయితే మావో అన్నట్టు, "చైనాలో బూర్జువా వర్గపు నిరంకుశత్వం కింద పెట్టుబడిదారీ సమాజం ఏర్పడడాన్ని మొట్ట మొదటగా అడ్డుకున్నది... సామ్రాజ్యవాదం. చౌక కూలీ, చౌక ముడిసరుకు లభించి, తమ అదనపు పెట్టుబడిని ఎగుమతి చేసే అవకాశాలున్న వలసలలో జాతీయ పెట్టుబడి దారీని సామ్రాజ్యవాదం ఎలా ఎక్కిరానిస్తుంది ?

1911లో విప్లవం జరిగింది గాని పశ్చిమ రాజ్యాలు చీనాలోని ఫ్యూడల్ శక్తులకు సహాయపడ్డాయి. అదేవిధంగా మొదటి ప్రపంచ యుద్ధమప్పుడు చీనామీద తమపట్టు సడలిన కాలంలో, అవి చీనామీదికి జపానును ఎగదోశాయి. పశ్చిమ రాజ్యాలతో కనీసం ఆరు రహస్య ఒప్పందాలు చీనా గురించి జరిగినట్టు వర్సేల్స్ శాంతిమహాసభలో బయట పడింది. "మే 4 ఉద్యమం" చీనాలో జరిగింది. 1919 మే 4 నుంచి 1949 దాకా సాగిన చీనా చరిత్ర అవిచ్ఛిన్నమైనది. ఈ కాలంలో చరిత్ర పురోగతి అతి చురుకుగా సాగింది, ఇంకా సాగుతూనే ఉన్నది.

మే 4 ఉద్యమం దేశవ్యాప్తమైనది. 18 మాసాలు జరిగింది. 200 చిన్న, పెద్ద పట్టణాలలో జరిగిన ప్రదర్శనలలో 2 కోట్లమంది, అన్ని వర్గాలవారు, పాల్గొన్నారు. 192. జులైలో చీనా కమ్యూనిస్టుపార్టీ అవతరించింది. దాని వ్యవస్థాపకులు 12 మందిలో మావో ఒకడు. తిరిగి 1925–27 మధ్య పెద్దఎత్తున వ్యవసాయక విప్లవం సాగింది. దీని అనుభవం నుంచే మావో "ప్రజాపంథా" (mass line) అవగాహన పుట్టుకొచ్చింది. 1919–1949 మధ్యగల 30 ఏళ్ళలో నవచీనా నిర్మాణం జరిగింది. ఈ కాలంలో అక్కడి కమ్యూనిస్టుపార్టీ" అత్యంత సమర శీలమైనపార్టీగా, సైనిక, రాజకీయ వ్యవహారాలలో విస్తృతానుభవంగల రాజకీయ పక్షంగా" రూపొందింది. పోరాట సంక్షోభంలో మునిగి తేలింది; రష్యాలాగా అధికారంలోకి వచ్చినాక అంతర్యుద్ధం సాగించటానికి మారుగా, అంతర్యుద్ధంలో జయించి మరీ అధికారం చేపట్టింది. చీనా విప్లవం గ్రామ సీమలలో ప్రారంభమై నగరాలనుముంచింది, ప్రజలను కూడగట్టుకున్నది. వ్యవసాయ



రంగంలో ఫ్యూడలిజం కొనసాగుతూఉన్న దేశాలకు చీనా విప్లవంలో మంచి పాఠాలు లభిస్తాయి.

1949లో చీనాలో విజయవంతమైన విప్లవం అనివార్యంగా కమ్యూనిస్టు విప్లవ మయింది. ఇక జరగబోయే విప్లవాలన్నీ కమ్యూనిస్టు విప్లవాలు కాకతప్పదని మావో నిశ్చితాభిప్రాయం. రష్యాలో జరిగిన విప్లవం ఆధునిక విప్లవ పరంపరకు చెందినది కాదని ఒక అభిప్రాయం ఉన్నది. అది వదవిని హస్తగతం చేసుకోవటానికి "పైనుంచి" జరిగిన విప్లవం. ఆ పని పూర్తి అయినాకనే దాని ఫలితాలు ప్రజలపరం చేయబడ్డాయి. "పెట్టుబడిదారీ విధానపు సంక్షోభం ఎప్పటికన్నా ఎక్కువ స్పష్టంగా బయటపడి పోతు న్నది" ఉన్నపాళంగా రాజ్యాంగాన్ని హస్తగతం చేసుకుని ఏమీ ప్రయోజనం ఉండదు. (ఈ విషయం గుర్తించని వామపక్షాలకు ఎన్నికలభ్రమ వదిలినట్టు కనబడదు.)

1949లో కమ్యూనిస్టుపార్టీ అధికారంలోకి వచ్చేసరికి చీనా పరిస్థితి 1919లో కన్న చాలా అధ్వాన్నంగా ఉన్నది. 1931–45 మధ్యకాలంలో జపానును ప్రతిఘటించ టంలో దేశం చాలా దెబ్బతిన్నది. ఈ కాలంలోనే అంతర్యుద్ధంకూడా సాగింది. రైతాంగం దుర్భర కష్టాలకు గురిఅయింది. ఎక్కడ చూసినా కరువులూ, వ్యాధులూ తాండవించాయి. ఇలాంటి దేశాన్ని స్వీకరించి పునర్నిర్మాణం సాగించవలిసి వచ్చింది. "ప్రపంచంలోకల్లా విలువైనది ఏమిటి ? మనిషి" అన్న దృఢవిశ్వాసంతో మావో చీనాను రెండవ మహాప్రస్థానంమీద బయలుదేరదీశాడు.

ఈ జైత్రయాత్ర ఎలా జరిగినదీ ఈ పుస్తకం వివరిస్తుంది.

1. వ్యవసాయం: "ఆహారంలో స్వయం సమృద్ధి సర్వసత్తాక ప్రతిపత్తిగల దేశపు స్వాతంత్ర్యానికి ప్రధానమైన మైలురాయిగా (పునాది రాయిగా) చైనీస్ నాయ కత్వం విశ్వసిస్తోంది; ఈ సందర్భంగా ఇండియా పరిస్థితిని ఉదహరించుకోవచ్చు. ఇండియా ఒక పెద్దదేశం; అపారమైన పంట వనరులుకల దేశం; అయినా దానికి వ్యావసాయికంగా స్వతంత్రమైన విధానాలు లేనందున దాని అభివృద్ధి కుంటుపడుతూ (అధోగతిలో ఉండి) విదేశాలు విధించే షరతులకు లొంగి ఉండేటట్టు, వత్తిళ్లకు గురి అవుతోంది. సోషలిస్టు పునాది గ్రామీణప్రాంతమే కాని, నగరం కాదు. ఈ పునాది పైనే చైనా వ్యవస్థ ఏర్పడింది."

1949–52 మధ్య భూసంస్కరణోద్యమం జరిగింది. దానితో ప్రజలలో చైత న్యం పెరిగింది. ఫ్యూడల్ భూస్వామ్య వ్యవస్థ రద్దయింది. సమిష్టి వ్యవసాయానికి దారి ఏర్పడింది. రష్యాలోలాగా ఇది ట్రాక్టర్ల సహాయంతో జరగలేదు. 1958 లో కమ్యూన్లు ఏర్పడ్డాయి. ఈ విషయాలలో చీనీయులు తమ అభివృద్ధిని స్వతంత్రంగానే

న్నాయి. దీనివల్ల లాభం పొందుతున్న దేశాలు జపానూ, బ్రిటనూ, ఫ్రాన్సూ, పశ్చిమ జర్మనీ. 1956 తరవాత చీనా ఎగుమతులలో లాభం ఎరగదు. ఈ గ్రంథంరచించే నాటికి చీనా 40 దేశాలలో జరిగే వస్తు ప్రదర్శనలలో పాల్గొంటున్నది. చీనా లో స్వయంగా ప్రదర్శనలు ఏర్పాటుచేసుకున్నది. ఆసియా, ఆఫ్రికా దేశాలకు సాంకేతిక నిపుణుల సహాయం అందిస్తున్నది, వడ్డీగాని, ఇతర నిబంధనలుగానిలేకుండా సహాయం చేస్తున్నది. 1967 నాటికి చీనాకుగల విదేశీమారకం మిగులు 1500 కోట్ల అమెరికన్ డాలర్లు. ఇది క్రమంగా హెచ్చుతున్నది. చీనా ఎగుమతులలో 80 చిల్లరయంత్రాలూ, 2500 రకాల ఆహారదినుసులూ(ఇప్పుడు పెట్రోలియం)ఉన్నాయి. రష్యాతోటి వర్తకమే దిగజారింది.

4. జనాభా : చీనాకు జనాభా అతిముఖ్యమైనవనరు. 1949 తరవాత చీనాలో జనాభా పెరుగుదల చాలా చురుకుగా సాగింది. 1953 లెక్కలలో 58 కోట్ల చిల్లర, 1966లో 70 కోట్లు. అప్పటికి 21 లోపు వయసువాళ్లు 36 కోట్లు ఉత్పత్తిలోపాల్గొన కుండా అవసరాలు మాత్రం ఉండే ఇంత జనాభాను పోషించటం ఏ ప్రభుత్వం తరమూ కాదు. 1962 నుంచీ చీనాలో కుటుంబ నియంత్రణ దృఢంగా అమలులోకి వచ్చింది. అంతేగాక విద్యారంగంకూడా ఉత్పత్తిరంగంతో మిళితమయింది. విద్యార్థులందరూ కొంత కాలాన్ని ఉత్పత్తిలోగడపాలి. ఇందువల్ల విద్యా, ఉత్పత్తీకూడా గట్టిపడ్డాయి. బాల్యవివాహాలద్వారానూ, గర్భనిరోధక సాధనాలద్వారానూ చీనా జనాభా ఒకటిన్నర శాతం మించి పెరగకుండా చూస్తున్నారు. ఆహారోత్పత్తి పెరుగుదలకూ, జనాభా పెరుగుదలకూ మధ్య పోటీ సాగుతున్నది.

5. శాస్త్రపరిశోధనలూ, విజ్ఞానాభివృద్ధీ : మావో ఆలోచనా విధానం ఈ రంగంలో ఎలాటి ఫలితాలిస్తున్నదీ పాశ్చాత్యులు గుర్తించలేదు. 1950లో 1200 ఉన్న భూశాస్త్రవేత్తలసంఖ్య 1967కు 10,000 కు మించి పెరిగింది. థోరియం, యురేనియం నిక్షేపాలు కనుగొనబడ్డాయి. పరిశోధనలకూ, ప్రయోగాలకూ పుష్కలంగా డబ్బు కేటాయించబడింది. ఎల్లకాలమూ సోవియట్ యూనియన్ సాంకేతికనైపుణ్యాన్నే అనుకరిస్తూ పోయేధోరణి తప్పుగా గుర్తించబడింది. శాస్త్రవేత్తలకూ, రైతాంగానికి మధ్య సహకార సమన్వయాలు కుదిరాయి. శాస్త్రవేత్తలలో ఉచ్చ నీచ విచక్షణలులేవు.

అన్నిటికన్న గొప్ప సంగతి, రష్యా అణుశక్తి రహస్యాలను నిరాకరించినఅనంతరం చీనా అతిశీఘ్రంగా వాటిని సాధించటం. చీనా జీవితంమీద రాజకీయాలుతిష్ఠ వేసి నందువల్ల కలిగిన అపారమైన లాభాలను గ్రహించనివాళ్లు దాన్ని "బుర్రలు కడగటం" అనీ "భావనిరోధం"అనీ ఆక్షేపించారు. దేశీయ వాణిజ్యంమీద పూర్తి కంట్రోలు



నిర్ణయించుకున్నారు. (చీనాలో కమ్యూన్లు ఏర్పరచటాన్ని కృశ్చేవ్ పూర్తిగా నిరసించాడు.) మరొక విశేషమేమంటే, చీనాలోని భూస్వాముల వర్గవిభజన ముందే సరిగా జరిగి ఉండటంచేత, రష్యాలోలాగా, భూసంస్కరణలప్పుడు గుడ్డిగా పెద్దఎత్తున భూస్వాములను చంపుకుపోవటం జరగలేదు. గ్రామసీమలలో ఉత్పత్తి చైతన్యం పెరిగింది.

"భావి కమ్యూనిస్టు సామాజిక వ్యవస్థకు కమ్యూన్ కేంద్రంగా ఉంటుంది; ...ఏక కాలంలో నగరంగానూ, గ్రామీణ ప్రాంతంగానూ వుంటుంది; వాణిజ్యం మార్కెట్‌గా, ఉత్పత్తి కేంద్రంగా వుంటుంది... కమ్యూన్‌లో కమ్యూనిస్టు సమాజపు స్వప్నం నిజమవుతుంది— ఒక శతాబ్దం పట్టినా..."

2. పరిశ్రమ: చీనా గడ్డలో ముడిసరుకులు— పెట్రోలియం, ఇనుమూ, ఇతర లోహాలూ, బొగ్గూ— పుష్కలంగా ఉన్నాయి. వాటిని తవ్వి తీయాలి. చీనా బ్రహ్మాండమైన సోషలిస్టు పారిశ్రామిక దేశం కావటానికి ఉపక్రమించింది. అయితే రష్యా ధోరణిలో కాదు. చీనా ధోరణి "సోషలిస్టు ప్రాపంచిక దృక్పథంపై ఆధారపడివుంది."

1949 నాటికి చీనాలో భారీ పరిశ్రమ అన్నది దాదాపు లేదు. ఉక్కు ఉత్పత్తి కూడా అంతే. 1960 నాటికి అక్కడ 120 లక్షల టన్నుల ఉక్కు ఉత్పత్తి అవుతున్నది; 1965 ఉత్పత్తి అంచనా 180 లక్షల టన్నులదాకా ఉన్నది. ఇటీవలి లెక్కలు ఇంకా హెచ్చుగా ఉంటాయి. ఇలాగే రైల్వేలూ, విద్యుచ్ఛక్తీ, పరిశ్రమలూ సాలుకు 14-15 శాతం పెరుగుదలతో అభివృద్ధిచెందాయి.

పారిశ్రామికాభివృద్ధికోసం సోషలిస్టు నిర్మాణసూత్రాలను గాలికివదలటం జరగలేదు. వ్యావసాయిక పునాది విస్మరించబడలేదు. సాంకేతిక నైపుణ్యం స్వతంత్రంగా పెరిగింది. నూతన యంత్ర నిర్మాణం చురుకుగా సాగింది. 1953-57 మధ్యకాలంలో పారిశ్రామికోత్పత్తి రెండున్నరరెట్లు పెరిగింది. ఆ కాలంలో చీనాకు రష్యా సహాయం ఉండేది. 1958-62 దాకా మొదటి పంచవర్ష ప్రణాళిక; ఇది ఒడుదుడుకులతో సాగింది. 1959, 60, 61 చీనాకు చెడ్డ సంవత్సరాలు.

రసాయన ఎరువుల ఉత్పత్తి 1949లో 27 వేల టన్నులయితే, 1967 నాటికి 90 లక్షల టన్నులు. "ఈనాడు పారిశ్రామిక, శాస్త్ర సాంకేతికరంగాలు ఏ దశకు చేరుకున్నాయంటే, తనపైన యితరులు పూర్తిగా ఆర్థిక దిగ్బంధం విధించినప్పటికీ చైనా పారిశ్రామికంగా పురోగమించగలస్థితిలో వుంది."

3. వర్తకం : 1949-51 మధ్య చీనా ఎగుమతులు పూర్తిగా రష్యాకూ, తూర్పుయూరపుకూ పరిమితమై ఉండేవి. ఈనాడు ఎగుమతులు అన్ని దేశాలకూ పోతు

ఉండటంతో ఇతర దేశాలలోలాగా స్మగ్లింగూ, ఇతర వ్యాపారదుస్తంత్రాలూ దాదాపు అసాధ్యమయాయి. సోషలిస్టు ఆర్థిక వ్యవస్థలో ద్రవ్యోల్బణంలేదు. ఉత్పత్తి పెరగడంతో కొన్ని వస్తువుల ధరలు కొంత తగ్గాయి. వేతనాలు పెరగకుండానే జీవన ప్రమాణాలు పెరిగాయి. ఎందుకంటే నిత్యావసరాలు ఉచితంగాగాని, కారుచౌకగాగానూ, పోయినకొద్దీ అధికంగానూ లభిస్తాయి. నిరుద్యోగం లేదు. చిన్నలకూ, పెద్దలకూ భద్రత ఉన్నది. ఆదాయపువన్ను లేదు- అంటే జీతాలలో కోతలు లేవు. పొదుపుకూ, మితవ్యయానికీ ప్రోత్సాహం ఉంటున్నది. ఇతర దేశాలలోలాగకాక, కార్మిక కర్షకుల మధ్య పూర్తి సమత్వం పాటించబడుతున్నది. రష్యాలోలాగ ఆర్థిక ప్రలోభంతో శ్రామికులను ప్రోత్సహించే పద్ధతి చీనాలో లేదు.

6. మావో ఆలోచనా విధానం : దేశాన్ని మార్చటం ఎంత అవసరమో మనుషులను మార్చటంకూడా అంత అవసరమూననీ, రెండు మార్పులూ ఏకకాలంలోనే జరగాలనీ చీనా నాయకులు నమ్ముతారు. సిద్ధాంతాలకు ఆచరణకావాలి. విప్లవ సిద్ధాంత ఆచరణల సముదాయమే "మావో ఆలోచన"గా చలామణీ అవుతున్నది. ఈనాడు మావో ధోరణిలో 70 కోట్ల చీనీయులు ఆలోచించటానికీ, ప్రవర్తించటానికీ యత్నిస్తున్నారు. మావో ఆలోచనా విధానం ఈ కాలపు మార్క్సిజం-లెనినిజం అన్న భావం ఇటీవలికాలంలో ధృవపడింది.

"సైద్ధాంతిక పోరాటం సర్వకాల సర్వావస్థలలోనూ...సమాజంలో అన్నిస్థాయిలలోనూ... వివిధ వర్గాలమధ్యా... వ్యక్తుల స్థాయిలో... ప్రతి వ్యక్తిలోనూ అంతర్గతంగా సాగుతుంది." కారణం, పాతకాలపు ఆలోచనలకూ నూతనావసరాలకూ మధ్య సంఘర్షణ ఉంటుంది. దేశవ్యాప్తంగాచూస్తే ఇది పలువిధ, బహుముఖ క్లిష్టసమస్య. పునర్నిర్మాణం ఒక్కొక్క-అడుగే సాగాలి. "రెండడుగులు ముందుకూ, ఒక అడుగు వెనక్కూ-"అన్నది ఈనాడుకూడా సోషలిజంలో ప్రవేశించే సూత్రంగానే వున్నది. రాజకీయ స్పృహ కొరకు భౌతికలాభాలనుకూడా తాత్కాలికంగా త్యాగం చెయ్యవలసి ఉంటుంది.

మావో సూత్రాలలో ముఖ్యమైనవి కొన్ని : "ప్రోద్బలంతో పనిలేదు. ప్రజాబాహుళ్యం తమనుతామే ప్రోద్బవించుకుంటారు. కమ్యూనిస్టు అయినంతమాత్రాన పొరపాటు చెయ్యడని ఏమీ లేదు... శిక్షించటంకన్న తీర్చిదిద్దటం మేలు. చర్చలద్వారా వ్యత్యాసాలు సరిచేసుకోవాలి" ఇత్యాది.

1956 లోనే చీనా రివిజనిజమును గుర్తించింది (యుగోస్లావియా, హంగరీ, రష్యాలలో) "శ్రామికవర్గ నియంతృత్వపు చారిత్రకానుభవం"అన్న రచనతో రివిజనిజం



గురించి మావో ఆలోచనావిధానం సాగింది. 1957 లో రష్యాతో విభేదాలు వ్యక్తమయాయి, రష్యాలోని కమ్యూనిస్టులలోనూ, సమాజంలోనూ కరప్షన్ ద్యోతకమైంది. చీనాలోకూడా అదే జరుగుతుందని పాశ్చాత్యడిప్లొమాట్లు ఆశించారు దానికిమారుగా వచ్చినది సాంస్కృతిక విప్లవం. ప్రపంచ విప్లవనాయకత్వభారాన్ని రెనిగేడ్ రష్యన్ నాయకులనుంచి తన భుజాలమీదికి తీసుకోవటానికి మావో నిశ్చయించాడు. విప్లవ లక్ష్యాలకు రష్యా తిలోదకాలివ్వటంచూసి అమెరికా ఆసియాలో తిరిగి కాలుపెట్టటానికి నిశ్చయించినమాట స్పష్టం. రష్యాలో జరిగిన యీ పరివర్తన ఫలితాలను గురించి మావో చాలా లోతుగా ఆలోచించాడు.

1962 లో గడ్డుకాలం వెనకబడినమీదట చీనా ఆర్థికంగానూ, సైద్ధాంతికంగానూ పుంజుకోసాగింది. 1966 దాకా సిద్ధాంత పురోగమనం చాలా బలంగా సాగింది. ఈ సమయంలోనే మావోకు విరుద్ధంగా చీనాలో రివిజనిస్టుముఠా తలఎత్తింది. ఈ ముఠాకు విరుద్ధంగానే ప్రొలిటేరియన్ సాంస్కృతిక మహావిప్లవమూ రెడ్‌గార్డ్‌లూనూ!

చీనా కథ అతివేగంగా నడుస్తున్నది. ఏడెనిమిదేళ్ళ క్రితం రచించిన ఈపుస్తకం ఈనాటి చీనాను సమగ్రంగా చిత్రించదు. కాని వర్తమాన ప్రపంచ చరిత్రను మరింత బాగా అర్థం చేసుకునేటందుకు ఈ పుస్తకం చాలా తోడ్పడుతుంది. ప్రపంచం ఈనాడు చీనా గురించి చాలా తెలుసుకుంటున్నది. చాలా దేశాలు చీనాపట్ల ప్రతికూల వైఖరి మార్చుకుంటున్నాయి. అమెరికా చీనాకు పులిగా ఉండటానికిబదులు మేకవన్నె పులిగా ఉండ నిశ్చయించినట్టు కనబడుతుంది. పులిపాత్రను రష్యా అందిపుచ్చుకున్నది. మానవ చరిత్రవేగాన్ని హెచ్చించటంలో చీనాపాత్ర ఎంతో ఉన్నది; గమ్యం చేరటంలో కూడా ఉండితీరుతుంది.

కొడవటిగంటి కుటుంబరావు

"కమ్యూనిస్టులు ప్రతివిషయాన్ని గురించీ 'ఎందువల్ల?' అని
ప్రశ్నించుకోవాలి; ఎల్లప్పుడూ తమ మెదడును ఉపయోగించాలి. ఏది ఎంతవరకు వాస్తవమో, దానికి కారణమేమిటో తెలుసుకొనేందుకు కష్టపడి ఆలోచించాలి; దేన్నీ గుడ్డిగా అనుసరించకూడదు; బానిసబుద్ధికి స్వస్తి చెప్పాలి."

— మావో

# మన సాంస్కృతికరంగం - మరికొన్ని సమస్యలు

వర్గీస్

"చరిత్ర ఉద్యమాల్ని విప్లవాల్ని కంటుంది.
మానవజాతి రక్తతర్పణంచేస్తూ మూల్యం చెల్లించుకుంటుంది."

ఈ చారిత్రక సత్యం పశువును స్వంతఆస్తిగా వదిలపరుచుకొని, అందుమూలం గానే స్థిరనివాసం, స్త్రీ దానిసత్వం, రాజ్యాంగ యంత్రం ఏర్పర్చుకొని, ఆ తర్వాత జానిన వ్యవస్థ ఫ్యూడల్ వ్యవస్థ, పెట్టుబడిదారీవ్యవస్థ దాకా 'లభించబడిన చరిత్రఅంతా వర్గపోరాటాల చరిత్రయే'అని 1847 లో మొట్టమొదటిసారిగా శాస్త్రీయంగా వెలువడిన కమ్యూనిస్టు మానిఫెస్టో (Communist Manifesto) లో మార్క్స్- ఏంగిల్సులు ప్రపంచ చారిత్రక సత్యాన్ని అక్షరాలరూపంలో ప్రపంచం ముందు పెట్టారు.

ఈ వర్గపోరాటాల చరిత్ర ఇలా ఉండగా, ప్రపంచ విప్లవదుర్గమైన చైనాలో శ్రామికవర్గ నియంతృత్వాన్ని మరింత పటిష్టవంతంగా చేయడానికి శ్రామికవర్గ సాంస్కృతిక మహావిప్లవం జయప్రదంగా నిర్వహింపబడింది.

చైనా ప్రజల మహానాయకుడైన చైర్మన్ మావో నాయకత్వాన లిన్‌పియావో, కన్‌ఫ్యూషియస్ అభివృద్ధి నిరోధక భావాలను తీవ్రంగా విమర్శిస్తూ చైనా అంతటా గొప్ప ప్రజా ఉద్యమం నిర్వహింపబడింది

ఈ చారిత్రకమైన సోషలిజపుదశఅంతటా పార్టీలో రెండుపంథాల(మార్క్సిజం-రివిజనిజం)మధ్య పోరాటం అనివార్యం.

మహత్తర శ్రామికవర్గ సాంస్కృతిక విప్లవంలో గొప్ప విజయాలు పటిష్టవంతంగానూ, విస్తృతంగానూ నిర్వహింపబడ్డాయి.

ఈ చారిత్రకదశలో శ్రామికవర్గ సాంస్కృతిక విప్లవంలో భాగంగా చైనాలో 'సాంస్కృతికరంగం' నిర్వహిస్తున్న పాత్ర గణనీయమైనది.

మన విప్లవంలో ప్రధానాంశం వ్యవసాయ విప్లవం. అది ప్రజాస్వామిక స్వభావాన్ని కలిగిఉంటుంది. అది అక్టోబర్ మహా విప్లవంతో ఆరంభమైన ప్రపంచ శ్రామిక వర్గ సోషలిస్టు విప్లవంలో భాగం.

'పాతకు సమాధికడుతూ, కొత్తను ఆహ్వానిస్తూ, విదేశీయమైనదానిని దేశీయ నిర్దిష్ట పరిస్థితులకు అన్వయిస్తూ ఆదర్శవంతమైన విప్లవాత్మకమైన సృజనాత్మకమైన సాహిత్య కళలను మన దేశమంతటా విస్తృతంగా ప్రచారంలోకి తేవలసివున్నది.



జనచైనాలో సాంస్కృతిక కళలు ఎలా ప్రదర్శింపబడ్డాయో, సాంస్కృతిక రంగంలో ముఖ్యంగా నాటకరంగంలో అది సాధించిన అపూర్వవిజయాలు చూస్తూంటే, మన సాహిత్యకారులు కళాకారులు మనదేశంలో కొనసాగుతున్న నూతన ప్రజాస్వామిక విప్లవంకొరకు ఎలా నిర్విరామంగా కృషిచేయవలసి ఉన్నదో మనకు అర్థమౌతుంది. మనం ప్రపంచ విప్లవాలు విజయం చెందేదశలో ఉన్నాం. సామ్రాజ్యవాదం పతనం చెందేదశలో ఉన్నాం. అలాగే జననాట్య మండలి (People Theatre) విజయం వైపు పురోగమించేదశలో, ఫ్యూడల్ బూర్జువా కళలు పతనం చెందుతున్నదశలో ఉన్నాం.

అందుచేత సాహితీ కళారంగాలలో సమగ్రమైన చర్చ, నిర్మాణాత్మకమైన విమర్శ అవసరం. అలాగే కమ్యూనిస్టుకు ప్రాథమిక లక్షణం విమర్శ-ఆత్మవిమర్శ.

మన సాంస్కృతికరంగం గురించి అందునా ప్రభంజనంలా వీచగల ప్రజాకళల గురించి 'పిలుపు' 1-11-74 సంచికలో కొన్ని కళారూపాలగురించి చర్చించాం. మిగతా కళారూపాల గురించి యిప్పుడు పరిశీలిద్దాం-

1. నాటకం: నాటకం గురించి ప్రత్యేకంగా చెప్పనవసరంలేదు. నాటకం వేస్తే వచ్చేఫలితాలు అందరికీ తెలిసినవే. అన్నిరకాల సాంస్కృతిక కార్యక్రమాలలో నాటకం పదునైన ఆయుధం.

మంచి రచన రూపొందించుకొని సమర్థవంతంగా ప్రదర్శించడమే తరువాయి. మంచి రచన అంటే ప్రజలు, ప్రజల సజీవమైన భాష నుడికారం మొదలగువాటితో కూడుకున్నదై ఉండాలి. దానికి అనుగుణంగా శ్రామికవర్గ ప్రయోజనంగల పకడ్బందీగల కథ (foremeel story) సజీవమైన సహజమైన పాత్రపోషణ జరగాలి. ఇవ్వి మాత్రమే మంచి కథ (నాటకం) అన్నదానికి ప్రమాణాలుగా ఉండాలి. అలాగే సమర్థవంతమైన ప్రదర్శనఅంటే సాంకేతికంగా (Technical)గా అభివృద్ధిచెందినదిగాఉండాలి.

ఇక్కడ ఒక విషయం దృష్టిలో వుంచుకోవాలి. గ్రామాలలో ప్రదర్శించడానికి పట్టణాల్లో లేక బస్తీల్లో ప్రదర్శించడానికి వేర్వేరు ప్రమాణాలుగల నాటకాలను మనం తయారుచేసుకోవాలి. అంటే దీనర్థం ప్రమాణాలపేరుతో గ్రామాలలో హంగులతో అట్టహాసాలతో స్పెషల్ మేకప్ మొదలగు హంగామా చెయ్యొద్దు. అలాగే రచన కూడా గ్రామీణ వాతావరణానికి సరిగ్గా సరిపోయేదిగా, ఇంకా చెప్పాలంటే గ్రామీణ రైతాంగ బాధల గాథల నిగ్గు ఉట్టిపడేట్టుఉండి వారిని చైతన్యవంతుల్ని చేసేదిగాఉండాలి.

నాటకంలో పాత్ర ధరించే కళాకారుడికి ఆ కథ గురించి ఆ పాత్రల గురించి, పాత్రల స్వభావాల గురించి బాగా తెలిసిఉండాలి. అంటే దీనర్థం అతనికి ఆ విధమైన వాతావరణంలో జీవితానుభవం ఉండాలి. అప్పుడే ఆ నాటకంలోని పాత్రలు బాగా రక్తి

కడతాయ్. ఒకవేళ అటువంటి అనుభవం లేకపోతే కనీసం ఆయా పాత్రలు ధరించే
కళాకారులు నాటకం కథనుబట్టి ఆయా స్థలాలకువెళ్ళి వారి జీవితాల్ని, జీవిత విధానాల్ని,
అక్కడి అధికారాన్ని, అంధకారాన్ని, అమాయకతను, చైతన్యాన్ని క్షుణ్ణంగా అధ్య
యనం (Study) చేయాలి.

జనచైనాలో ప్రజాకళలు ప్రదర్శించేపద్ధతి మనందరికి ఆదర్శప్రాయంగా ఉండాలి.
ఈ మాట ఎందుచేత అంటున్నానంటే, అక్కడ నాటకాలలో పాత్రలుధరించే కళాకా
రులు ఆయా పాత్రలను సమర్థవంతంగా ప్రదర్శించడానికిగాను కొన్నాళ్ళు ఆ పాత్రల
వృత్తులు నేర్చుకొని, పనిచేసి, ఆ పాత్రల జీవితం, స్వభావం అధ్యయనం చేస్తారు.
ఉదా: ఒక నాటకంలో ఒక పాత్రధారుడు కంసాలిపాత్ర ధరించవలసి వచ్చింది. ఐతే
ఆ పాత్రధారి స్వయంగా గ్రామాలకువెళ్ళి కొన్నాళ్లు కంసాలి పని నేర్చుకొని, పనిచేసి,
ఆ వృత్తిలోని ఆ శ్రమశక్తిలోని, జీవితంలోని మెళుకువను, జవమును, జీవమును
ఒంటబట్టించుకున్నాడు. తర్వాత అతను ఆ నాటకంలో ఎంత చక్కగా, అద్భుతంగా
జీవం ఉట్టిపడేలా, సహజంగా నటించాడో వేరే చెప్పనక్కరలేదు. అలాగే కర్షకుడు
కార్మికుడు, బొగ్గుగని కార్మికుడు, సైనికుడు మొదలగు పాత్రలు ధరించ వలసివచ్చిన
ప్పుడు వాళ్లు ఆయా వృత్తులు నేర్చుకొని, కొంతకాలం పనిచేసి, అనుభవం గడించి,
ఆ అనుభవంతో నాటకాన్ని జీవితాన్ని జిగేల్‌మనేలా ప్రదర్శిస్తూ, ఆ రచయితలు, కళా
కారులు, కాదు, సుశిక్షిత సాంస్కృతిక సైనికులుగా ప్రపంచ కమ్యూనిస్టు కళాకారు
లందరికీ ఆదర్శప్రాయులైనారు.

ఈ రకమైన అనుభవం పుస్తకాలలో దొరకదు. It must be Practical
one. అధవా పుస్తకాలలోనిది మాత్రమే స్వీకరిస్తే, జీవం ఉండక ఆ కళ మిడిమిడి
జ్ఞానంగానే ఉంటుంది. కాబట్టి ప్రజలను ఉత్తేజపర్చాలన్నా ఏ కార్యక్రమం చేపట్టినా,
ప్రజలలోకి పోయి వాళ్ళ బాధలు గాధలు అధ్యయనం చెయ్యకుండా ఒక్క అడుగుకూడా
ముందుకు వెయ్యలేం!

కేవలం గ్రామాల్లో వున్న జనాన్ని ఉత్తేజపర్చి, చైతన్యవంతుల్నిచేసి, రాజకీ
యంగా అభివృద్ధిపరిస్తే సరిపోతుందా? మిగతా పట్టణాలలోని కార్మికులను, పెటీ
బూర్జువా మేధావులను ఉత్తేజపర్చనవసరంలేదా? అంటే- తప్పనిసరిగా ఉన్నది. అలా
గనుక చేయకపోతే మనది సెక్టేరియనిజం ఔతుంది. నగరాలలో బస్తీలలో సాంస్కృ
తిక ప్రదర్శనలిస్తున్నప్పుడు ఆయా వర్గాలను దృష్టిలో ఉంచుకొని నేటి నాటకరంగం
సాధించిన అత్యంత ఆధునిక సాంకేతిక విలువల్ని సాధ్యమైనంతవరకు ఉపయోగించు
కోవాలి. కాని కేవలం ప్రమాణాలపైనే దృష్టి కేంద్రీకరించి, విస్తృత ప్రచార దృక్ప
ధాన్ని, పొదుపైన ప్రదర్శనను కోల్పోరాదు. ఆ ప్రమాణాలు మనం ఏ వర్గాలకైతే



ప్రదర్శిస్తున్నామో ఆ వర్గాలకు అందుబాటులో ఉండకుండాపోతే మనం చేసిన కృషి
అడివినకాచిన వెన్నెల అవుతుంది. మార్క్సిజం మనకు ఏం బోధిస్తుంది. కళల్ని
ప్రజాపరంచేయమంటుంది. అందుకే చైర్మన్ మావో "ప్రజల స్థాయినుండి ప్రమాణా
లను పెంచమని" చెప్పి ప్రజారచయితలకు, కళాకారులకు అద్భుతమైన మార్క్సిస్టు–
లెనినిస్టు ఆయుధాన్ని అందించాడు.

విప్లవ రచయితలలో చాలా మందికి ఇంకా పెటీబూర్జువా ఆలోచనలు పోలేదు.
కారణం వాళ్ళు ప్రజలతో కలగాపులగంగావుండి ప్రజల ఆచార వ్యవహారాలను, విధా
నాలను, ఆలోచనలను అధ్యయనం (study) చేయకపోవడమే: సాహిత్య కళా రంగా
లలో పనిచేస్తున్న కామ్రేడ్స్ కొన్ని పకడ్బందీ (Dogmotic) సిద్ధాంతాలు నిర్వచనాలు
చేసుకొని వాటి ప్రకారంగా మాత్రమే కళా సాహిత్యాల్ని మలచాలని (మూసపోయాలని)
వాదిస్తారు. వాళ్లుచేసే పెద్ద తప్పిదం ఏమంటే 'సిద్ధాంతాలు చేసుకొని నిర్వచనాలతో
కాదు ప్రారంభించవలసింది, ఆచరణలోమాత్రమే విప్లవచైతన్యంగల కామ్రేడ్స్ సమ
స్యల్ని పరిష్కరించుకోవాలన్న' మార్క్సిస్టు మూలసూత్రాన్ని వారు మర్చిపోతారు: లేదా
ఆచరించరు. ఈ దృక్పధాన్ని ఆచరణద్వారానే మార్చుకోగలుగుతాం.

కళలు, సాహిత్యం విశేష ప్రజాబాహుళ్యానికి (కార్మిక, కర్షక, పెటీబూర్జువా
మొ॥) సేవచేసేది ధ్యేయంగా ఉండాలా లేక వర్గశత్రువులకు ఊడిగంచేసేదిగాఉండాలా
అన్న రెండు పంథాలమధ్య జరిగే పోరాటంలో మన పాత్ర నిర్ణయించుకోవడమే మనకు
గీటురాయిగా ఉండాలి.

ఈ సందర్భంలో మనం సాధించిన విజయాలను పరిగణలోకి తీసుకోవటం
కూడ మరిచిపోకూడదు.

తెలంగాణ గ్రామీణ జీవితాన్ని కళ్ళకు కట్టేలా చిత్రించి, పూర్తిగా ప్రజలకు
అందుబాటులో ఉండేట్టు ప్రదర్శింపబడే నాటిక ఒకటి ఈ మధ్య విరివిగా ప్రదర్శింపబడి
ప్రజల ఆదరాన్ని బాగా చూరగొన్నది. జనం దాన్ని ఒక థ్రిల్‌గా భావిస్తున్నారు.
అందుకు కారణం: ఇంత వరకు అంత ప్రజల స్థాయికి (Declassify) దిగివచ్చి ప్రద
ర్శించిన నాటిక నాటకరంగ చరిత్రలోనే లేదు: ఇంచు మించు ఇది ప్రజాకళా రంగంలో
సూత్రప్రాయంగా Red Theatre ను స్థాపించింది. ఈ "బీదలపాట్లు" అనే నాటికను
జననాట్యమండలి Peoples Theatre) వారు తెలుగు దేశమంతటా విరివిగా ప్రదర్శిం
చారు. ముఖ్యంగా గ్రామీణ జనం ఈ నాటికచూసి ఎలా కదిలిపోయిందిగమనిస్తే ఈ
నాటిక ప్రజా నాటకప్రక్రియలో ఎంత ఉన్నత ప్రమాణాలను(ప్రజలస్థాయి)సాధించిందో
బోధపడుతుంది. ఈ నాటిక ప్రదర్శింపబడుతున్నంత సేపు రైతుకూలీలు గొంగళ

జొంత నేలపై వేసుకొని, దొగ్గాళ్ళ(పిగాళ్ళ)మీద కూర్చొని, చీమ చిటుక్కుమనకుండా చూస్తూ, వాళ్ళ వాళ్ళ జీవితాల్లోకి, కష్టాల కొలిముల అనుభూతులలోకి, గుండెలురగిలించిన కసిలోకి వెళ్ళి ఈ నాటకాన్ని తిలకిస్తారు కదిలిపోతారు. ఇంకా చెప్పాలంటే కళ్ళల్లో నిప్పులు, ఎముకల్లో కత్తులు, నెత్తురులో కొలిమురు మనం వాళ్లలో చూస్తాం. ఈ నాటిక ప్రదర్శిస్తున్నప్పుడు అందులోని భూస్వామి, రైతుకూలీని విపరీతంగా కొడుతున్నప్పుడు ప్రేక్షకులనుండి ఒక ముసలిరైతు అవమానికి స్టేజీవేపురావడం, ఇది నాటకం మాత్రమేననిచెప్పి కార్యకర్తలు అతన్ని నివారించడం జరిగింది. ఐనా అతను ఆ దృశ్యానికి కదిలిపోయి "ఎంత నాటకం ఐతే ఏంది. అట్ల కొడ్తడా?" అన్నాడు.

అలాగే ఇంకొక గ్రామంలో యిదే నాటిక ప్రదర్శిస్తున్నప్పుడు ఆ నాటికలోని 'భూస్వామి పాత్రధారి' జీతగాడి భార్యను బలవంతం (Rape Seen) చేసే సందర్భం వచ్చినప్పుడు; ఆ ప్రదర్శన తిలకిస్తున్న సుమారు నాలుగువేల మంది జనం కూర్చున్న వాళ్ళల్లా ఒక్కసారిగాలేచి రంగస్థలంవేపు కదిలారు. వాళ్ళను ఆపడానికి ఆ ప్రదర్శన ఏర్పాటుచేసిన కార్యకర్తలకు గగనతరమయింది వాళ్ళ అరుపులు మిన్నుముట్టాయి. ఆ నాటకంలో సహజంగానే జీతగాడి తమ్ముడైన పాత్రధారి వచ్చి వదినను రక్షించి, భూస్వామిని ఖతంచేయడంతోగాని జనం వాళ్ళవాళ్ళ స్థలాల్లోకి వెళ్ళి కూర్చోలేదు.

ఇంకొక సందర్భంలో దుర్మార్గుడైన భూస్వామికి తోడ్పడుతూ పనిచేసినపట్వారి (కరణం పాత్ర)ను ఆ నాటికలో చంపకుండా కొట్టి కష్టపడి బతకమని బుద్ధిచెప్పి వదిలేస్తారు. కాని ఈ ప్రదర్శనను చూస్తున్న రైతుకూలీలు(ముఖ్యంగా స్త్రీలు)ఈ పట్వారి పాత్రనుకూడా చంపమని పట్టుపట్టారు. ఇలాగే గ్రామాలలో "బీదలపాట్లు" నాటిక ప్రదర్శించిన ప్రతిసారి ఏదో ఒక థ్రిల్ కలిగించే సంఘటన జరిగేది కొన్నిచోట్ల ఆ గ్రామజనాన్నే పాత్రలుగా తీసుకున్న సంఘటనలు చాలా ఉన్నాయి. ఒకసారి ఒక రైతు పాల్గొని సంఘం మీటింగు పెట్టుకొని చర్చిస్తూఉంటే (నాటకంలో) నిజమైన రైతుకూలీయే వేదికపైన నటిస్తున్నాడు కాబట్టి "ఏందే! ఎట్లజేసేదిఇంకా : ఏశెయ్యక'అని ఆ భూస్వామి పాత్రపట్ల తన వర్గకసి దృక్పథం ప్రదర్శించాడు. ఈ నాటిక ప్రత్యేకత ఏమంటే దీనికి Script (రచన)లేదు ఇది Extempo drama.

అలాగే ఈ నాటకాన్ని గురించి ప్రజలనుండి కార్యకర్తలనుండి ఎన్నో సలహాలు తీసుకొని కనీసం 10 సార్లు నాటకాన్ని ప్రజల భావాల కనుగుణ్యంగా మార్చి ప్రదర్శించబడింది. అలాగే జనచైనాలో ఒక నాటకాన్ని యింకా నిగ్గుతేలేట్టు ప్రదర్శించేందుకు ప్రజల భావాల కనుగుణ్యంగా 22 సార్లు మార్పులుచేసి ప్రదర్శించారట. ఈ చిత్తశుద్ధిని మన విప్లవ కళాకారులు ప్రయోక్తలు అలవర్చుకోవాలి. ప్రజలలో దీర్ఘకాలం



బాధలకోర్చి పనిచేయడానికి సుశిక్షిత సాంస్కృతిక సైన్యంగా(?) రూపొందడానికి మన కళాకారులు నడుంకట్టాలి.

2. రంగస్థలం (Stage): సాంస్కృతిక కార్యక్రమాలేవి ప్రదర్శించినా రంగస్థలం అవసరం. నాలుగు పీటలువేసిగాని లేక ఏదో ఒక చావిడి, రచ్చబండ, స్కూలువరండా, దేవాలయ ఆవరణ లేక ఏదైన ఎత్తుపల్లైదేశంవున్నా కాస్త అనుకూలంగా మార్చుకొని, రంగస్థలంగా ఉపయోగించుకోవొచ్చు. అద్భుతంగా మన కార్యక్రమాలు కొనసాగించనూవచ్చు. కాని అన్ని హంగులు ఉన్న ప్రత్యేక రంగస్థలం కావాలని కూర్చోవడం మాత్రం సరైన పద్ధతి కాదు ఈ రకమైన పద్ధతిఅవలంబిస్తే మనం 'గొప్ప'కళాకారులం మాత్రమే ఔతాం కాని ప్రజా కళాకారులంమాత్రం కాలేము.

ఒక్కోచోట స్టేజీవేయడానికి ఏ రకమైన అనుకూలమైన వాతావరణం లేకపోతే వెంటనే ఒక కూడలిలో స్థలం నునుపుచేసి నాలుగు చాపలు లేక తార్‌పాల్‌పరిచి రెండు కర్రలు పాతి, ఒక బట్ట (Curtain) కట్టి ఆడవచ్చు. లేకపోతే ఏ మరుగు లేకుండా ప్రదర్శన నిచ్చినా మన నడిగేవాడులేడు. లేక మనకు మార్కులు తక్కువవేసేవాడూ లేడు. అది కళ, ముఖ్యంగా నాటక కళ కానేకాదు బొమ్మంటారని భయమా? అలా ప్రజావ్యతిరేకురే అంటారుకాని ప్రజలకు అనుగుణ్యంగా కళలను రూపొందించుకోవాలనే వాడు అలా అనడు. ఈ రకమైన అంటే పైనచెప్పిన విధంగా చావిళ్ళలో సామాన్య నేలపై, రెండు మూడు 'బైరు బండ్లు'ఒకవద్దచేర్చి స్టేజీ ఏర్పాటుచేసుకొని ప్రదర్శించిన అనుభవాలు జననాట్యమండలికి ఉన్నాయి. బస్తీ లలోకూడా సామాన్యమైన ఎత్తు ప్రదేశంలో స్టేజీ ఏర్పాటుచేసుకోవొచ్చు, లేకపోతే పీటలు. ఒకవేళ హాల్లో (Theatre) ప్రదర్శన ఏర్పాటుచేస్తే దానికి అవసరమైన హంగులు అవసరమే: ఐతే సెట్టింగ్ పొదుపుగా వాడుకొని ప్రదర్శనలో ఎక్కువ మెళకువ చూపించాలి. నీలి తెరలతో (Blue Curtains) బ్రహ్మాండమైన ఎఫెక్ట్సుతో ప్రదర్శించిన నాటికలూ ఉన్నాయి. అలాగే ముఖ్యమైన పట్టణాలలో ముఖ్యస్థలాలు (Main Centres) ఎంచుకొని సెట్టింగు ఏమీలేకుండా విదేశాలలో ప్రదర్శించినట్లు (షేక్స్‌పియర్ నాటకాలు) ఆరు బయట నాటకాలు ప్రదర్శించి మన నాటక చరిత్రలో విప్లవాత్మకమైన మార్పు తేవలసిన అవసరం ఎంతైనా ఉన్నది. సిటీస్‌లో ప్రదర్శనలిస్తున్నప్పుడు సౌండ్‌సిస్టమ్ గురించి, లైటింగ్ గురించి శ్రద్ధ వహించాలి. లేకపోతే మనం అనుకున్న ప్రమాణాలు సాధించకపోగా మన ప్రదర్శన అభాసుపాలౌతుంది. అదే గ్రామాల్లో కరంటు (Electricity) లేకున్నా మైకులేకున్నా, పెట్రోమాక్స్‌లతో, లాంతర్లతో ఎఫెక్టివ్‌గానూ, సహజంగానూ ప్రదర్శించవచ్చు. ఒక్కోసారి లైట్లు ఫెయిల్ (Fail) ఐన సందర్భంలో, నాటకంకాని, మరేదైనాకాని చీకట్లోనే గొంతులు పెంచి కళాకారులు మళ్ళీ లాంతర్లు పనిచేసేవరకు

ప్రదర్శన కొనసాగించిన అనుభవాలువున్నాయి. అలాగే విప్లవాత్మకమైన ప్రదర్శనలు యీమధ్య గ్రామాలలో ప్రారంభమైనాయి. ఏ లైటు, మైకు లేకుండా ఏదో ఒకచోట (గూడెంలల్లో) వెన్నెలలో విప్లవ సాంస్కృతిక ప్రదర్శనలిచ్చి (గొల్లసుద్దులు, పాటలు, డాన్సులు మొ॥) ప్రజలను ఉత్తేజితులగింపారు. ఈ ఘనత అంతా జననాట్యమండలికి దక్కుతుంది.

3. ఆహార్యం: (Make-up) రకరకాల మేకప్‌లు ఉంటాయి. ఒకటి లైట్, మరొకటి డార్క్ కోటింగ్. ఇక్కడ మనం ప్రజాకళల విషయం చర్చిస్తున్నాం కాబట్టి కోల్డ్ క్రీమ్‌ల మొదలగువాని సంగతి అనవసరం. సామాన్యంగా నాటకాలకు కేకులు వాడుతారు. మనం అవ్వికూడా లేకుండా ఇంకా సాధారణంగా మేకప్‌చేసుకోవచ్చు. గ్రామాల్లోనైతే చాలా డార్క్ కోటింగ్ వాడుతారు. వాళ్ళు వేసే రూపకాలు పౌరాణికాలు కాబట్టి కృష్ణునికి, రామునికి నీలం రంగు రావణునికి నలుపు యిలాంటి డైరెక్ట్ కలర్స్ ఉపయోగిస్తారు. నూనె, పసుపు, కుంకుమ, కాటుక మొ॥మామూలు రంగులే వాళ్లు వాడేది; అదీ దొరకని స్థలాలలో బూడిద, మశి, మొ॥వాటితో సరిపుచ్చుకుంటారు. మరి వాస్తవ జీవితం ఇలా వుంటుంది. ఇక మన సాంస్కృతిక దళాలకు కావలసినవి: 1. మేకప్ జింక్: రెడ్, వైట్, ఎల్లో. 2. లిప్‌స్టిక్ 3. ఐబ్రోపెన్సిల్ 4. కాటుక 5. టూత్‌బ్రష్ 6. క్రేప్‌హేర్ 7. స్ప్రిట్ గం 8. బ్లేడ్ 9. కత్తెర 10. దువ్వెన 11. అద్దం 12. కొబ్బరినూనె 13. రోజ్‌పౌడర్ 14. స్పాంజ్‌పీసెస్ 15. షేవింగ్‌సెట్ 16. సబ్బు 17. టవల్ 18. గ్లాసులు 19 ప్లేట్లు 20. గుడ్డ ముక్కలు (Waste) మొ॥ పై మేకప్ వస్తువులతో ఏ నాటకానికైనా సమర్థవంతంగా మేకప్ చేసుకొని ఎఫెక్టివ్‌గా ప్రదర్శన ఇవ్వొచ్చు. ఇక మేకప్ చేసుకునే కళ ఏమంత కష్టతరమైనది కాదు. ఏమాత్రం శ్రద్ధవహించినా రెండుమూడు రోజుల్లో ఈ ఆర్ట్ నేర్చుకోవచ్చు. అదీకాక ప్రజానాట్య దళాలలో తప్పనిసరిగా ఎవరికివారు కొంచెం (quick) తయారయ్యే (Make-up) అలవాటు చేసుకోవాలి ప్రజా కళాకారులు మూమెంట్స్ అన్ని పనుల్లో చాకులా కదులుతూ చకచక పని ముగించాలి. పైన సూచించిన మేకప్‌సామాగ్రి ఆర్థికంగా చాలా పొదుపైనది కూడా. పదిమందికి మేకప్ చేసి ప్రదర్శన ఇవ్వాలంటే మహా ఐతే Make-up కు రెండుమూడు రూపాయలకంటే ఎక్కువకాదు. ఇదే మనం మేకప్‌మెన్‌ను పిలిస్తే పాత్రకు 5.చొప్పున 50 రూ॥ తేవులాడు. ఐనా మనవెంట ఊరూరా తిరగడు. అందుచే పై మేకప్ మెటీరియల్ కొనుక్కొని తప్పనిసరిగా మనలో ప్రతి కళాకారుడు రూపశిల్పిగా మారవలసిందే

మనకు ఇవేవీ అందుబాటులో లేని సందర్భంలో ప్రజలు వాడుకునే 1. పసుపు 2. కుంకుమ 3. నూనె 4 మశి కాటుక మొ॥ వాటితో మేకప్ చేసుకోవాలి. ఇక



వస్త్రాలంకరణ (costumes) అక్కడి రైతుకూలీల దుస్తులే అడుక్కొని కార్యక్రమం కొనసాగించాలి. రైతుకూలీల పాత్రలకు మేకప్ చేయకుండా ఐబ్రోస్ టచ్ చేసి కాటుక, మీసాలుపెడ్తే సరిపోతుంది. ఆహార్యం (make-up) విషయంలో, వస్త్రాలంకరణ (costumes) విషయంలో గ్రామాలలోని రైతుకూలీలనే మనకు నిధులుగా ఉపయోగించుకోవాలి.

మన సాంస్కృతికరంగంలో ముఖ్యమైన రూపకాలు సమస్యలు పైన చర్చించబడినవి. వాటి రూపాలు తీరుతెన్నులు మాత్రమే చర్చనీయాంశాలైనాయి. 1. పైన చర్చించిన ఈ "ప్రజా కళారూపాలకు ప్రజా సాహిత్యసృష్టి నెలామేళవించాలి?" 2. "ప్రజాకళల్ని ఎలా ప్రచారంలో పెట్టాలి?" 3 "చిత్ర కళారంగంలో మన కర్తవ్యం ఏమిటి?" మొదలగు సమస్యలు ఇంకా చర్చించవలసేఉన్నవి. ఇవన్నీ ఒకఎత్తు "మన సాహిత్యాన్ని కళల్ని ఎలా ప్రజాపరంచేయాలి?" అన్నది ఒకఎత్తు. ఈ విషయాలపై సమగ్రంగా చర్చించి నిర్ణయాలు తీసుకోవలసిఉన్నది.

1. ప్రజా సైన్యం లేకుండా ప్రజలకుండేదేమీలేదు.
2. విప్లవ సాంస్కృతిక సైన్యంలేనిది ప్రజా సైన్యానికి పరిపుష్టిలేదు.
3. మన దేశంలో జనతాప్రజాతంత్ర విప్లవం విజయవంతం కావాలంటే కదనరంగం, కళా, సాహిత్యరంగం కలిసి పోరాటం కొనసాగించాలి.
4. ప్రజారచయితలారా, కళాకారులారా ప్రజాకళలను రాష్ట్ర వ్యాప్తంగా విస్తృతపర్చండి.
5. ప్రజా సాహిత్యం, కళలు వర్ధిల్లాలి.
6. విప్లవం వర్ధిల్లాలి.

---

మన సాహిత్యం – కళ మొత్తం విప్లవ యంత్రంలో ఒక సహజమైన భాగంగా తయారుకావాలి; ప్రజలను ఐక్యంచేయడానికి, వారిని చైతన్యవంతులను చేయడానికి అవి బలమైన ఆయుధాలుగా ఉపయోగపడాలి. శత్రువుపై దాడిచేయడానికి, శత్రువును నిర్మూలించడానికి, ఒకే ఆలోచనతో ప్రజలందరూ హృదయపూర్వకంగా శత్రువుతో పోరాడడానికి అవి బలమైన ఆయుధాలుగా ఉపయోగపడాలి. ఇదే మన లక్ష్యమై వుండాలి.

— [సాహిత్యం – కళలపై మావో యేనాన్ ప్రసంగం నుండి]

స్త్రీ - సామ్యవాద దృక్పథం :

## పదిమంది అక్కచెల్లెళ్లు

తూర్పుగాలి ఉత్పత్తి దళం (East wind-Production Team)లో గత సమాజం బాపతు భూస్వామ్య ఆలోచనా విధానం వాసన ఇంకా కొన్ని మిగిలి ఉన్నది. కొంత మంది మొగవాళ్లు చాలా గొప్పవాళ్లు అనీ, స్త్రీలు తక్కువవాళ్లనీ, స్త్రీలు చేతగాని వాళ్లనీ అనుకునేవారు. అట్లాగే చూసేవారు. స్త్రీలు ఎంతసేపూ పిల్లలు గురించి మంచి శ్రద్ధతీసుకొని మంచి వంట వండితే చాలని వాళ్లు అనుకునేవాళ్లు. ఇక్కడే ఇరవై ఏళ్ళ వయసులోవున్న పది మంది స్త్రీలు వున్నారు. స్త్రీలను చిన్నచూపు చూసే ఈ ఆలోచనా ధోరణిని తుడిచివేయడంద్వారానే తమ పాత్ర తాము నిర్వహించగలమని వాళ్లు అనుకున్నారు. ఈ దళంలోనేవున్న ఇతర స్త్రీలతో కలిసి ఈ పాతఆలోచనావిధానాన్ని విమర్శిస్తూనే వాళ్లు 2/3 హెక్టార్ నేలలో ఎక్కువ దిగుబడి యివ్వగల ప్రయోగాత్మకమైన ప్రత్తిని స్వయానా తమ చేతులతో విత్తారు. ఆలోచించడానికీ ఆచరించడానికీ సాహసించే ఈ యువతులను ప్రజలు "పదిమంది-అక్కచెల్లెళ్ల"అని పిలిచేవాళ్లు.

వసంతకాలంలో విత్తే సమయంలో వాతావరణం పొడిగావుండి, చాలా విత్తనాలు మొలకెత్తలేదు. "ప్రత్తిని విత్తడం చాల కష్టం కానీ యేజ్ఞానమైనా ఆచరణనుంచే వస్తుంది" అనుకున్నారీ యువతులు. వాళ్ళకు అర్థంకానపుడు అడిగి తెల్సుకున్నారు. చివరకు పెరగని మొక్కలస్థానంలో కొత్తవి నాటారు.

వాళ్ల అద్భుతమైన శ్రద్ధతో మొక్కలు చాలా బాగా పెరిగినయ్ కానీ ఎండాకాలం లాగానే వాతావరణం మరింత పొడిగా మారింది. పదిరోజులకుపైగా విశ్రాంతిలేకుండా పనిచేసి 20 మీటర్ల బావి తవ్వారు. అది యీ ప్రయోగాత్మకమైన ఉత్పత్తి దళానికి చెందిన ఎన్నో హెక్టార్ల భూమికి నీరు యివ్వగలిగింది. ఈ యువతుల పని స్త్రీలను చిన్నచూపు చూసేవారు. కాలం మారింది అని గుర్తించేలాచేసింది. మగవాళ్లు చేసే ప్రతి పనీ ఆడవాళ్లుగూడా చేయగలరని గుర్తించేలా చేసింది. ఉత్పత్తి శ్రమలో స్త్రీలు పాల్గొనుట సామ్యవాద విప్లవానికి, సామ్యవాద నిర్మాణానికి అవసరమని మాత్రమేకాక స్త్రీ విముక్తికికూడ చాల ప్రధానమైన మార్గమని ఈ పదిమంది అక్కచెల్లెళ్లుకూడ తాము గ్రహించారు.

( March 74 — China Reconstructs నుండి )

### హైదరాబాదు, సికిందరాబాదు జెయిళ్ళలో తమనందరినీ ఒకేచోట వుంచాలనే డిమాండ్‌తో నిరాహారదీక్ష చేస్తున్న కామ్రేడ్స్ ప్రాణాలను కాపాడడానికి ప్రజాఉద్యమం నిర్మించండి

1) ఒకే కేసులో వున్నవారందరినీ ఒకేజెయిల్లో ఒకే ఆవరణలో వుంచాలి.
2) తీవ్రమైన జబ్బులకు (అల్సర్, టిబి వంటివి) లోనయి నెలలకొద్దీ బాధ పడుతున్న వాళ్ళకు డాక్టర్ రాసినప్పటికీ బయటి ఆస్పత్రులకు ఎస్కార్ట్ రావడంలేదు. ఇలాంటి వ్యాధులతో బాధపడుతున్న వారికొరకు ప్రత్యేకమైన ఎస్కార్ట్ ఏర్పాటుచేయాలి.
3) జెయిల్లో ఎపిసి, నావాల్జిన్‌వంటి గోళీలు తప్ప అసలు మందులు లేవు. తగిన వైద్యసదుపాయము, మెడికల్ డయట్, పాలు, రొట్టె, గుడ్లు మొదలయినవి ఇవ్వాలి.
4) నిషేధింపబడని సాహిత్యం కత్తిరింపులు (సెన్సార్) లేకుండా యివ్వాలి.
5) నక్సలైట్ ఖైదీలందరినీ రాజకీయ ఖైదీలుగా గుర్తించి, వారు ఏ గ్రూపుకుచెందిన వారయినాసరే అందరినీ ఒకే ఆవరణ (enclosure) లో వుంచాలి.
6) జెయిల్ అధికారుల అవినీతి, లంచగొండితనం, దౌర్జన్యాలపై న్యాయవిచారణ జరిపించి దోషులను దండించాలి.

అనే డిమాండ్‌లతో 'సికిందరాబాదు కుట్రకేసు'లో నిందితులయిన కామ్రేడ్స్ కె. సాంబశివారెడ్డి, కె. నారాయణ, పరసయ్య, వేముల వెంకటేశ్వరరావు 28-12-74న సెంట్రల్ జెయిల్ హైదరాబాదులో నిరవధిక నిరాహారదీక్ష ప్రారంభించారు. ఈ డిమాండ్లును మొదట వారు జెయిళ్ళ మంత్రి, జెయిళ్ళ ఇన్‌స్పెక్టర్ జనరల్‌ముందు కూడా వుంచారు. ఆ యిద్దరూ ఉచితమయిన చర్యలు తీసుకుంటామని హామీ యిస్తే తగినంతకాలం ఎదురు చూశారు. వీళ్ళను వీరితోపాటువున్న యింకో నలుగురు కామ్రేడ్స్‌ను సికిందరాబాదు జెయిల్‌కు మార్చవలసిందిగా 'సికిందరాబాదు కుట్రకేసు'ను విచారిస్తున్న మేజిస్ట్రేట్ ఆదేశించాడుకూడా. అయినా యిది అమలుకాలేదు. ఇక గత్యంతరంలేక నిరాహారదీక్షకు పూనుకున్నారు. ఆదేరోజు వాళ్ళపై లాఠీచార్జీచేసి చంపుతామని బెదిరించి చీకటికొట్లలో వేశారు. కనీసం నిమ్మకాయ, మంచినీళ్లు, వైద్యసదుపాయంకూడా కలిగించలేదు. 'మీరంతా ఒకచోటచేరి కుట్రచేయాలని ఆలోచిస్తున్నారు. మీరు చచ్చినా పరవాలేదు' అని జెయిలు అధికారులు బెదిరిస్తున్నారు. ఇదే జెయిల్లోవుండి తీవ్రమయిన మలేరియావ్యాధికి గురిఅయిన కామ్రేడ్ ఎల్. విజయకుమార్ నెలరోజులకుపైగా ఉస్మానియా ఆస్పత్రిలో చికిత్సపొంది, అక్కడ సరియైన సదుపాయాలు కలిగించడంలేదని విసుగెత్తి జెయిలుకు తిరిగి వచ్చాడు. నోట్లో నుంచి నెత్తురుపడి, దీర్ఘమయిన వ్యాధివల్ల పొలిపోయి శల్యావశిష్టమయిన యీ కామ్రేడ్‌కు

జెయిల్లో పాలు, రొట్టెకూడా యివ్వడంలేదు. మలేరియావ్యాధి కాబట్టి దోమతెర ఇవ్వ
వలసిందిగా దరఖాస్తు పెట్టుకుంటే 'నీకిస్తే వెయ్యిమందికి ఇవ్వాల్సివస్తుంది' అని నిరాక
రించారు. హైదరాబాదు నగరంలో దోమలబెడద ఎంత వున్నదో అందరికీ తెలిసిన
విషయమే. జెయిల్ డాక్టర్ సిఫారస్‌చేసిన టానిక్‌కూడా డి.ఎమ్.వో అవసరంలేదని
ఆపివేశాడు. పోల్చలేకుండా మారిపోయిన ఈ కామ్రేడ్ ఆరోగ్యం ఆందోళనకరంగా
వున్నది. హైదరాబాదు సెంట్రల్‌జెయిల్ సూపరింటెండెంట్ గురుప్రతాప్‌కు ఇటీవలనే
డి.ఐ.జి. (ప్రజన్స్)గా ప్రమోషన్ వచ్చింది. ఆయన నిరాహారదీక్ష చేస్తున్న కామ్రేడ్స్
దగ్గరకెళ్ళి (మొదట స్వయంగా యితర అధికారులను పోలీసులను వెంటబెట్టుకొని వెళ్ళి
లాఠీచార్జి చేయించినవాడు ఇతడే. నక్సలైట్లు చస్తే సంతోషిస్తానన్నవాడు యితడే)
'నేను డి.ఐ.జి.ని అయ్యానుకదా, చార్జి తీసుకున్న అరగంటలో మిమ్మల్ని సికిందరా
బాదు జెయిలుకు మారుస్తాను నిరాహారదీక్ష విరమించండి' అని తేనెపూసిన మాటలు
చెప్పాడు. 'అట్లా రాసిస్తే విరమిస్తాం' అన్నారు ఆ కామ్రేడ్స్. ఆ నలుగురు కామ్రేడ్స్
కూడా యింకా ఇరవై ఏళ్ళయినా నిండని ముక్కుపచ్చలారనివాళ్ళు. అదే జెయిల్లో మరో
యిద్దరు కామ్రేడ్స్ కొండా వెంకటయ్య, ఆర్. యాదవరెడ్డి 9 వ జనవరి నుంచి నిరా
హారదీక్షలో చేరారు

ఇక సికిందరాబాదు జెయిల్లో ఇవే డిమాండ్స్‌పై. వీటితోపాటు హైదరాబాదు
జెయిల్లో కామ్రేడ్స్‌పై లాఠీచార్జిపై న్యాయవిచారణ జరిపించాలనే డిమాండ్‌తో జనవరి
4 వ తేదీనుంచి కామ్రేడ్స్ ఇంగువ మల్లికార్జునశర్మ, ఎం. సుబ్బారెడ్డి, బి. మల్లయ్య,
గుండు వెంకటయ్య, జి. వీరభద్రయ్య నిరవధిక నిరాహారదీక్ష ప్రారంభించారు. అదే
రోజు కోర్టులో తమ నిరాహారదీక్ష నోటీస్ యిచ్చి తిరిగివచ్చాక సాయంత్రం వీళ్ళను
చీకటికొట్లలో పడవేసేముందు ఇక్కడకూడా జెయిల్ అధికారులు లాఠీచార్జి చేయించారు.
కామ్రేడ్స్ అందరికీ చేతులమీద శరీరంమీద చాలా గాయాలయినవి. ఒంటిమీదవున్న బట్ట
లన్నీ లాక్కొని డ్రాయర్స్‌కుకూడా నాడాలు తీసేసి ఆ రాత్రంతా చలిలో దాదాపు నగ్నంగా
వదిలేసారు. 6 వ తేదీన కోర్టులో యీ అమానుషమైన జెయిల్ అధికారుల దౌర్జన్య
చర్యలను మెజిస్ట్రేట్ దృష్టికితెస్తూ కామ్రేడ్ బర్ల యాదగిరిరాజు యీ విషయమై న్యాయ
విచారణ జరిపించి నేరస్తులను శిక్షించాలని డిమాండ్‌చేస్తూ తానుకూడా 7వ తేదీ నుంచి
నిరాహారదీక్ష (యీ సమస్యనుకూడా కలిపి) చేస్తున్నట్లు ప్రకటించాడు. మేజిస్ట్రేట్,
పోలీస్ ప్రాసిక్యూటర్ కూడా యీ విషయమై తమ విచారాన్ని వ్యక్తంచేస్తూ యీ విష
యం జెయిళ్ళమంత్రికి అవసరమైన యితర అధికారులదృష్టికి తేవలసిందిగా పత్తిపాటి
వెంకటేశ్వర్లుగారిని కోరారు. కోర్టుబయట ప్రజలనుద్దేశించి ప్రసంగిస్తూ కామ్రేడ్
వరవరరావు యీ పై సంఘటనలన్నిటినీ వివరిస్తూ యీ న్యాయమైన డిమాండ్స్‌పై
ఆందోళన జరపవలసిందిగా ప్రజలను కోరాడు.



సికిందరాబాదు జెయిల్లో 'బి' క్లాసులోవున్న కామ్రేడ్స్ అందరూ జనవరి 6
నుంచి 13 దాకా రోజుకొక్కరు చొ॥న రిలే నిరాహారదీక్షలు చేశారు. కామ్రేడ్ వీర
భద్రయ్య 8 రోజులు. కామ్రేడ్ గుండు వెంకటయ్య 6 రోజులు కామ్రేడ్ గోపాల
రెడ్డి ('బి' క్లాసు) 5 రోజులు కామ్రేడ్ బర్ల యాదగిరిరాజు 4 రోజులు. కామ్రేడ్ శివ
ప్రసాద్ ('బి' క్లాసు) 3 రోజులు నిరాహారదీక్ష చేశారు. 4వ తేదీ నుంచి ఇప్పటిదాకా
రిలే నిరాహారదీక్ష చేస్తున్న వాళ్ళకుకూడా ఇంటర్వ్యూలు ఇవ్వడంగాని, ఉత్తరాలు ఇవ్వ
డంగాని రద్దుచేశారు. అనారోగ్య కారణాలవల్ల నిరాహారదీక్ష చేయనివారికి, ఉపసంహ
రించుకున్నవారికికూడా ఇంటర్వ్యూలు, ఉత్తరాలు రద్దుచేశారు. చివరకు ఎవరి పి.పి.సి.
డబ్బు నుంచి వాళ్ళకు వస్తువులు తెప్పించి ఇవ్వడానికయినా, ఆటవస్తువులు ఇవ్వడాని
కయినా, డాక్టర్ దగ్గరకు పోవడానికయినా అనుమతి నిరాకరిస్తున్నారు. జెయిల్ అధి
కారులందరూ, ముఖ్యంగా డిప్యూటీ జెయిలర్ మహమద్‌అలీ కామ్రేడ్స్‌ను దుర్భాష
లాడుతూ దౌర్జన్యంగా వ్యవహరిస్తున్నారు. డాక్టర్ నిరాహారదీక్షలోవున్న కామ్రేడ్స్
కోసం నిమ్మకాయలు, ఉడుకునీళ్ళు రాసినా యివ్వడానికి నిరాకరిస్తున్నారు. జెయిల్
అధికారులెవ్వరూ అసలు కామ్రేడ్స్‌వున్న చీకటికొట్లవైపు వెళ్ళనయినా వెళ్ళటంలేదు.
చలివల్ల శరీరం కొంకర్లుపోతూంటే ఇంకొక గొంగడి, కట్టు ఇవ్వమని కోరినా నిరాక
రిస్తున్నారు. డాక్టర్ ఒక్కొక్కరినీ వేరుచేసి 'మీ ఆరోగ్యరీత్యా మీరు నిరాహారదీక్ష
చేయడం ప్రమాదకరం' అని ఒక్కొక్కరినీ నిరుత్సాహపరిచే ప్రయత్నం చేస్తున్నాడు.
తాను సెల్ లోపలికి వెళ్ళి పరీక్ష చేయకుండా బయటికివచ్చి కింద పడుకొమ్మని అంటు
న్నాడు. 'విశాఖ జెయిల్లో ఇటీవల కామ్రేడ్స్ రంగదాస్, అమానుల్లా నిరాహారదీక్షచేస్తే
పరిస్థితి విషమిస్తే ఆసుపత్రిలో చేర్చారు. కాని మీవలె నిరాహారదీక్ష విరమించమని
ఉపదేశం చేయలేదు' అని డాక్టర్‌ను హెచ్చరిస్తే మాట్లాడడు. డాక్టర్‌నుకూడా జెయిల్
అధికారులే సరిగా చూడవద్దని హెచ్చరించినట్లు తెలుస్తున్నది. సికిందరాబాదు జెయిల్లో
మొదలు వేసిన చీకటికొట్లనుంచి కామ్రేడ్స్ సుబ్బారెడ్డి, మల్లయ్యలను కామ్రేడ్ శర్మ
నుండి వేరుచేసి గంజ్‌లో వేశారు. ముగ్గురినీ విడివిడిగా హింసించి వీళ్ళ ప్రయత్నాన్ని
పట్టుదలను వమ్ముచేయాలని వీళ్ళ కుట్ర. అయినా ఎంతో పట్టుదలతో, స్థిరంగా వీళ్ళు
పోరాటం కొనసాగిస్తున్నారు. జెయిల్లో జరిగిన లాఠీచార్జికి నిరసనగా విశాఖ జెయిల్లో
కామ్రేడ్స్ కె.జి. సత్యనారాయణ పట్నాయక్ నాయకత్వంలోవున్న నక్సలైటు ఖైదీలు
నిరాహారదీక్ష చేశారని కామ్రేడ్ భువనమోహన పట్నాయక్ ఇచ్చిన ప్రకటన. డెక్కన్
క్రానికల్, ఆంధ్రభూమి పత్రికలు యీ నిరాహార దీక్షలకు, సంఘటనలకు అర్హమైన
స్థానమిచ్చి ప్రచురించిన వార్తలు, ఇతర పత్రికల్లో వచ్చిన వార్తలు. పౌరహక్కుల
సంఘం, ఇతర ప్రజాసంఘాలు చూపుతున్న శ్రద్ధ యీ కామ్రేడ్స్‌కు గొప్ప నైతిక

జలాన్నిస్తున్నవి. ఇంకా విప్లవ రచయితల సంఘం, ఇతర ప్రజాస్వామ్యానికి ప్రాణ గర్రగానిలవాల్సిన పత్రికలు యీ విషయంలో ఆందోళనచేసి యీ కామ్రేడ్స్ న్యాయమైన డిమాండ్‌లను బలపరచవలసిందిగా విజ్ఞప్తి చేస్తున్నాము. సికిందరాబాద్ జెయిల్‌కు వచ్చినపుడు ఒ.జి (ప్రజన్స్)రాష్ట్ర పౌరహక్కుల సంఘం ప్రధాన కార్యదర్శి పత్తిపాటి వెంకటేశ్వర్లు కలిసినపుడు ఐ.జి.(ప్రజన్స్). జెయిళ్ళ మంత్రికూడా అనుకూలమయిన నిర్ణయం తీసుకుంటామని మాట యిచ్చారటకూడా. అయినా మరి, యీ విషయంలో యిన్ని రోజులు గడిచి కామ్రేడ్స్ పరిస్థితి ఆందోళనకరంగా మారుతున్నా ఎందుకింత జాప్యం అవుతున్నదో అనూహ్యం.

## మంత్రిగారిదృష్టితో చూసినా మమ్మల్ని ఒకేచోట వుంచాలి!

రాష్ట్ర న్యాయ, జైళ్ళ మంత్రి ఆసిఫ్‌పాషాగారు ఇటీవల 'ఈనాడు' (దినపత్రిక, విశాఖపట్నం) ప్రతినిధితో విజయవాడలో మాట్లాడుతూ జెయిళ్ళ సంస్కరణల గురించి చాలా విషయాలు చెప్పారు. (చూ: 'ఈనాడు' 13-1-'75 లో 2వ పేజీ 1-2 కాలమ్స్) నేరస్తులను సంస్కరించడానికి తాము చేస్తున్న ప్రయత్నాల గురించి వివరిస్తూ...... "అయితే ప్రస్తుతం మామూలు ఖైదీలకు, నక్సలైట్లకు వేర్వేరు జైళ్ళ లేకపోవడంవల్ల ప్రభుత్వం, నేరస్తుల మనస్తత్వంలో మార్పు తీసుకురావడానికి ప్రయత్నిస్తున్నా నక్సలైట్ ప్రభావం కొంతయినా మామూలు నేరస్తులపై కనబడుతున్నదనీ అందుచేతనే శ్రీకాకుళం జిల్లాలోని ఎల్విన్‌పేటవద్ద అన్ని ఆధునిక సదుపాయాలతో నక్సలైట్లకు ప్రత్యేక జైలును అతిత్వరలోనే నిర్మించడానికి ప్రభుత్వం పూనుకుంటున్నద"ని మంత్రిగారు చెప్పారు. మంత్రిగారు మనసులో అనుకున్నదే, చేయదలుచుకున్నదే చెప్తున్నట్లయితే (ఆయన అనుకుంటున్నదాంట్లోవున్న నిజానిజాలను అలావుంచి) సికిందరాబాదు కుట్రకేసులో నిందితులుగావుండి, వరంగల్, చంచల్‌గూడా, ముషీరాబాద్ జెయిళ్లలో వున్న నక్సలైట్ ఖైదీల ప్రభావంవల్ల మూడు జెయిళ్ళలోని యితర నేరస్తులు 'చెడిపోకుండా వుండడానికయినా' తక్కిన రెండు జెయిళ్ళను ఈ 'ప్రభావం'నుండి కాపాడడానికయినా మా అందరినీ ఒకే జెయిల్లో, ఒకే ఆవరణలో వుంచమని కోరడం అనుకూలంగా వుందికదా. మంత్రిగారు చేయదల్చుకున్నదే మేం అడుగుతున్నాం. ఎల్విన్‌పేటలో కొత్త జెయిలు 'ఆధునిక సదుపాయాలతో' ప్రత్యేకంగా ఏర్పాటయేనాటికి చూద్దాం. ఇప్పుడు కనీసం ఈ వున్న సదుపాయాలతోనే తృప్తిపడుతాంగాని (జెయిల్లు అత్తగారిళ్లు కాగూడదనిగదా ముఖ్యమంత్రి గారి ఆశ్రయం) మమ్మల్ని మా కేసుగురించి మాట్లాడుకొనే ప్రాథమికమైన హక్కును అనుభవించడానికికూన్నా 'నక్సలైట్ ప్రభావం'నుంచి కాపాడి 'నేరస్తుల మనస్తత్వంలో మార్పు తీసుకరావడానికి' మీరు చేయదల్చుకున్న



ప్రయోగం (Experiment) పని తేల్చుకోడానికయినా మమ్మల్ని ఒకేజెయిల్లో ఒకేచోట మీ యితర "నేరస్తులకు దూరంగా"వుంచండి. మీ అమోఘమైన ఆలోచన అతిత్వరలో ఆచరణరూపందాల్చి నేరస్తులందరూ మానవులుగా తీర్చిదిద్దబడాలనీ మీ 'విప్లవాత్మక జెయిళ్ళ సంస్కరణోద్యమం' ఫలప్రదం కావాలనీ కోరుకుంటున్నాను. అయితే నక్సలైట్లు శాశ్వతంగా వుంటారని మీరు నమ్ముతున్నందుకు వాళ్ళ నెంతకాలమయినా జైళ్ళలోనే వుంచాలని మీరు ఆలోచిస్తున్నందుకు ఈ రెండువిషయాలు అమాయకంగా అనేసినందుకు మీకు అభినందనలు. పోతే నక్సలైట్ల ప్రభావంలో జెయిల్ పోలీసులుకూడ 'నేరమనస్తత్వం' అలవరచుకునే ప్రమాదం వున్నదికనుక నక్సలైట్లను పోలీసులనుంచికూడ 'ప్రత్యేకంగా'వుంచే ఆలోచనేమైనా చేయండి.

— ఒక నక్సలైటు ఖైదీ

## వార్తలు—ఖండనలు :

గుంటూరుజిల్లా పౌరహక్కుల సంఘ కార్యదర్శి జి. కోటేశ్వరరావుగారు ఒక ప్రకటనచేస్తూ ఖమ్మంజిల్లా గలబ గ్రామంవద్ద కామ్రేడ్ కొంతన్నభార్య కామ్రేడ్ పద్మక్కను నవంబరు నెలచివరలో పోలీసులు పట్టుకొని కాల్చిచంపిన సంఘటనను ఖండించారు. ఆ విషయంపై న్యాయవిచారణ జరిపించాలని కోరారు. ఒంగోలు జిల్లా పసంగులపాడు గ్రామస్తుడు శ్రీ వీరభద్రుని కోటయ్యను రాత్రివేళ లేపి ఒంగోలు తీసుకపోయి పోలీసులు చిత్రహింసలు పెట్టడంపట్ల నిరసన తెలియజేస్తూ జిల్లా కలెక్టరుకు, జిల్లా జడ్జికి, పోలీసు సూపరింటెండెంట్‌లకు అతన్ని విడుదల చేయవలసిందిగా టెలిగ్రాములు పంపారు.

* * *

ఈ ఫాసిస్టుపాలనలో తమ హక్కుల్ని పొందడానికి సాయుధపోరాటమే ఏకైక మార్గంగా నిర్ణయించుకొని నిజామాబాద్ జిల్లా ఆర్గుల్ గ్రామ యువజనులు "ప్రగతిశీల యువజన సంఘంగా" ఏర్పడ్డారు. చుట్టుపట్ల గ్రామాలలోని పీడితులంతా తమ కష్టాలు పోగొట్టుకోడానికి సంఘాలు నిర్మించాలని వారు పిలుపిచ్చారు.

* * *

వరంగల్ రీజినల్ ఇంజినీరింగ్ కాలేజీ రాడికల్ విద్యార్థులపై పోలీసులు సాగిస్తున్న హింసాకాండను ఖండిస్తూ ఇదేవిధంగా హింసాకాండసాగితే విద్యార్థులు తిరుగుబాటు చేయగలరని తిరుపతి రాడికల్ విద్యార్థులు హెచ్చరించారు.

* * *

29-12-74న బురద వెంకటాపురం (శ్రీకాకుళంజిల్లా)లో స్థాపించబడ్డ "సమత యువజన సంఘం"వారు కిష్టాగౌడ్, భూమయ్యల ఉరిశిక్షలను రద్దుచేయాలని తీర్మానిం

చారు. వారు యింకా నక్సలైటు విప్లవకారులపైన ప్రభుత్వం సాగిస్తున్న అణచివేత విధానాన్నీ, RSU, PDSU లాంటి విప్లవకర విద్యార్థులపైసాగే హింసాకాండనూ ఖండించారు. అదేరోజు జరిగిన బహిరంగసభలో శ్రీ భూషణం. ఆర్. అప్పలనాయుడు ప్రసంగించారు- తరువాత మేరంగి "అరుణా బ్రదర్స్" వారిచే అల్లూరి సీతారామరాజు బుర్రకథానంతరం వంగపండు ప్రసాద్ "ఏరువాక"పాటలు పాడారు.

* * *

నిజామాబాద్ పౌరహక్కుల సంఘ కార్యదర్శి బి. తారకం ఒక ప్రకటనచేస్తూ కిష్టాగౌడ్, భూమయ్యలపై విధించిన ఉరిశిక్షలను మానవతావాద దృక్పథంతో రద్దు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు.

* * *

దేశంలోని వివిధ విశ్వవిద్యాలయాలకుచెందిన 61 మంది ఆర్థిక శాస్త్రవేత్తలు ఒక సంయుక్త ప్రకటన చేశారు- దానిలో వారు నక్సలైటు ఖైదీలందరినీ రాజకీయ ఖైదీలుగా తక్షణమే గుర్తించాలనీ నిష్పక్షపాత న్యాయవిచారణ వెంటనే జరిపించాలనీ ఆం.ప్ర. విరసం మేధావులపై జరుగుతున్న నిర్బంధకాండను ఉపసంహరించుకోవాలనీ. నక్సలైట్లపై జరుగుతున్న చిత్రహింసలపై నిష్పక్షపాత న్యాయవిచారణ జరిపించాలనీ కిష్టాగౌడ్ భూమయ్యల ఉరిశిక్షలు రద్దుచేయాలనీ వారు కోరారు.

* * *

'27, 28 డిసెంబరు 74 తేదీల్లో రాయచూర్‌లో జరిగిన విప్లవ కమ్యూనిస్టుపార్టీ కర్నాటకరాష్ట్ర కౌన్సిల్ బహిరంగసభలో ఆంధ్రప్రదేశ్ క్రూర ప్రభుత్వంచే రైతాంగ గెరిల్లాయోధులు కిష్టాగౌడ్ భూమయ్యలకు విధించబడ్డ ఉరిశిక్షలు త్వరగా రద్దుచేయాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు- ఇంతా రమణారెడ్డి. నాగభూషణం పట్నాయక్, సుజాతలపై విధించబడ్డ యావజ్జీవ శిక్షలను ఉపసంహరించుకోవాలనీ. ఆంధ్రప్రదేశ్ కిరాతక పోలీసులచే కాల్చివేయబడ్డ కా. పద్మక్క మరణానికి జోహార్లర్పిస్తూ పోలీసుల చర్యను ఖండించారు. విరసం రచయితలపైన కుట్రకేసులు ఎత్తివేసి వారిని బేషరతుగా తక్షణమే విడుదలచేయాలని తీర్మానించారు భారతదేశంలోని వివిధ రాష్ట్రాల్లోను, ఆంధ్రప్రదేశ్‌లోని వేర్వేరు జైళ్ళలోను నిర్బంధించబడిన సిపిఐ ఎం.ఎల్ నాయకులను వెంటనే విడుదలచేయాలనీ. సుహృద్భావపూర్వకమైన స్నేహాన్ని చైనాతో భారతదేశం నెరపాలనీ. కన్నడభాషలో వెలువడిన మావో సూక్తులపై నిషేధాన్ని కర్నాటక ప్రభుత్వం తొలగించాలనీ. తెలుగులో ప్రచురించబడ్డ యుంయు. ఇప్పుడు పీస్తున్నగాలి. రక్తగానం. బందూక్‌లపై నిషేధాన్ని ఆంధ్రప్రదేశ్ పాశవిక ప్రభుత్వం తొలగించాలనీ కూడా వారు తీర్మానించారు. ఈ తీర్మానం ప్రతులు రాష్ట్రపతికి. ప్రధాన



మంత్రికి. విరసం ప్రముఖులకు. రా.పౌ.హ.సం.కార్యదర్శికి. తెలుగు, తమిళ, కన్నడ, ఆంగ్లభాషల్లో వెలువడుతున్న అన్ని విప్లవ పత్రికలకు పంపించారు.

* * *

విప్లవ రచయితలపై.. విప్లవకారులపై కుట్రకేసులు ఎత్తివేయాలనీ, నక్సలైట్లను రాజకీయ ఖయిదీలుగా గుర్తించాలనీ, భూమయ్య, కిష్టాగౌడ్‌ల మరణ శిక్షలు రద్దుచేయాలని కోరుతూ నల్లగొండ జిల్లా విరసంశాఖ 9-1-75 నాడు నల్లగొండ వివిరా కాలేజీలో జరిగిన సభలో తీర్మానించారు.

* * *

భారత-చైనా మిత్రమండలి మహబూబ్‌నగర్ శాఖ కొల్లాపూర్‌లో జనవరి 5 న మహాసభ జరుపుకున్నది. 4 వేల మందితో ఉత్సాహంగా ఊరేగింపు జరిగింది. శ్రీశ్రీ కాశీపతి, పి. వెంకటేశ్వర్లు శతృఘ్న. మాధవరావు. డా. బాలకృష్ణయ్యలు ప్రసంగించారు. భారత-చైనా సరిహద్దు వివాదానికి భారత ప్రభుత్వమే కారణమని. ఆనెపంతో ముందుగా మన ప్రభుత్వమే దౌత్యసంబంధాలు ఉపసంహరించిందని. తిరిగి చైనాతో సంబంధాల పునరుద్ధరణకై చొరవతో మన ప్రభుత్వమే రాయబారిని చైనాలో నియమించాలనీ. భా.చై. మిత్రమండలి కార్యదర్శి కెవిఆర్‌ను. కార్యవర్గ సభ్యులు. వరవరరావు చెరబండరాజు. కోటేశ్వరరావు. యం.టి. ఖాన్‌ను సికింద్రాబాదు కుట్రకేసులో ఇరికించడాన్ని ఖండిస్తూ వారిని వెంటనే విడుదలచెయ్యాలనీ హర్షధ్వానాలమధ్య తీర్మానించారు. మార్క్సిజం-లెనినిజం-మావో ఆలోచనా విధానం దిక్సూచిగా ఘనవిజయాలు సాధించి అక్టోబరు విప్లవ రజతోత్సవాలు జరుపుకుంటున్న జనచైనా ప్రజలకు జేజేలుపలికారు.

* * *

21-1-'75 సాయంత్రం తిరుపతి పట్టణ రాడికల్ స్టూడెంట్స్ యూనియన్ సభ్యులు తిరుపతిలో జరుగుతున్న "హిందూ ధర్మ సమ్మేళనాన్ని" ఖండిస్తూ కొన్ని వేల కరపత్రాల్ని జనంలో విస్తృతంగా పంచారు. ఒకానొకదశలో జనసంఘం కార్యకర్తలు కరపత్రాల్ని తీసుకొని చించివెయ్యగా వాళ్లని తీవ్రంగా ఎదుర్కోటం జరిగింది. ఆ దెబ్బతో జనసంఘీయులు తోకముడిచి పారిపోయారు. లక్షల ఖర్చుతో ప్రజలసొమ్మును బాబాల, దొంగసన్యాసుల మీటింగులకు ఖర్చుపెట్టటాన్ని వ్యతిరేకిస్తూ విద్యార్థులు చేపట్టిన ఉద్యమానికి ఎంతో మంది తమ ఆమోదాన్ని తెలియజేశారు. ముఖ్యంగా కార్మికవర్గం దేశంలో ప్రజలు ఆకలిచావులతో. కరువుతో. అధికధరలతో బాధపడుతూంటే వెంగళ్రావ్ ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాన్ని దుర్మార్గంగా ప్రజాధనాన్ని వ్యయంచేయటాన్ని నిరసించారు.

— రాడికల్ స్టూడెంట్స్, తిరుపతి.

### కోర్టులో కలకలం :

డిసెంబర్ 16వ తేదీన కోర్టులో హాజరుపరచబడ్డ విప్లవ రచయిత యం. టి. 
ఖాన్ ఈ క్రింది ప్రకటన చేశారు. "ప్రముఖ న్యాయవాది. నక్సలైటు కేసులు వాది
స్తున్న డిఫెన్సు కమిటీ సభ్యుడు శ్రీ రావి సుబ్బారావుగారి మరణానికి చింతిస్తూ, వారి
కుటుంబానికి మా సానుభూతి అందజేస్తున్నాం. వైద్యలోపంవల్ల, అధికార్ల నిర్లక్ష్యం
వల్ల, అసౌకర్యాలవల్ల రాజమండ్రి జైలులో కామ్రేడ్ నేతగాని రాఘవులు మరణిం
చాడు. లోగా గడ్డం కోటారెడ్డి పై కారణాలవల్ల అదే జైలులో మరణించాడు ఇలా
కామ్రేడ్స్‌ను అనారోగ్యానికి గురిచేసి చంపుతున్న జైల్ అధికారుల, ప్రభుత్వ ఫాసిస్టు
విధానాన్ని మేం ఖండిస్తూ నిష్పాక్షిక న్యాయవిచారణ జరపాలని డిమాండ్ చేస్తున్నాం.
అక్రమంగా పరిటాల శ్రీరాములుపై మోపిన కుట్రకేసులు ఎత్తివేయాలని. నిమ్మపల్లి
మొదలగు గ్రామాల్లోని రైతాంగం, విద్యార్థులపై మోపిన 'సిరిసిల్ల కుట్రకేసు'ను ఎత్తి
వేయాలనీ, కామ్రేడ్ పద్మక్క మరణంపట్ల నిష్పాక్షిక న్యాయవిచారణ జరిపించాలనీ
మేం డిమాండ్ చేస్తున్నాం. దేశాన్నే ఒక పోలీసు క్యాంపుగా చేసిన యీ ఫాసిస్టు
ప్రభుత్వం దేవరుప్పుల, ధర్మాపురం, చెన్నూరుల్లో ఏర్పరిచిన క్యాంపులు ఎత్తివేయా
లనికూడా మేం డిమాండ్ చేస్తున్నాం. తన పాలనలో తుపాకీతూటాలకు, లాఠీలకు
తప్ప ఇంకెవరికీ గొంతువిప్పే అధికారంలేదని ఫ్యూడల్ అహంకారంతో విర్రవీగే
వరంగల్ ఎస్పీ భాస్కరరెడ్డిలాటి పాలకవర్గాల కావలికుక్కలను పిచ్చికుక్కలవలె
తరిమి శిక్షించే కాలం వచ్చిందని గుర్తించమని హెచ్చరిస్తున్నాం."

1. సామ్రాజ్యవాద నయావలస భారత ప్రభుత్వం నశించాలి 2. భూస్వామ్య
ప్రభుత్వం నశించాలి: 3. కుట్రదారు ప్రభుత్వం నశించాలి, 4. దోపిడి ప్రభుత్వం
నశించాలి. 5. బూర్జువా ప్రభుత్వం నశించాలి: 6 విస్తరణవాద ప్రభుత్వం నశిం
చాలి, 7. సిక్కింపై భారత ప్రభుత్వ దురాక్రమణ నశించాలి. 8 నాగా ప్రజలపై
భారత ప్రభుత్వ మిలిటరీ శక్తులు నశించాలి. 9. మిజో ప్రజలపై భారత ప్రభుత్వ
మిలిటరీతత్వం నశించాలి. 10. కాశ్మీరు ప్రజలపై భారత ప్రభుత్వ మిలిటరీ తత్వం
నశించాలి. 11. మిలిటరీ ప్రభుత్వం నశించాలి, 12. పోలీసు ప్రభుత్వం నశించాలి
13. అర్ధఫాశిస్టు ప్రభుత్వం నశించాలి. 14. దొంగనోట్ల దొంగఓట్ల ప్రభుత్వం నశిం
చాలి. 15. ప్రజల ప్రాణాలుతీసే ప్రభుత్వం నశించాలి. 16. ఉరిశిక్షలు రద్దుచేయాలి
17. కామ్రేడ్స్ భూమయ్య. కిష్టాగౌడ్‌లపై ఉరిశిక్షలు రద్దుచేయాలి. 18. కామ్రేడ్స్
విశ్వరూపన్ గోపీనాధ్ కురుక్కన్, భాస్కర్ పిళ్ళైలపై ఉరిశిక్ష రద్దుచేయాలి(కేరళలో
ఉరిశిక్షలకుగురై జైళ్ళలో మగ్గుతున్న నక్సలైట్లు) 19 అమెరికన్ సామ్రాజ్యవాదం
నశించాలి. 20. సోవియట్ సోషల్ సామ్రాజ్యవాదం నశించాలి 21. విప్లవంవర్ధి



ల్లాలి. 22. భారత రైతాంగ సాయుధపోరాటం వర్ధిల్లాలి. 23. భారత కమ్యూనిస్టు
పార్టీ (మా-లె) వర్ధిల్లాలి. 24. సాయుధపోరాట ఎర్రజెండా చిరకాలం వర్ధిల్లాలి.
25. ఎర్రకోటపై ఎర్రజెండా ఎగరాలి. 26. నక్సల్‌బరీ సాయుధ రైతాంగపోరాటం
వర్ధిల్లాలి. 27. శ్రీకాకుళ రైతాంగ సాయుధపోరాటం వర్ధిల్లాలి. 28. మావో ఆలో
చనా విధానం వర్ధిల్లాలి. 29. జనచైనాకు మా విప్లవ జేజేలు. 30. చైర్మన్ మావో
చిరకాలం వర్ధిల్లాలి మొదలగు నినాదాలతో 26-1-1976 భారత రిపబ్లిక్‌డే రజితోత్సవ
సందర్భంగా ముషీరాబాద్ డిస్ట్రిక్ట్ జైల్ మార్మోగింది. CPI(M-L) కామ్రేడ్స్ అధి
కార్ల అదిరింపులకు బెదరక తమ కర్తవ్యాన్ని నెరవేర్చారు. వారు స్వీట్సు కొరకై
వారికివ్వబడే 40 పైసలు తిరస్కరించారు, నినాదాల అనంతరం సమావేశమై దోపిడి
వర్గాల పాలనలో దేశపరిస్థితిని చర్చించి, తమ విప్లవకార్యదీక్షలో ఎంతటి కష్టనష్టాల
కైనా ఎదుర్కొనుటకు వెనుకంజవేయరాదని నిర్ణయించుకున్నారు. — ప్రజాసాక్షి

(ముషిరాబాద్ జైలులోని CPI(M-L) కామ్రేడ్స్)

కేరళలోని ఒకానొక బూర్జువాకోర్టు నిస్వార్థ ప్రజాసేవకులు, విప్లవకారులు
అయిన కామ్రేడ్స్ విశ్వరూపన్, గోపీనాధ్ కురుక్కన్, భాస్కర్ పిళ్ళైలకు ఉరి
శిక్షలు విధించింది– బూర్జువాకోర్టు యిచ్చిన యీ ప్రజావ్యతిరేక తీర్పును తీవ్రంగా
ఖండిస్తూ పై ముగ్గురి కామ్రేడ్స్ ఉరిశిక్షలను రద్దుచేసి వారిని బేషరతుగా విడుదలచేయా
లని విరసం వరంగల్ యూనిట్ డిమాండ్ చేస్తున్నది.

## విరసం 5వ మహాసభల తీర్మానాలు

(అనంతపురం - జనవరి 1975)

1. **మృతవీరులకు జోహార్లు:** రాజమండ్రి సెంట్రల్ జైల్‌లో గడ్డం కోటారెడ్డి,
నేతగాని రాఘవులు (మా-లె కార్యకర్తలు) అధికార్ల నిర్లక్ష్యంవల్ల మరణించడం పట్ల
ప్రభుత్వం నిష్పాక్షిక విచారణజరిపించాలని డిమాండ్‌చేస్తూ, వారికి విరసం విప్లవాంజలి
ఘటిస్తోంది. వరంగల్ జిల్లాలో కా॥ పద్మక్క మరిఒక కామ్రేడ్ కాల్పులలో మర
ణించడంపట్ల న్యాయవిచారణ జరిపించాలని డిమాండ్ చేస్తో వారికి విప్లవాంజలి ఘటి
స్తోంది. విప్లవకారులను ఇలా జైళ్లలోను, కాల్పుల్లోను చంపడంద్వారా విప్లవాన్ని
ఆపలేరని విరసం హెచ్చరిస్తోంది.

2. **విప్లవకారుల నిరవధిక నిరాహారదీక్ష :** 1974 డిసెంబరు 28 నుండి సికింద్రా
బాదు కుట్రకేసుగా పిలువబడుతున్న కేసులోని విప్లవకారులు, విప్లవరచయితలు ఒకే
కేసులోవున్న వారిని ఒకే జైల్లో వుంచాలని నిరాహారదీక్ష చేస్తున్నారు. న్యాయమైన

వారి కోర్కెను సమ్మతించక లాఠీచార్జీకూడా జరిపారు. చీకటికొట్లలో వేశారు. వెంటనే ఒకే కేసులోని వారిని ఒకే జెయిలులో వుంచాలనే వారి కోర్కెను ప్రజాతంత్రవాదులు బలపర్చాలని విరసం కోరుతోంది.

3 భారత ఆర్థికవేత్తల నిరసన – అభినందన: కొందరు ఆర్థిక శాస్త్రవేత్తలు నక్సలైట్లను రాజకీయ ఖైదీలుగా గుర్తించాలని, మా-లె పార్టీ కార్యకర్తలు కిష్టాగౌడ్ భూమయ్యల ఉరిశిక్ష రద్దుచేయాలనీ విరసం రచయితలపై మోపిన కుట్రకేసుల్ని ఎత్తివేయాలనీ ప్రభుత్వాన్ని కోరుతూ విశాఖ నుండి ప్రకటించడంపట్ల విరసం వారిని అభినందిస్తున్నది.

4 బంగ్లాదేశ్‌లో అత్యయికపరిస్థితి: భారత విస్తరణవాదుల, సోవియట్ సామ్రాజ్యవాదుల అక్రమబిడ్డగా అవతరించిన బంగ్లాదేశ్ అసలురంగు బయటపడింది. ఈమధ్య అక్కడ సమావేశాలు, సమ్మెలపై నిషేధాన్ని విధించి ప్రజల మిలిటెంట్ పోరాటాలకు భయపడిపోయి ఫాసిస్టుపద్ధతిలో ప్రవర్తిస్తోంది. ఈ దమననీతిని విరసం ఖండిస్తోంది. మా-లె కార్యకర్త సికిందర్‌సిరాజ్ మృతికి విప్లవ జోహార్లు చెబుతూ అతణ్ని చంపిన బంగ్లాదేశ్ పోలీసు చర్యను ఖండిస్తూంది.

5 విరసం కార్యకలాపాలపట్ల విప్లవాభిమానులు, విప్లవ సంస్థలు విరసం ఐక్యతకు భంగంకలగనిరీతిలో విప్లవోద్యమానికి తోడ్పడేలా మాత్రమే వుండాలని కోరుతున్నం.

6 కర్నూలుజిల్లా రైవందిన్నె, లొద్దిపల్లె గ్రామాల్లో రైతుకూలీ కార్యకర్తలపై తప్పుడు కేసులు బనాయించి భీభత్సం సృష్టించడంద్వారా ప్రజా ఉద్యమాన్ని అణిచే ప్రయత్నం చేస్తున్న ఫాసిస్టు ప్రభుత్వ విధానాన్ని ఖండిస్తోంది.

7 వరంగల్ జిల్లా పోలీసు సూపరింటెండెంట్ అక్కడి ఇంజనీరింగ్ కాలేజి ఆర్.ఎస్.యు. విద్యార్థులపై తీవ్రమైన నిర్బంధకాండను సాగిస్తున్నాడు. కోర్టులో హాజరు పరచకుండా కస్టడీలోనే హింసిస్తున్నాడు. వి.ర.సం; ఆర్.ఎస్.యు; పి.డి.ఎస్.యు. విద్యార్థుల సభలకు మైక్ పర్మిషన్ నిరాకరిస్తున్నాడు. లోపల ముఖ్యమంత్రి ఆదేశం లేనిదే ఇతడిట్లా ప్రవర్తించడు. ఆర్.ఎస్.యు. విద్యార్థులపై అక్రమ కేసులను ఖండిస్తూ వారికి మైక్ పర్మిషన్ ఇవ్వాలని విరసం డిమాండ్ చేస్తున్నది.

8 అంతరంగిక భద్రతాచట్టంలో సవరణద్వారా నియంతృత్వ విధానానికి నిలయంగా భారతదేశం మారింది. రాజ్యాంగంలోని 14, 21 ఆర్టికల్స్ పూర్తిగా 22వ ఆర్టికల్‌లోని 4, 5, 6, 7 క్లాజులు ఈ చట్టంకింద నిర్బంధింపబడిన పౌరులకు వర్తించదు. అంటే నిర్బంధింపబడిన 6 నెలల దాకా న్యాయస్థానానికి మొరపెట్టుకునే అవకాశంలేదు. పార్లమెంటు సమావేశం లేనపుడు రాష్ట్రపతిద్వారా ఈ సవరణ జరిగింది. బూర్జువా



ప్రజాస్వామిక వ్యవస్థ తన నియంతృత్వానికి అడ్డుగావున్న కొద్దిపాటి పౌరహక్కులను గూడా తొలగించబూనుకుంది. విరసం ఈ విధానాన్ని నిర్ద్వంద్వంగా ఖండిస్తోంది.

9 సిరిసిల్ల కుట్రకేసు: వీర తెలంగాణ పోరాటకాలంలో తనకు గిట్టనివారంతా కమ్యూనిస్టులని ఎందరి ఉసురోపోసుకున్న స్థానిక భూస్వామి బింతల రాఘవరావు ఇప్పుడు వెనకటిలా తనకు ప్రజలు వెట్టిచాకిరీ చేయడంలేదని హరిజనులపై కత్తిగట్టి, వారి పంటను తన ట్రాక్టరుతో ధ్వంసం చేయించబూనాడు. ఎదురుతిరిగినవారిపై పోలీసులను వెంగళరావు ప్రయోగించాడు. భూస్వామిని దారికాచి చంపబూనుకున్నారని ఆరోపించి 14 మందిని అరెస్టుచేసి బెయిలుమీదవదిలి తిరిగి సమాచారంకోసం 7 గురిని మళ్లీ పట్టుకుని 18 రోజులు చిత్రహింసలపెట్టడం గత జులైలో జరిగింది. ఆగస్టులో సిరిసిల్ల మొర్రిగుట్టవద్ద పట్టుబడ్డ సాయుధులైన 14 మంది వీరేనని అసెంబ్లీలో వెంగళరావు లోకంకళ్లలో దుమ్ముచల్లజూశాడు. సమాచారంకోసం బంధించిన 7 గురు కాక మిగిలినవారు కోనరావుపేటలో అందరూ చూస్తుండగా అరెస్టయినవారే. వెంగళరావు ప్రకటన తర్వాత మరో నలుగురిని నిర్బంధించడం జరిగింది. 24 తుపాకులతో సహా గడ్డిగుట్టలో పట్టుబడింది వీరేనని పోలీసులు ప్రకటించారు. నిమ్మపల్లి, కోనారావుపేట, ఈర్నపెల్లిల్లో పోలీసు క్యాంపులుపెట్టి రైతుకూలీ సంఘాలతో సంబంధం ఉందని అనుమానించిన ప్రతివాడినీ హింసించడం జరుగుతోంది. అడవి ప్రాంతంలో సంఘంపేరైనా వినరాగూడదని వెంగళరావు ఆజ్ఞాపించాడు. హరిజనులు, రైతులపేర తీవ్రవాదులు పనిచేయటం సహించేదిలేదని అసెంబ్లీలో ప్రకటించాడు. అయితే తాము చేయవల్సిందేమిటో రైతుకూలీలకు బాగాతెల్సు. ఆయుధాలను, ఆయుధాలతో ఎదిరించందే ప్రజలు పంటలుగానీ భూములుగానీ దక్కించుకోజాలరు. కుట్రకేసులుగానీ, చిత్రహింసలుగానీ సంఘబలాన్ని ఆపలేవని విరసం హెచ్చరిస్తోంది. ప్రభుత్వానికి ప్రజలు శాస్తి చేయాలి. కుట్రలను భగ్నంచేయాలి. సాయుధరైతాంగ పోరాటాన్ని ముందుకి నడిపించాలి.

10 చీకటి ఖండమని శ్వేతజాత్యహంకారులు వర్ణించిన ఆఫ్రికా, సామ్రాజ్యవాదుల చేతబడి చీకటి ఖండంగానే ఉంది. అక్కడ ఫ్రెంచి, పోర్చుగీసు, బెల్జియన్, బ్రిటిష్ సామ్రాజ్యవాదులు ప్రత్యక్షంగా, పరోక్షంగా తమ వలసాధిపత్యాన్ని కాపాడుకుంటూ వచ్చారు. అయితే ఆఫ్రికా కన్నుతెరిచింది. పశ్చిమాఫ్రికాలోని బిసీ-గిస్సా దీవులు స్వతంత్రం ప్రకటించుకున్నాయి. కేప్ వెర్డేదీవులుకూడా స్వతంత్రమయాయి. 1975 జూన్ నుండి మొజాంబిక్ స్వతంత్రం కాబోతున్నది. కామోరోద్వీప సమూహం గత సెప్టెంబర్‌లో స్వాతంత్ర్యాన్ని వరించింది. అంగోలా, నాంబియాలలో ఇంకా పోరాటం సాగుతూనేవున్నది. శ్వేతజాతీయులు నాంబియాను తమకిందనే వుంచుకునే ప్రయత్నాలు చేస్తున్నారు. అల్పసంఖ్యాకులైన యూరపియన్ వలసాధిపతులకు వ్యతిరేకంగా

నాంబియా, రొడీషియా, దక్షిణాఫ్రికాలలో తీవ్రమైన పోరాటాలు సాగుతున్నాయి. ఆఫ్రికా విముక్తి వుద్యమాన్ని విరసం అభినందిస్తోంది. ఆఫ్రికా ఆఫ్రికన్లకే దక్కాలి! పాత, కొత్త సామ్రాజ్యవాదం నశించాలి!

⑪ పాలస్తీనా ప్రజల జాతీయ హక్కులసమస్య ఇజ్రయిల్ దురాక్రమణకు గురైన అరబ్ ప్రాంతాల సమస్య నిజానికి వేర్వేరు సమస్యలుకావు. యూదులు, ముస్లిములు, క్రైస్తవులకలసి నివసించే అభ్యుదయాత్మక మతాతీతరాజ్యంగా పాలస్తీనాను రూపొందించాలని పాలస్తీనా విమోచనసమితి నాయకుడు యాసర్ అరాఫత్ ఐ.రా.స లో లక్ష్య నిర్దేశంచేశాడు. లక్ష్యసాధనకై సాయుధపోరాటం సాగిస్తున్న పాలస్తీనా విమోచన సమితికి విరసం జేజేలు! అమెరికన్, సోవియట్ సోషల్ ఇంపీరియలిజం నశించాలి!

⑫ ప్రపంచ తెలుగు మహాసభలు జరిపి తెలుగుప్రజలమధ్య సత్సంబంధాలు నెలకొల్పుతామంటూ వెంగళరావుచేసే ప్రయత్నం ప్రజాధనంతో మేధావులను తన రాజకీయ ప్రయోజనాలకై కొనడానికిచేసేకుట్రతప్ప వేరుకాదు. ఇవి ప్రజలదృష్టిని సమస్యల నుండి మళ్ళించడానికి చేసే ప్రయత్నాలు.

⑬ అనాదిగా స్త్రీస్థానం అట్టడుగునవుంటూ వచ్చింది. సాంఘికంగా, ఆర్థికంగా వెనక్కి నెట్టబడ్డ స్త్రీ తన అధోగతి గుర్తించి తిరగబడుతోంది. అమెరికాలో Feminest movement వుధృతంగా సాగుతోంది. వ్యక్తిత్వం గుర్తింపబడాలనీ Manis mortal ని Woman is mortal గా మార్చాలనీ, వారి డిమాండ్లు. ఇలాంటివాటివల్ల స్త్రీకి స్వేచ్ఛ లభించదు. మనిషిని మూడు భూతాలు పీడిస్తున్నాయి. 1) సామ్రాజ్య వాదం 2) భూస్వామ్యవిధానం 3) పెట్టుబడిదారీవిధానం. కాని స్త్రీని నాలుగోదయ్యం సాంఘిక అసమానత పీడిస్తోంది. అందువల్ల స్త్రీలు సాయుధపోరాటంలో పాల్గొని తమ కర్తవ్యాన్ని నిర్వహించాలని విరసం కోరుతోంది.

⑭ విరసం కర్నూలు మహాసభనుండికూడా వ్యక్తివాద ధోరణులతో సంస్థ లక్ష్యలకు నష్టకరంగా జ్వాలాముఖి, నిఖిలేశ్వర్‌లు ప్రవర్తిస్తూవచ్చారు. ఆ సభలలో తమంతట తామే బాధ్యతలనుండి తప్పుకొని సహాయ నిరాకరణ వైఖరి ప్రారంభించారు. చివరకు అనంతపురం మహాసభలను భగ్నంచేసేందుకు సిద్ధమైవచ్చి తమ అల్లరిద్వారా కార్యక్రమాలు అడ్డుకోచూశారు. ఈకింది గుంటూరు యూనిట్ సభ్యులు గత రెండేళ్లగా తాము విరసం సభ్యులమన్నమాటే మరిచి కొన్ని స్థానిక సాంస్కృతిక దళాలు నిర్మించి చీలికదార్లుగా వ్యవహరిస్తూవచ్చారు. ఇప్పుడు జ్వాలా, నిఖిల్‌లతో ప్రత్యక్షంగా చేయికలిపి అనంతపూర్ మహాసభలు విచ్ఛిన్నంచేయ ప్రయత్నించారు. తమ పన్నాగాలు ఫలించకపోయేసరికి అక్కసుకొద్దీ విరసం కేవలం ఒక రాజకీయ ముఠాగా మారిందని ఆరోపణచేస్తూ విప్లవ సాహిత్యోద్యమానికి భంగకరంగా రాజీనామానిచ్చారు.

వీరు ఆరోపించినట్టు విరసం ఏ రాజకీయసంస్థకు "జేబుసంస్థ"కాదు. భారత జనతా ప్రజాస్వామిక విప్లవంలో సాంస్కృతిక సైన్యంగా వ్యవహరించే విరసంలో ఇలాంటి విచ్ఛిన్నకారులను ఉండనివ్వడం సంస్థకే హానికరం. అందుచేత విరసం సర్వసభ్య సమావేశం ఈ కిందివారిని సభ్యత్వంనుండి తొలగిస్తున్నది.

విప్లవం వర్ధిల్లాలి! విప్లవ రచయితల సంఘం వర్ధిల్లాలి!!

1) జ్వాలాముఖి 2) నిఖిలేశ్వర్ 3) సత్యం 4) జగన్‌వీలీ 5) జైరాం 6) కొత్తపల్లి రవిబాబు 7) భార్గవశ్రీ 8) అరుణ్‌బాబు 9) టి. యల్. నారాయణ 10) మండవ రామారావు 11) సూరపనేని శేషగిరిరావు 12) వెంకటరెడ్డి 13) శతాబ్ 14) గొల్లాపిన్ని శేషశాస్త్రి.

⑮ కడపజిల్లా విరసం సభ్యులు కొంతకాలం విరసం కార్యకలాపాలకు దూరంగా వుంటూ ఆ జిల్లా యూనిట్‌ను నామమాత్రంగా మిగిల్చారు. అనంతపురం సభలలో వీరు జిల్లా యూనిట్ పేరుతో సభ్యులపేర్లయినా ఇవ్వకుండా విరసంపై అతినీచమైన నిరాధార నిందారోపణచేస్తూ అప్రతిష్టపాలుచేయడానికి ప్రయత్నించిన మొత్తం కడప జిల్లా యూనిట్‌ను సర్వసభ్య సమావేశం సభ్యత్వంనుండి తొలగిస్తున్నది.

⑯ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కుట్రపై కుట్రగా తిరిగి తిరుపతి కుట్రకేసులో విరసం రచయితల్ని, విద్యార్థుల్ని, పేదరైతుల్ని అందులో ఇరికించింది. బెయిల్ ఇచ్చినట్టే ఇచ్చి వెంటనే సాక్ష్యసేకరణకు అడ్డుకల్గిస్తున్నారనే నెపంతో బెయిల్ క్యాన్సిల్ చేయాలని ప్రభుత్వం హైకోర్టుని కోరింది. ఇది కుట్రపైకుట్ర. విరసం ఈ పోలీసుచర్యను ఖండిస్తోంది.

⑰ సైప్రస్‌లోని గ్రీకు సైప్రియెట్లు, టర్కిష్ సైప్రియెట్లమధ్య వివాదాలు సృష్టించి ఆ ప్రాంతంలో తమ ప్రాబల్యాలు పెంచుకొనేందుకు ప్రయత్నించే అమెరికన్, రష్యన్ సామ్రాజ్యవాద కుట్రల్ని అంతర్జాతీయ నేరాలుగా పరిగణించి విరసం ఆ కుట్రల్ని ఖండిస్తున్నది.

⑱ కన్వీనర్లకు...

యూనిట్‌లోని అందరి సభ్యుల అడ్రసులు పంపించండి. సభ్యులందరు సభ్యత్వ రుసుం కట్టలేదు. హాజరుకాని సభ్యులుకూడా సభ్యత్వ రుసుం చెల్లించాల్సివున్నది. అందుచేత కొన్ని సంవత్సరాలుగా సభ్యత్వం చెల్లించనివారుకూడ ఈ సంవత్సర చందాడబ్బుతో కలిపి మొత్తం చెల్లించాల్సివుంది. కన్వీనర్లు ఈ విషయమై శ్రద్ధచూపాలి. మన సభ్యులపై ఎన్నో కేసులున్నందున ఆ ఖర్చు చాలాఅవుతోంది. అందువల్ల రక్షణ నిధికి ప్రతియూనిట్ ప్రతి నెలా కార్యదర్శికి పంపాలి. ప్రధానంగా విరసం రచయితల సంస్థ కాబట్టి ప్రతిసభ్యుడు ఏదో రచనచేసి ప్రధాన కార్యదర్శికి పంపాలి. ఈ విషయంలో అశ్రద్ధ కూడదు. చందాబకాయిలు, డిఫెన్సునిధి, రచనలు త్వరలో కార్యదర్శికి పంపేందుకు ప్రయత్నించాలని కోరుతున్నాం.

సం॥ కాశీపట్నం రామారావు
కార్యదర్శి.

SRJANA Telugu Monthly Feb. '75 H/WL-10
Regd. No. with Registrar of News Papers 10953/67

## ప్రస్తుతం సృజనవద్ద వున్న విప్లవ సాహిత్యం

| | | | |
|---|---|---|---|
| 1. | ఎరుపు — జనవరి 74 | విరసం సంచిక | రు. 2-00 |
| 2. | ఎరుపు — జూలై 74 | ,, | 2-25 |
| 3. | వైరుధ్యాలు | మావో సేటుంగ్ | 0-50 |
| 4. | బుల్లెట్ - I | విరసం నగరశాఖ | 0-50 |
| 5. | బుల్లెట్ - II | ,, | 0-20 |
| 6. | విప్లవ రచయితలపై ప్రభుత్వ చార్జిషీటు | | 0-70 |
| 7. | ప్రజలు విప్లవాన్ని కోరుతున్నారు. విప్లవం కుట్రకాదు | | 0-30 |
| 8. | జనసేన పాటలు | జనసేన | 1-00 |
| 9. | ఎర్రపిడికిలి | కె. వి. రమణారెడ్డి | 3-00 |
| 10. | ఏరువాక | ప్రసాదరావు | 1-20 |
| 11. | చారుమజుందార్ రచనలు | చారుమజుందార్ | 3-50 |
| 12. | పార్టీలో కార్యవిధానాన్ని సరిచేసుకోవాల్సిన అవసరం | మావో సేటుంగ్ | 0-30 |
| 13. | సోషల్ సామ్రాజ్యవాద ఆర్థిక దోపిడి | ,, | 0-35 |
| 14. | జనచైనా పత్రికల వ్యాసాలు | ,, | 1-00 |
| 15 | ఉప్పెన - I భాగం | నవల చా-లిపో | 2-50 |
| 16. | జనం ఊపిరితో... | ఖైదీగీతం | 0-50 |
| 17. | అమరవీరుల జీవిత చరిత్రలు | | 3-00 |
| 18. | గమ్యం | చెరబండరాజు పాటలు | 2-00 |
| 19. | చారుమజుందారి | సంస్మరణ కవితలు | 0-80 |
| 20. | విమర్శలు - ఆత్మవిమర్శలు | కె. వి. రమణారెడ్డి | 0-40 |
| 21. | ఊరేగింపు | వరవరరావు | 1-25 |
| 22 | ఎర్రమందారాలు | నిజం | 1-00 |
| 23. | జీవనాడి | వరవరరావు | 2-00 |
| 24. | అడివంటుకుంది | భూషణం | 1-25 |
| 25. | భారత ప్రజావిమోచన సైన్యం | మావోసేటుంగ్ | 0-15 |
| 26. | సమసమాజంలో విద్య | | 1-25 |
| 27. | నిజాలు | | 1-25 |

Rs. 1-50

SRJANA
Hanamkonda
Warangal - 506001